WWW.SAKSHYAM.COM

సత్యం, సమర్థత, విశ్వసనీయత

# సాక్ష్యం

తెలుగు దినపత్రిక

Telangana

హైదరాబాద్
ఆదివారం 10 ఆగస్టు 2025
Published from Hyderabad, Karim nagar & Nalgonda, Vijayawada.

సంపుటి: 16 | సంచిక: 223
పేజీలు: 08 | వెల: రూ.2:00



## పిల్లల సమక్షంలో ప్రధాని రక్షాబంధన్

న్యూఢిల్లీ,ఆగస్ట్9(సాక్ష్యం): ప్రధాని నరేంద్రమోదీ రక్షా బంధన్ వేడుకలను విద్యార్థులు, ఆధ్యాత్మిక సంస్థ బ్రహ్మకుమారి సభ్యులతో కలిసి జరుపుకొన్నారు. ఢిల్లీలోని ప్రధాని నివాసంలో శనివారం ఉదయం 7 గంటల సమయంలో పలువురు విద్యార్థులు, బ్రహ్మకుమారి సభ్యులు మోదీకి రాఖీ కట్టారు. అనంతరం మోదీ వారితో కొంతసేపు సరదాగా ముచ్చటించారు. ఈ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా

మిగతా 2 లో..



## పదవీకాలం ముగిసినందున జోక్యం చేసుకోలేం

**చెన్నమనేని రమేశ్ పౌరసత్వ వివాదంలో కీలక పరిణామం**

**హైకోర్టు తీర్పునే సమర్థించిన సుప్రీంకోర్టు**

**ఆది శ్రీనివాస్ పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీం**

హైదరాబాద్,ఆగస్టు9(సాక్ష్యం): వేములవాడ నియోజకవర్గానికి సంబంధించి పదిహేనేళ్లుగా కొనసాగుతున్న పౌరసత్వ వివాదానికి సుప్రీంకోర్టు శుక్రవారం ముగింపు

మిగతా 2 లో..

# ఎన్టీపీసీ ప్రతిపాదనకు ప్రభుత్వం సుముఖత..!

**సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల ఏర్పాటు**

- రూ.80,000 కోట్ల పెట్టుబడులకు ఆసక్తి
- సీఎం రేవంత్ రెడ్డితో ఎన్టీపీసీ చైర్మన్ భేటీ



హైదరాబాద్,ఆగస్టు9(సాక్ష్యం): తెలంగాణకు ఇదో శుభకర దినంగా చెప్పాలి. పునరుత్పాదక ఇంధన రంగంపై దృష్టి సారించిన జాతీయ శక్తి రంగంలో అగ్రగామి ఎన్టీపీసీ.. రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు సన్నద్ధమైంది. సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గురుదీప్ సింగ్ నాయకత్వంలోని ప్రతినిధుల బృందం.. జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆయన నివాసంలో సమావేశమయ్యారు. తమ భవిష్యత్ ప్రణాళికలను వివరించింది. రాష్ట్రంలో సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులపై దాదాపు రూ.80,000 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నట్లు ఎన్టీపీసీ వెల్లడించింది. ముఖ్యంగా ఫ్లోటింగ్ సోలార్.. నీటి మీద తేలియాడే సౌర విద్యుత్ ప్లాంట్ల ద్వారా తెలంగాణలో సుమారు 6,700 మెగావాట్ల ఉత్పత్తి సాధ్యమని సంస్థ ప్రతినిధులు వివరించారు. ఈ ప్రాజెక్టులు రాష్ట్రానికి శక్తి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడమే కాకుండా.. పర్యావరణ పరిరక్షణతో ఉపాధి అవకాశాల సృష్టించడం.. భూమి వినియోగం లేకుండా విద్యుత్ ఉత్పత్తి వంటి అనేక లాభాలను అందిస్తాయని ముఖ్యమంత్రికి ఎన్టీపీసీ ప్రతినిధులు వివరించారు. రాష్ట్రంలోని పెద్ద రిజర్వాయర్లు, జలాశయాలు ఈ ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులకు అనువైన వనరులుగా మారనున్నాయని నిపుణులు భావిస్తున్నారు. పెరుగుతున్న విద్యుత్ అవసరాలను తీర్చడంలో

మిగతా 2 లో..

## ప్రభుత్వ భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్స్

- రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం
- తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- జిల్లాల కలెక్టర్లతో భట్టి విక్రమార్క సమీక్ష
- ఖాళీ స్థలాలను గుర్తించాలని ఆదేశం



హైదరాబాద్,ఆగస్టు9(సాక్ష్యం): సోలార్ విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుందని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గ్రామ పంచాయతీల నుంచి సెక్రటేరియట్ వరకు అన్ని భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్స్ ఏర్పాటు చేస్తామన్నారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో శనివారం నాడు ప్రభుత్వ భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు, ఆర్ఓఎఫ్ఆర్ భూముల్లో ఇందిరా సౌర గిరిజన వికాసం పథకం అమలుపై జిల్లా కలెక్టర్లతో భట్టి విక్రమార్క సమీక్షించారు.

మిగతా 2 లో..

# ట్రంప్ సుంకాల పేకమేడ కూలిపోతుంది

**అమెరికా ఆర్థికవేత్త కీలక వ్యాఖ్యలు**

**ఓపిక పట్టండి అంటూ భారత్‌కు సలహా**

న్యూఢిల్లీ,ఆగస్ట్9(సాక్ష్యం): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల పేరుతో భారత్‌పై అక్కసు వెళ్లగక్కుతున్నారు. దానిపై సొంత దేశంలోనే ట్రంప్‌కు వ్యతిరేకత ఎదురవుతోంది. పలువురు రాజకీయ నాయకులు, ఆర్థికవేత్తలు ట్రంప్ టారిఫ్ వార్‌ను ఖండిస్తున్నారు. ఇప్పుడు ఆర్థికవేత్త, జాన్ హాప్‌కిన్స్



యూనివర్సిటీ ప్రొఫెసర్ స్టీవ్ హాంకీ కూడా అదే అభిప్రాయం వ్యక్తం చేశారు. భారత్‌పై ట్రంప్ సుంకాల అంశంపై మాట్లాడారు. సుంకాలపై ట్రంప్ నిర్ణయాలు పూర్తిగా అర్థరహితమని ఓ జాతీయ మీడియా సంస్థతో స్టీవ్ హాంకీ వ్యాఖ్యానించారు. తనను తాను నాశనం చేసుకునే శత్రువు జోలికి

మిగతా 2 లో..

## ఆగస్ట్ 15న అలస్కాలో భేటీ కానున్న ట్రంప్, పుతిన్

**అమెరికా, రష్యా అధ్యక్షుల మధ్య కీలక సమావేశం**

- ఉక్రెయిన్ యుద్ధం ముగింపుపై చర్చించే అవకాశం
- భేటీని స్వాగతించిన భారత విదేశాంగ శాఖ
- భారత్‌కు సుంకాల ఊరట లభించే అవకాశం



న్యూఢిల్లీ,ఆగస్ట్9(సాక్ష్యం): ప్రపంచ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య శిఖరాగ్ర సమావేశం జరగనుంది. ఆగస్ట్ 15న అలస్కాలో ఈ భేటీ జరగనున్నట్లు

మిగతా 2 లో..

## రష్యా, ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందం

- ఇరు దేశాల భూభాగాల మార్పిడి ఉంటుంది
- శాంతి ఒప్పందం కుదురుతుందనే ఆశిస్తున్నా
- డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,ఆగస్ట్9(సాక్ష్యం): మూడున్నరేళ్లు గడిచినా రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి తెరపడలేదు. ఈ యుద్ధాన్ని ఆపేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన వంతు ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో భాగంగా రష్యా అధ్యక్షుడు పుతిన్ తో భేటీ అయ్యేందుకు సిద్ధమయ్యారు. తాజాగా ట్రంప్ ఒక ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందంలో భూభాగాల మార్పిడి కూడా ఉంటుందని చెప్పారు. తన 'ట్రూత్ సోషల్' ఖాతా ద్వారా ట్రంప్ స్పందిస్తూ...

## 334 రాజకీయ పార్టీలను జాబితా నుంచి తొలగింపు

న్యూఢిల్లీ, ఆగస్టు9(సాక్ష్యం): దేశవ్యాప్తంగా 334 రాజకీయ పార్టీలను రిజిస్టర్ జాబితా నుంచి ఎన్నికల సంఘం (ఈసీ) తొలగించింది. 2019 నుంచి ఏ ఒక్క ఎన్నికల్లో పోటీ చేయని ఈ రాజకీయ పార్టీలపై ఈ నిర్ణయం తీసుకున్నది. ఈసీ వద్ద రిజిస్టర్ అయినప్పటికీ గుర్తింపు లేని 334 రాజకీయ పార్టీలు 2019 నుంచి ఆరేళ్లలో ఏ ఒక్క ఎన్నికల్లో కూడా పోటీ చేయలేదని ఈసీ తెలిపింది. ముఖ్యమైన ఈ షరతును నెరవేర్చడంలో

మిగతా 2 లో..



## ఓట్ల చోరీ ఆరోపణలపై అఫిడవిట్ ఏది?

**లిఖితపూర్వక రాహుల్ ఎందుకు ఇవ్వలేదు**

**ఎన్నికల సంఘంపై రాహుల్‌కు నమ్మకంలేదు**

**అలాంటప్పుడు పదవులకు రాజీనామా చేయండి**

**బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా**



న్యూఢిల్లీ,ఆగస్ట్9(సాక్ష్యం): ఓట్ల చోరీ ఆరోపణలపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లిఖితపూర్వక అఫిడవిట్‌ను ఇవ్వనందుకు బీజేపీ తీవ్రంగా విమర్శించింది. ఎన్నికల సంఘంపై రాహుల్ గాంధీకి నమ్మకం లేకపోతే తన పదవికి రాజీనామా చేయాలని పేర్కొంది. కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ, ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కూడా ఈసీపై నమ్మకం లేకుంటే తమ పదవులకు రాజీనామా చేయాలని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా అన్నారు.

మిగతా 3 లో..

# నేడు తెలంగాణకు అమిత్ షా

**నిజామాబాద్‌లో పర్యటించనున్న కేంద్ర హోంమంత్రి**

**జాతీయ పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభం**



హైదరాబాద్,ఆగస్టు9(సాక్ష్యం): కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తెలంగాణలో పర్యటించనున్నారు. నేడు నిజామాబాద్‌లో పలు కార్యక్రమాల్లో అమిత్ షా పాల్గొననున్నారు. ఈ మేరకు ఆయన పర్యటన షెడ్యూల్ ఖరారైంది. అమిత్ షా పర్యటన సందర్భంగా పోలీసులు పటిష్ట భద్రత చర్యలు చేపట్టారు. పలు ప్రాంతాల్లో పోలీసులు ట్రాఫిక్

మిగతా 2 లో..

# ట్యాపింగ్ చేయించలేదని ప్రమాణం చేస్తావా?

**ఆలయాలు, చర్చికి, మసీదుకు ఎక్కడికైనా వెళదామా**

- కేటీఆర్‌కు బండి సంజయ్ సవాల్
- ఫోన్ ట్యాపింగ్‌లో తండ్రీకొడుకుల హస్తం

హైదరాబాద్,ఆగస్టు9(సాక్ష్యం): ఫోన్ ట్యాపింగ్ కేసులో తనపై తప్పుడు ఆరోపణలు చేశారని కేటీఆర్ లీగల్ నోటీసులు ఇవ్వడంపై బండి సంజయ్ ఘాటుగా స్పందించారు. కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడారు. నేను ఏం తప్పు చేప్పిన? సాక్షాత్తు మీ చెల్లెలు కూడా ఫోన్ ట్యాపింగ్ జరిగిందని చెప్పారు కదా? ఆమెకు లీగల్ నోటీసులిస్తారా? రాధాకిషన్ రావు తన వాంగ్మూలంలో కేసీఆర్ చెబితేనే ఫోన్ ట్యాపింగ్ చేశారని

మిగతా 3 లో..





# సంపాదకీయం

## గాలికొదిలేసిన గిరిజన సంక్షేమం

గిరిజనుల అభివృద్ధి విషయంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా తయారయ్యింది. కనీస రహదారులు, వైద్యం, విద్య, మంచినీరు వంటి సదుపాయాలు నేటికీ గిరిజన గూడాల్లో కనిపించవు. ఆపదొస్తే డోలీలో మోసుకు ఆవడం ఇప్పటికీ ఈచూస్తున్నాం. ఇటీవల ఓ గర్భిణిని కాన్పు కోసం డోలీలో వర్షంలో తడుచుకుంటూ మోసుకొచ్చారు. అంటే ఇంకా మనం వారి అభివృద్ధి విషయంలో వెనకబడే ఉన్నామని చెప్పాలి. ఎపిలో పవన్ కళ్యాణ్ డిప్యూటి సిఎం అయ్యాక కొన్ని సమస్యలపై దృష్టి సారించారు. అందుకు ఆయనను అభినందించాల్సిందే. అలాగే తెలంగాణలో సీతక్క అడవిబిడ్డ కావడంతో వారి కష్టాలు తెలుసుకుని ముందుకు సాగుతున్నారు. తనవంతుగా వారి అభివృద్ధికి కృషి చేస్తున్నారు. అయితే మిగతా రాష్ట్రాల సంగతి పక్కన పెడితే తెలుగు రాష్ట్రాల్లో వారి జీవితాల్లో ఇంకా వెలుగులు నిండలేదు. ప్రభుత్వాలు చెబుతున్నంతగా అభివృద్ధి జరగడంలేదు. ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం 1994లో ఐక్యరాజ్య సమితి ఆగస్టు 9న అంతర్జాతీయ ఆదివాసీల దినోత్సవంగా ప్రకటించింది. ఏటా ఉత్సవాలు చేయడం, వారికి తాయిలాలు ప్రకటించడం తప్ప గట్టిగా చర్యలకు మాత్రం పూనుకోవడం లేదు. ప్రభుత్వాలు మారినా ఆదివాసీల పట్ల పాలకుల నిర్లక్ష్యం కొనసాగుతోంది. నేటికీ వైద్యం అందుబాటులో లేదు. ప్రతి సంవత్సరం మలేరియా, -టైఫాయిడ్ వంటి విష జ్వరాలతో వందలాది మంది మరణిస్తున్నారు. ఆసుపత్రులు ఎన్ని ఉన్నా సరైన మందుల, వైద్యులు, ఇతర సిబ్బంది కొరత వెంటాడుతుంది. సరైన రహదారి సౌకర్యాలు లేక నేటికీ గిరిజనులు డోలీమోతతోనే ఆసుపత్రికి చేరుతున్నారు. కొన్ని సందర్భాల్లో సమయానికి వైద్యం అందక దారి మధ్యలోనే మరణిస్తున్నారు. గిరిజన ప్రాంతంలో విద్య అందనంత దూరంలో ఉంది. ప్రతి సంవత్సరం ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ గురుకులాల్లో సీట్ల కోసం ఎదురుచూస్తూ ఉంటారు. అంతంత మాత్రమే సీట్లు ఉండడంతో చదువు మధ్యలోనే ఆగిపోతుంది. సంక్షేమ హాస్టళ్లల్లో సౌకర్యాలు లేమి, పౌష్టికాహారం లోపంతో పిల్లలు రక్తహీనతతో బాధపడుతున్నారు. చదువుకున్న విద్యార్థులకు సరైన ఉపాధి లేక రోజురోజుకూ నిరుద్యోగ సమస్య తీవ్రంగా తయారైంది. చదువుకున్న యువతీయువకులు వలసలు వెళ్తున్నారు. లక్షల కోట్ల రూపాయల విలువైన ఖనిజ సంపద ఉన్న ప్రకృతి మధ్యలో నిరుపేదలుగా జీవనం కొనసాగిస్తున్నారు. మనదేశంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 8.6 శాతం ఆదివాసీలు ఉన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో వీరి సంఖ్య ఎక్కువగా ఉంది. అక్షరాస్యతతో పోలిస్తే గిరిజన ప్రాంతంలో అక్షరాస్యత అతి తక్కువ. మహిళ అక్షరాస్యత 34.67 శాతం. గిరిజనులకు ప్రత్యేక చట్టాలు, హక్కులు రాజ్యాంగం కల్పించింది. వీరి అభివృద్ధికి ప్రత్యేకమైన నిధులు, పరిపాలన వ్యవస్థ ఉండాలని రాజ్యాంగం లోని 5వ షెడ్యూల్లో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ అమలు జరగడం లేదు. షెడ్యూల్ ప్రాంతానికి ఆనుకుని ఉన్న నాన్ షెడ్యూల్ మండలాల్లో వేలాదిమంది గిరిజనులు ఉన్నారు. వీరి గ్రామాలను షెడ్యూల్డ్ ప్రాంతంలో కలపాలని అనేక సంవత్సరాలుగా పోరాడుతున్నా గిరిజన చట్టాలు, హక్కులు, సంక్షేమ పథకాలు వర్తించడం లేదు. మెజార్టీ గిరిజనులు అడవిలో జీవిస్తున్నారు. విలువైన ఖనిజాలు కూడా వీరి నిర్వాసిత ప్రాంతాల్లో ఉన్నాయి. ఇంత విలువైన సంపదను గిరిజనుల ఆర్థికాభివృద్ధికి ఉపయోగించాల్సిన పాలకులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఆదివాసీలకు రక్షణగా ఉన్న చట్టాలను బలహీనం చేసి, అటవీ భూమి, సహజ వనరులను బహుళజాతి, కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారు. మనం ఎంతో అభివృద్ధి చెందామని భావిస్తున్న ఈ రోజుల్లో కూడా ఆదివాసీలు కనీస సౌకర్యాలు, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలకు నోచుకోలేదు. ఆదివాసీలను భూముల నుండి దూరం చేసే కుట్రలు సాగుతున్నాయి. గిరిజనులకు రక్షణగా ఉన్న 1/70, అటవీ హక్కుల చట్టాలను ఒక్కొక్కదాన్ని నీరు గారుస్తున్నారు. అటవీ భూముల్ని సాగు చేసుకున్న వారికి అటవీహక్కుల చట్టం ప్రకారం 10 ఎకరాల వరకూ హక్కుపత్రాలు ఇవ్వాలి. కానీ గిరిజనుల సాగులో ఉన్న భూములకు నేటికీ పట్టాలు ఇవ్వడం లేదు. హక్కు పత్రాలు ఇచ్చిన అరెకరం, ఎకరం లోపునే ఎక్కువ మందికి ఇచ్చారు. అడవులను నమ్ముకుని బతుకుతున్న కోట్లాదిమంది బతుకు నాశనం చేసే నిర్ణయం కేంద్రం తీసుకొచ్చింది. గ్రామసభ అనుమతి లేకుండా అటవీ భూములను వివిధ ప్రాజెక్టులకు వినియోగించే పక్రియకు కేంద్రం ఆమోదముద్ర వేసింది. అటవీ పరిరక్షణ నిబంధనలకి 2022లో నోటిఫైడ్ చేస్తూ కేంద్ర పర్యావరణ అటవీశాఖ ఆదేశాలు జారీ చేసింది. అడవుల్లో నివశించే గిరిజనుల అనుమతి అవసరం లేకుండా భూములు కేటాయింపు జరుగుతోంది. ఇది అత్యంత ప్రమాదకర మని ఇప్పటికే గిరిజన సంఘాలు, పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మన దేశంలో అడవులను నమ్ముకుని కోట్లాదిమంది జీవిస్తున్నారు. గిరిజన ప్రాంతంలో ఉన్న నిరుద్యోగులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుంది. నదీ జలాలన్నీ ఏజెన్సీల్లోనే ఉన్నాయి. కానీ ఆదివాసీలకు రక్షిత మంచినీరు అందుబాటులో లేదు. ఏజెన్సీ గ్రామాలకు సంపూర్ణంగా విద్యుత్ సదుపాయం లేదు. ఈ సమస్యలను పరిష్కరించకుండా ఎన్ని హామీలు ఇచ్చినా గిరిజన సంక్షేమం నెరవేరదని పాలకులు గుర్తించాలి. కనీస సౌకర్యాల కల్పన విద్యవిద్యం వంటి విషయాల్లో అడుగులు పడాలి.

## ప్రభుత్వ భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్స్

మొదటిపేజీ తరువాయి..

ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, ఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్ ఫారుకి, రెడ్కో సిఎండి అనిలా తదితరులు గ్రామపంచాయతీ మొదలుకొని సెక్రటేరియట్ వరకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటుచేస్తామన్నారు. వాటి ద్వారా పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన వివరాలకు సంబంధించి కలెక్టర్లు హైదరాబాద్ కు పంపాల్సిన వివరాలకు సంబంధించి ఒక ప్రశ్నావళిని పంపించారు. అందులో అన్ని వివరాలు నమోదు చేసి వారం లోపు విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వివరాలు సైతం పంపాలని కలెక్టర్లకు సూచించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతాల్లో ఆర్ ఓ ఎఫ్ ఆర్ చట్టం కింద 6.70 లక్షల ఎకరాల భూములను పంపిణీ చేసింది. ఈ భూముల్లో నల్లమల డిక్లరేషన్ కింద ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం ద్వారా ఉచితంగా సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేస్తామని కలెక్టర్లకు భట్టి విక్రమార్క వివరించారు. నల్లమల డిక్లరేషన్ లో భాగంగా ఇప్పటికే అచ్చంపేట నియోజకవర్గంలో ప్రారంభించాం. ఈ ఆగస్టు



నెలలోనే ఆదిలాబాద్ జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ప్రారంభించే ఆలోచనలోప్రభుత్వం ఉంది. ఇందిరా సౌర గిరిజల వికాసం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. కనుక కలెక్టర్లు దీనిపై సత్వరం స్పందించి వారంలోగా వివరాలు పంపండి, ఈ విషయాల్లో ఏమైనా సందేహాలు ఉంటే విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సీఎండీలు, ని సంప్రదించాలని' కలెక్టర్లను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు.

పాల్గొన్నారు. అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాలు, పార్కింగ్, క్యాంటీన్ ప్లాన్లు హైదరాబాద్ కు పంపాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్లు అన్నీ కూడా ఒకే నమూనాలో నిర్మించినందున సోలార్ పవర్ ప్లాంట్ లో ఏర్పాటుకు అవసరమైన డిజైన్లు హైదరాబాద్ నుంచి పంపిస్తామని చెప్పారు. కలెక్టరేట్లలో ఏమైనా మంచి డిజైన్లు ఉంటే కనుక వాటిని హైదరాబాద్ కు పంపాలని ఈ సందర్భంగా కలెక్టర్లకు ఆయన సూచించారు. ఆఫీసుకి పంపాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రభుత్వ భవనాలతో పాటు ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల భవనాలపై తెలంగాణ ప్రభుత్వం సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. అందుకు సంబంధించిన భవనాల వివరాలు పంపాలని కలెక్టర్లను భట్టి విక్రమార్క ఆదేశించారు. నీటిపారుదల శాఖ, రోడ్లు భవనాల శాఖ పరిధిలో ఖాళీ స్థలాలు ఉన్నాయని, వాటి

## పదవీకాలం ముగిసినందున జోక్యం చేసుకోలేం

మొదటిపేజీ తరువాయి..

పలికింది. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ పౌరసత్వంపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. రమేశ్ పోటీ చేసిన ఎన్నికల పదవీకాలం ఇప్పటికే ముగిసిపోయినందున, ఆ విషయాన్ని ఇప్పుడు పునరుద్ధరించలేమని ధర్మాసనం స్పష్టం చేసింది.జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ ఎన్.కె. సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. ఆది శ్రీనివాస్ తరఫున సీనియర్ న్యాయవాది గౌరవ్ అగర్వాల్ వాదనలు వినిపిస్తూ, రమేశ్ దేశాన్ని మోసం చేసినట్లు హైకోర్టు గుర్తించినప్పటికీ ఆయన ఇప్పటికీ పింఛనుతో సహా ఇతర శాసనసభ ప్రయోజనాలను పొందుతున్నారని కోర్టు దృష్టికి తెచ్చారు. అయితే, సుప్రీంకోర్టు ఈ వాదనలను పరిగణనలోకి తీసుకోలేదు.చెన్నమనేని రమేశ్ జర్మన్ పౌరసత్వం కలిగి ఉండి, ఆ విషయాన్ని దాచిపెట్టి ఎన్నికల్లో పోటీ చేశారని ఆరోపిస్తూ ఆది శ్రీనివాస్ 2019లో హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, నిబంధనలు పాటించలేదన్న కారణంతో 2019 నవంబరులో రమేశ్ భారత పౌరసత్వాన్ని రద్దు చేసింది. కేంద్రం నిర్ణయాన్ని సవాలు చేస్తూ రమేశ్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు.ఈ పిటిషన్‌పై సుదీర్ఘ విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు, 2024 నవంబర్ 6న కీలక తీర్పు వెలువరించింది. రమేశ్ జర్మన్ పౌరుడేనని నిర్ధారిస్తూ, భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీ చేయడానికి, ప్రజా పదవులు చేపట్టడానికి అనర్హుడిగా ప్రకటించింది. 15 ఏళ్లుగా కోర్టును తప్పుదోవ పట్టించినందుకు ఆయనకు రూ. 30 లక్షల జరిమానా కూడా విధించింది. ఇందులో రూ. 25 లక్షలు ఆది శ్రీనివాస్‌కు, రూ. 5 లక్షలు లీగల్ సర్వీసెస్ అథారిటీకి చెల్లించాలని ఆదేశించగా, రమేశ్ ఆ మొత్తాన్ని ఈ ఏడాది ఏప్రిల్‌లో చెల్లించారు.2009 నుంచి 2018 వరకు జరిగిన నాలుగు ఎన్నికల్లోనూ రమేశ్ గెలుపొందగా, ఆది శ్రీనివాస్ రెండో స్థానంలో నిలిచారు. రమేశ్‌ను అనర్హుడిగా ప్రకటించినందున, ఆ పదవీకాలాలకు తనను ఎమ్మెల్యేగా ప్రకటించాలని శ్రీనివాస్ కోరారు. అయితే హైకోర్టు దీనిపై ఎలాంటి ఆదేశాలు ఇవ్వకపోవడంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తాజాగా సుప్రీంకోర్టు కూడా ఆయన అభ్యర్థనను తిరస్కరించడంతో ఈ వివాదానికి తెరపడినట్లయింది. కాగా, 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ రమేశ్‌కు టికెట్ నిరాకరించగా, వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆది శ్రీనివాస్ విజయం సాధించారు.

# ట్రంప్ సుంకాల పేకమేడ కూలిపోతుంది



మొదటిపేజీ తరువాయి..

వెళ్లకపోవడమే మంచిదని అప్పట్లో నెపోలియన్ చెప్పారని అన్నారు. ఇప్పుడు ట్రంప్ కూడా ప్రపంచదేశాలతో వాణిజ్య యుద్ధాలు చేస్తూ తనను తానే నాశనం చేసుకుంటున్నారని అనిపిస్తోందని స్టీవ్ హాంకీ తెలిపారు. టారిఫ్‌లపై ట్రంప్ విధానాలు చాలా చెత్తగా ఉన్నాయని విమర్శించారు. సుంకాల అంటూ ట్రంప్ కడుతున్న పేక మేడ త్వరలోనే కూలిపోతుందని ఆయన దుయ్యబట్టారు. అప్పటివరకు భారత్, ట్రంప్ జోలికి వెళ్లకపోవడమే మంచిదని సూచించారు. ప్రస్తుతం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రి జైశంకర్ కొంతకాలం ఓపిక పట్టి ఎదురుచూడాలని తెలిపారు. అమెరికన్ల వినిమయ ఖర్చులు పెరిగితే ద్రవ్యలోటు ఎక్కువవుతుందని అంచనా వేశారు. దీనివల్ల అమెరికా ఆర్థికవ్యవస్థకే నష్టం చేకూరే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే భారత్‌పై ట్రంప్ సుంకాల మోత మోగిస్తున్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుందనే కారణంలో తొలుత 25 శాతం టారిఫ్స్ విధించారు. అవి ఇటీవల అమల్లోకి కూడా వచ్చాయి. అంతకుముందు రోజే సుంకాలను మరో 25 శాతం పెంచారు. దీంతో 50 శాతానికి చేరాయి. రెండో పెంచిన సుంకాలు మరికొద్ది రోజుల్లో అమల్లోకి రానున్నాయి. ఇవి కాకుండా భవిష్యత్తులో మరింతగా విధిస్తామని తెలిపారు. సుంకాల విషయం తేలేవరకు న్యూఢిల్లీతో వాణిజ్య చర్చలు కూడా జరపబోమని తేల్చిచెప్పారు. దీంతో రెండు దేశాల మధ్య విభేదాలు వచ్చాయి. ట్రంప్ సుంకాలను భారత్ తీవ్రంగా ఖండించింది. జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. ఎవరికీ తలవంచమని తేల్చి చెప్పింది. "భారత్‌పై ట్రంప్ విధించిన సుంకాల నిర్ణయం పూర్తిగా అర్థరహితం ఎక్కడో విషయం ఏంటంటే.. "తనను తాను నాశనం చేసుకునే శత్రువు జోలికి వెళ్ళకపోవడం మంచిదే"ననేది నెపోలియన్ చెప్పిన మాట. ఇప్పుడు ట్రంప్ తో ప్రపంచ దేశాలకు ఇదే వర్తిస్తుంది. ప్రపంచ దేశాలతో వాణిజ్య యుద్ధం చేస్తున్న ట్రంప్ తనని తానే నాశనం చేసుకుని సమయం వస్తుందని అనిపిస్తుంది. భారతదేశ విషయానికి వస్తే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రి జైశంకర్ కొంతకాలం ఓపికతో ఉంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ను కదిలించకపోవడం మంచిది. ఎందుకంటే ట్రంప్ కట్టే టారిఫ్ పేక మేడ త్వరలోనే కుప్పకూలుతుంది" అని ప్రొఫెసర్ అభిప్రాయపడ్డారు. ఇతర దేశాల దిగుమతులపై సుంకాలు అధికంగా పెంచుతున్న నేపథ్యంలో అమెరికాను తమ వినిమయ ఖర్చులు పెరిగితే ద్రవ్యలోటు ఎక్కువవుతుందని హాంకీ అంచనా వేశారు. డోనాల్డ్ ట్రంప్ టారీఫ్ విధానాలు పరమ చెత్తగా ఉన్నాయని ఆయన దుయ్యబట్టారు. దీనివల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థకు నష్టం వచ్చే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రష్యాతో భారత్ వాణిజ్యం పెట్టుకుందని కారణంతో మన దేశంపై డోనాల్డ్ ట్రంప్ అధిక సంఖ్యలను విధించిన విషయం తెలిసిందే. ఇటీవలే 25 శాతం సుంకాలను విధించిన ట్రంప్ ఇప్పుడు మరో 25 శాతాన్ని అదనంగా టారిఫ్‌లు పెంచుతూ మొత్తంగా 50% విధించిన విషయం తెలిసిందే.

అయితే ఈ సుంకాల విషయం తేలే వరకు ఢిల్లీ తో అనగా మోడీ ప్రభుత్వంతో ఎలాంటి చర్చలు జరిపేది లేదని ట్రంప్ స్పష్టం చేశారు. దీంతో ఇరుదేశాల మధ్య విభేదాలు ఏర్పడినట్లు అయ్యింది. అయితే ఇప్పటికే ట్రంప్ నిర్ణయాన్ని ఖండిస్తున్నట్లు భారత ప్రభుత్వం ప్రకటించింది. ఇది అన్యాయం, అసమంజసమైనదని పేర్కొంది. జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు ఎంత దూరమైనా వెళ్తామంటూ స్పష్టం చేసింది.

## పిల్లల సమక్షంలో ప్రధాని రక్షాబంధన్

మొదటిపేజీ తరువాయి..

మారాయి. గతేడాది కూడా ప్రధాని ఇలాగే స్కూల్ విద్యార్థినులతో రాఖీ కట్టించుకున్న సంగతి తెలిసిందే. అంతకుముందు రాఖీ పండుగను పురస్కరించుకొని దేశ ప్రజలకు మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. 'సోదర సోదరీమణుల మధ్య అపరిమిత ప్రేమకు ప్రతీక ఈ రక్షా బంధన్. ఈ పండుగ మీ బంధాలను మరింత తీపికరంగా చేయాలని, ఆప్యాయత, సామరస్య భావాలను బలోపేతం చేయాలని, ప్రజంతా ఆనందంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నా' అంటూ మోదీ ఎక్స్‌లో పోస్టు చేశారు.

## 334 రాజకీయ పార్టీలను జాబితా నుంచి తొలగింపు

మొదటిపేజీ తరువాయి..

విఫలమైనందుకు రిజిస్టర్ అయిన 334 గుర్తింపు లేని రాజకీయ పార్టీలను జాబితా నుంచి తొలగించినట్లు శనివారం పేర్కొంది. కాగా, గుర్తింపు లేని ఈ 334 రాజకీయ పార్టీలు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందినవని ఈసీ తెలిపింది. అయితే జాబితా నుంచి తొలగించిన ఈ పార్టీల కార్యాలయాలు భౌతికంగా కూడా ఎక్కడా లేవని పేర్కొంది. మొత్తం 2,854 నమోదిత గుర్తింపు లేని రాజకీయ పార్టీల్లో 334 పార్టీల తొలగింపు తర్వాత 2,520 రాజకీయ పార్టీలు రిజిస్టర్ జాబితాలో ఉన్నట్లు ఈసీ వివరించింది. ప్రస్తుతం ఆరు జాతీయ పార్టీలు, 67 రాష్ట్ర పార్టీలు ఉన్నాయని వెల్లడించింది.




## రష్యా, ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందం


మొదటిపేజీ తరువాయి..

రష్యా-ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందం కుదురుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఒప్పందంలో భాగంగా కొన్ని భూభాగాలు వెనక్కి తీసుకోవడం, కొన్ని భూభాగాలు మార్చుకోవడం జరుగుతుందని చెప్పారు. అయితే, ఏయే భూభాగాలు అనే విషయాన్ని మాత్రం ఆయన వెల్లడించలేదు. వాస్తవానికి ఈనెల 15న అలస్కా వేదికగా పుతిన్ తో భేటీ కానున్నట్లు ట్రంప్ తొలుత ప్రకటించారు. అయితే, దీనిపై రష్యా నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో, తొలుత పుతిన్ తో ద్వైపాక్షిక భేటీ జరిపి కాల్పుల విరమణ ఒప్పందానికి ఒప్పించాలని ట్రంప్ భావిస్తున్నట్టు సమాచారం.

## ఆగస్ట్ 15న అలస్కాలో భేటీ కానున్న ట్రంప్, పుతిన్

మొదటిపేజీ తరువాయి..


రష్యా-ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందం కుదురుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఒప్పందంలో భాగంగా కొన్ని భూభాగాలు వెనక్కి తీసుకోవడం, కొన్ని భూభాగాలు మార్చుకోవడం జరుగుతుందని చెప్పారు. అయితే, ఏయే భూభాగాలు అనే విషయాన్ని మాత్రం ఆయన వెల్లడించలేదు. వాస్తవానికి ఈనెల 15న అలస్కా వేదికగా పుతిన్ తో భేటీ కానున్నట్లు ట్రంప్ తొలుత ప్రకటించారు. అయితే, దీనిపై రష్యా నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో, తొలుత పుతిన్ తో ద్వైపాక్షిక భేటీ జరిపి కాల్పుల విరమణ ఒప్పందానికి ఒప్పించాలని ట్రంప్ భావిస్తున్నట్టు సమాచారం.

## సొంతూళ్లకు నగరవాసులు

### హైదరాబాద్-విజయవాడ ట్రాఫిక్ మాయం జాతీయ రహదారిపై పెద్ద సంఖ్యలో వాహనాలు కిలోమీటర్ల మేరా బారులు తీరిన వాహనాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

హైదరాబాద్,ఆగస్టు9(సాక్ష్యం): రాఖీ పౌర్ణమి పండగను కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకునేందుకు నగరవాసులు పెద్ద సంఖ్యలో సొంతూళ్లకు బయలుదేరడంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి వాహనాలతో కిక్కిరిసిపోయింది. పండగ రద్దీ కారణంగా శనివారం ఉదయం నుంచే రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. హైదరాబాద్ నగర శివార్లలోని వనస్థలిపురం, భాగ్యలత, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతాల్లో పరిస్థితి తీవ్రంగా ఉంది. ఒక్కసారిగా వేల సంఖ్యలో వాహనాలు రోడ్లపైకి రావడంతో ప్రధాన రహదారితో పాటు సర్వీసు రోడ్లు కూడా వాహనాలతో నిండిపోయాయి. కిలోమీటర్ల కొద్దీ వాహనాలు బారులు తీరడంతో ట్రాఫిక్ నెమ్మదిగా కదులుతోంది. మరోవైపు, ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద కూడా ఇదే తరహా పరిస్థితి నెలకొంది. పండగ రద్దీ కారణంగా ఇక్కడ ట్రాఫిక్ దాదాపుగా స్తంభించిపోవడంతో, వాహనాలు ముందుకు కదలలేని దుస్థితి ఏర్పడింది. ఈ ఊహించని ట్రాఫిక్ జామ్ వల్ల గంటల తరబడి ప్రయాణం సాగుతుండటంతో ప్రయాణికులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. తమ గమ్యస్థానాలకు సకాలంలో చేరుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## ఎన్టీపీసీ ప్రతిపాదనకు ప్రభుత్వం సుముఖత..!

మొదటిపేజీ తరువాయి..

థర్మల్, జల విద్యుత్ ఉత్పత్తిపై ఆధారపడుతున్న తెలంగాణకు, ఈ పునరుత్పాదక ఇంధన పెట్టుబడులు కీలక మలుపు అవుతాయని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్టీపీసీ ప్రతిపాదనకు ప్రభుత్వం అన్ని విధాలా మద్దతు ఇస్తుందని ఆయన హామీ ఇచ్చారు.



# నేడు తెలంగాణకు అమిత్ షా

మొదటిపేజీ తరువాయి..

ఆంక్షలు విధించారు. ఉదయం 11:25లకు గుజరాత్‌లోని అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1 గంటకు బేగంపేట ఎయిర్‌పోర్టుకు అమిత్ షా చేరుకుంటారు. మధ్యాహ్నం 1:45కు బేగంపేట్ ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లనున్నారు. అక్కడి నుంచి వినాయక్‌నగర్‌లోని జాతీయ పసుపు బోర్డు కార్యాలయానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 2 గంటలకు జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్ని అమిత్ షా ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 2:30 వరకు జాతీయ పసుపు బోర్డు కార్యాలయంలోనే ఆయన ఉండనున్నారు. 2:35కు నిజామాబాద్ కంటేశ్వర్ క్రాస్ రోడ్‌లో ఏర్పాటు చేసిన దివంగత మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ విగ్రహాన్ని అమిత్ షా ఆవిష్కరించనున్నారు. 2: 45 నిమిషాల నుంచి 4గంటల వరకు పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో జరిగే కిసాన్ మహాసభలో అమిత్ షా పాల్గొంటారు. సాయంత్రం 5 గంటలకు బేగంపేట ఎయిర్ పోర్టుకు అమిత్ షా చేరుకుంటారు.



## ఇండియా ఎవరి ముందూ తలవంచదు

### కేంద్రమంత్రి పీయూశ్ గోయల్

న్యూఢిల్లీ,ఆగస్ట్9(సాక్ష్యం): సుంకాల పేరుతో లొంగదీసుకోవాలనుకుంటున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రయత్నాలను భారత్ సమర్థంగా తిప్పికొడుతోంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు ఇప్పటికే 50 శాతం టారిఫ్స్ ట్రంప్ విధించగా, ఎవరి దగ్గర దిగుమతి చేసుకోవాలో అమెరికా నిర్దేశించలేదని భారత్ ఇప్పటికే స్పష్టం చేసింది. ఇప్పుడు ఇండియా ఎవరి ముందు తలవంచదని తేల్చిచెప్పింది. ట్రంప్‌కు మరోసారి పరోక్షంగా గట్టి సమాధానం పంపింది! ఈ మేరకు ఇటీవల జరిగిన బిజినెస్ టుడే ఇండియాఏ100 సమ్మిట్‌లో పాల్గొన్న కేంద్ర మంత్రి పీయూశ్ గోయల్, ఇండియా ఎవరి ముందు తలవంచదని వ్యాఖ్యానించారు. ప్రపంచ వాణిజ్య సమూహాలతో భారత్ భవిష్యత్తు సంబంధాలు చాలా బలంగా, ఆత్మవిశ్వాసంతో ఉన్నాయని తెలిపారు. ఏటా ఆరున్నర శాతం వృద్ధి చెందుతుందని, మరింత వేగవంతంగా వృద్ధి చెందడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు.గత సంవత్సరం కంటే ఈ ఏడాది భారత్ ఎక్కువ ఎగుమతులు చేస్తుందనే నమ్మకం ఉందని తెలిపారు. వాణిజ్య అడ్డంకులను ఎదుర్కోవడానికి ఇప్పటికే చర్యలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. నాలుగు దేశాల (యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్) కూటమితో జరిగిన చర్చలను గుర్తుచేసుకుంటూ, భారత్‌ది నాలుగు ట్రిలియన్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థ మనదేనని తెలిపారు. భారత్‌లో యువ శక్తి ఉందని అన్నారు. %జుఖీూా% దేశాలు భారత్‌లో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టడానికి అంగీకరించాయని కేంద్రమంత్రి వెల్లడించారు. దీని ద్వారా 10 లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలు, మొత్తం 50 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామని తెలిపారు. అక్టోబర్ 1 నుంచి %జుఖీూా% ఒప్పందం అమలులోకి రానుందని ప్రకటించారు. అక్కడ నుంచి నాలుగు దేశాల మధ్య వాణిజ్యం మరింత సులువుగా మారుతుందని తెలిపారు. దేశాల టారిఫ్స్, సాంక్షన్స్ కారణంగా వాణిజ్యంలో డీ గ్లోబలైజేషన్ అవుతోందని వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. ఇండియా ఎగుమతులు, దిగుమతులపై ఎవరూ ప్రభావం చూపలేరని తెలిపారు. భారత్ ఎవరి మందు తలవొంచదని స్పష్టం చేశారు. దేశ కరెన్సీ, విదేశీ మారక నిల్వలు, స్టాక్ మార్కెట్లు బలంగా ఉన్నాయని తెలిపారు. సవాళ్ల సమయాల్లో భారత్ ఎల్లప్పుడూ విజయం సాధిస్తుందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వంటి ఉన్నత నాయకుడి నేతృత్వంలోని దేశం నేడు బలంగా, గౌరవంగా ఉందని తెలిపారు.

## సేవింగ్స్ ఖాతా బ్యాలెన్స్ 50వేలు

### ఐసిఐసిఐ బ్యాంక్ నిర్ణయం

న్యూఢిల్లీ,ఆగస్ట్9(సాక్ష్యం): ప్రైవేట్ రంగానికి చెందిన ఐసీఐసీఐ బ్యాంక్ తన సేవింగ్స్ ఖాతాల కనీస సగటు- బ్యాలన్స్ నిబంధనల్లో భారీ పెంపు చేస్తున్నట్లు- ప్రకటించింది. ఆగస్టు 1 నుంచి అమల్లోకి వచ్చే ఈ మార్పు మెట్రో, అర్బన్, సెమీ-అర్బన్, గ్రామీణ బ్రాంచ్‌ల ఖాతాదారులందరిపై ప్రభావం చూపనుంది. ఈ పెంపుతో దేశీయ బ్యాంకులలో అత్యధిక 'కనీస సగటు- బ్యాలన్స్' ఐసీఐసీఐ బ్యాంక్‌దే అవుతోంది. కొత్తగా సవరించిన నిబంధనల ప్రకారం.. మెట్రో, అర్బన్ ప్రాంతాల ఖాతాదారులు సగటు-న 50,000 కనీస నిల్వ ఉంచాలి. ఇది ఇంతకుముందు ఉన్న 10,000 నుంచి 50,000 కు పెరగడంతో.. ఐదు రెట్లు- పెరిగినట్టే. సెమీ-అర్బన్ బ్రాంచ్‌లలో కనీస బ్యాలెన్స్ 5,000 నుంచి 25,000కు పెరిగింది. అలాగే గ్రామీణ బ్రాంచ్‌లలో మాత్రం 2,500 నుంచి 10,000కు పెంచారు. ఇకపోతే, దేశంలోనే అతిపెద్ద బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2020లోనే మినిమమ్ బ్యాలెన్స్ నిబంధనను పూర్తిగా రద్దు చేసింది. ఇతర బ్యాంకులు సాధారణంగా 2,000 నుంచి 10,000 వరకు మాత్రమే ఉంచేలా నిబంధనలు అమలు చేస్తుంటాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మెట్రో, అర్బన్‌లో 10,000, సెమీ-అర్బన్‌లో 5,000, గ్రామీణ బ్రాంచ్‌లలో 2,500గా ఉంచింది. బ్యాంకులు తమ రోజువారీ కార్యకలాపాలు, పెట్టు-బడుల ఖర్చులను తీర్చుకునేందుకు మినిమమ్ బ్యాలెన్స్ నిబంధనలను అమలు చేస్తాయి. ఈ పరిమితి కంటే తక్కువ నిల్వ ఉంచిన ఖాతాదారులపై జరిమానాలు కూడా వేస్తుంటాయి. ఐసీఐసీఐ బ్యాంక్ కూడా ఆగస్టు 1 నుంచి కొత్త నిబంధన అమలులోకి వచ్చిన తర్వాత సవరించిన ఫీజు చార్ట్ ప్రకారం జరిమానాలు విధించనుంది.

## ఆపరేషన్ సిందూర్‌లో ఐదు జెట్లను కూల్చేశాం

### ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్‌సింగ్

ఢిల్లీ, ఆగస్టు 9(సాక్ష్యం): ఆపరేషన్ సింధూర్ సందర్భంగా పాకిస్తాన్‌కు చెందిన ఐదు ఫైటర్ జెట్లను కూల్చేశామని ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ తెలిపారు. బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 'ఎస్ 400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ సాయంతో ఐదు పాకిస్తాన్ జెట్లను పేల్చిపడేశాము.



ఐదు జెట్లను మాత్రమే కాకుండా.. ఓ భారీ 'ఎయిర్‌బర్న్ ఎర్లీ వార్నింగ్ అండ్ కంట్రోల్ ఎయిర్ క్రాఫ్ట్'ను కూడా కూల్చేశాము. రెండు వైమానిక స్థావరాలు ధ్వంసం చేశాం. మే 9, 10 తేదీల్లో ఆపరేషన్ సిందూర్ నిర్వహించాం. మే 9వ తేదీ రాత్రి ఎక్కువగా పాక్ ఉగ్ర శిబిరాలపై దాడులు చేశాం. డ్రోన్, ఎస్ 400 గగనతల రక్షణ వ్యవస్థ బాగా పనిచేసింది. వారి యుద్ధ విమానాలు భారత గగనతలంలోకి ప్రవేశించకుండా అడ్డుకున్నాం. వాటిని ఎంతో సమర్థవంతంగా కూల్చిపడేశాం. ఆపరేషన్ సింధూర్‌తో పాక్‌కు స్పష్టమైన సందేశమిచ్చాం' అని ఆయన అన్నారు. కాగా, ఏప్రిల్ 22వ తేదీన జమ్మూకాశ్మీర్, పహల్గామ్‌లోని బైసరన్ లోయలో ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. అమాయక పర్యాటకులను కాల్చి చంపారు. 26 మందిని బలి తీసుకున్నారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టింది. పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపై వైమానిక దాడులు చేసింది. దీంతో 100 మంది ఉగ్రవాదులు ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఉగ్రవాదులు పెద్ద సంఖ్యలో ప్రాణాలు పోగొట్టుకోవటంతో పాక్ తట్టుకోలేకపోయింది. యుద్ధానికి దిగింది. యుద్ధంలో భారీ ఎత్తున నష్టపోయింది. చివరకు తోకముడిచింది.

# ట్యాపింగ్ చేయించలేదని ప్రమాణం చేస్తావా?



మొదటిపేజీ తరువాయి..

చెప్పారు కదా? ఆ విషయం కోర్టు ముందుంది. ఆయనకు నోటీసులిస్తావా? అసలు నోటీసులు ఇవ్వాలనుకుంటే కేసీఆర్, ఆయన కొడుకు ఎప్పటికీ జైల్లోనే ఉంటారని అన్నారు. వాళ్లు తిట్టని తిట్లు లేవు. మాట్లాడని బూతుల్లేవు. చేయని తప్పులు లేవు. జరపని అవినీతి లేదు... నోటీసులిస్తే.. ఏం చేయాలో తనకు తెలుసని బండి సంజయ్ అన్నారు.ఒక రాజకీయ నాయకుడివై ఉండి నేరుగా ఎదుర్కొనే దమ్ములేక చేసిన తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి లీగల్ నోటీసులతో బెదిరించాలనుకోవడం అంతకంటే మూర[illegible]త్వం లేదని విమర్శించారు. ఆ నోటీసులకు భయపడే వ్యక్తిత్వం నాది. అయ్య పేరు చెప్పుకుని రాజకీయాల్లో రాలేదు. దేశం కోసం, ధర్మ రక్షణ కోసం రాజకీయాల్లోకి వచ్చి ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేసి జైలుకు పోయి వచ్చినోడినని గుర్తు చేశారు. ఏ గుడికి అంటే ఆ గుడికి నా కుటుంబంతో సహా వస్తా... నువ్వు కూడా నీ భార్యా, పిల్లలు, తల్లిదండ్రులతో కలిసి గుడికి వస్తావా? వచ్చి ఫోన్ ట్యాపింగ్ తో నాకు సంబంధం లేదు? అని ప్రమాణం చేయిస్తావా?... నువ్వు ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు నేను, నా కుటుంబ సభ్యులంతా ప్రమాణం చేస్తాం. నీకు ఆలయంపై నమ్మకం లేదంటే మసీదు, చర్చికైనా వెళదాం. ప్రమాణానికి సిద్ధమా? నా సవాల్ కు స్పందించాలని కోరుతున్నానన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు సిగ్గు, శరం, రోషం ఉంటే ఆ పార్టీని వదిలి బయటకు రావాలి. ఎందుకంటే ఆనాడు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుసహా అందరి ఫోన్లను ట్యాప్ చేశారు. అయినా మీరు ఇంకా ఎట్లా బీఆర్ఎస్ లో ఉంటున్నారో అర్థం కావడం లేదన్నారు.ఫోన్ ట్యాపింగ్ పై సీబీఐ విచారణ జరిపించాలనే విషయంలో మాకు స్పష్టత ఉంది. ఎందుకంటే సిట్ పరిమితి చాలా తక్కువ. ఎందుకంటే మావోయిస్టుల పేరు చెప్పి రాజకీయ ప్రముఖుల, సినీ తారల, వ్యాపారుల, రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఫోన్ నెంబర్లను ట్యాప్ చేసి బ్లాక్ మెయిల్ చేసి వసూళ్లకు పాల్పడ్డారు. ఆ డబ్బుల లావాదేవీలకు సంబంధించి పూర్తిస్థాయి వాస్తవాలు వెలుగులోకి రావాలంటే.. ఈడీ మాత్రమే విచారణ చేస్తేనే అది సాధ్యమవుతుంది. అట్లాగే టెలికం రెగ్యులేటరీ అథారిటీ నిబంధనలను ఉల్లంఘించి కేసీఆర్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం నడిపించింది. ఇది పూర్తిగా కేంద్ర పరిధిలోని అంశం... ఎస్ఐబీ చీఫ్ గా ప్రభాకర్ రావును నియమించడం కేంద్ర హోంశాఖ నిబంధనలకు విరుద్ధం. ఎందుకంటే ఎస్ఐబీ చీఫ్ గా నియమితులైన వ్యక్తి ఐజీ స్థాయి అధికారి అయి ఉండాలి. కానీ ప్రభాకర్ రావు అప్పటికే రిటైర్డ్ అయ్యారని గుర్తు చేశారు. ప్రభాకర్ రావు ఐజీగా కొనసాగుతున్నారని కేంద్ర హోంశాఖకు కేసీఆర్ తప్పుడు సమాచారమిచ్చి ఎస్ఐబీ చీఫ్ గా నియమించారు. అట్లాగే జడ్జీల ఫోన్లను కూడా ట్యాప్ చేసినట్లు సిట్ పోలీసులు ఆధారాలతోసహా వెల్లడించారు. జడ్జీలకు నోటీసులిచ్చి పిలిచి స్టేట్ మెంట్ రికార్డ్ చేసే అధికారం సిట్ కు ఉందా? అది జరిగే పనికాదు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రుల ఫోన్లను కూడా గత ప్రభుత్వం ట్యాప్ చేసింది. ఆ ఆధారాలు సిట్ వద్ద ఉన్నాయన్నారు. భార్యభార్తల ఫోన్లను కూడా ట్యాప్ చేసిన నీచులు మీరు. అసలు ఎస్ఐబీ దేని కోసం పనిచేయాలి? మావోయిస్టుల కదలికల కోసం పనిచేయాలి కదా? ఎంతో మంది ఎస్ఐబీ అధికారులు మావోయిస్టుల చేతిలో బలయ్యారని తెలియదా? అని ప్రశ్నించారు. సిట్ అధికారులపై మాకు నమ్మకం ఉంది. కానీ రాష్ట్ర ప్రభుత్వంపై నమ్మకం లేదు. కాళేశ్వరం, విద్యుత్ కొనుగోళ్లు, ఫార్ములా ఈ రేసుసహా అనేక కేసుల్లో విచారణ పేరుతో జాప్యం చేస్తున్నారే తప్ప చర్యలు తీసుకోవడం లేదని బండి సంజయ్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో కల్వకుంట్ల కవితకు కూడా నోటీసులిచ్చి విచారణ జరపాలని కోరుతున్నానన్నారు.

# భారీ వర్షాలకు హైదరాబాద్ అస్తవ్యస్తం

- చెరువులను తలపిస్తున్న రహదారులు
- నిండుకుండలా హిమాయత్‌సాగర్
- 5 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల
- తెలంగాణకు ఐఎండీ బిగ్ అలర్ట్..
- మరో 4 రోజులు భారీ వర్షాలు

హైదరాబాద్,ఆగస్టు9(సాక్ష్యం): కనీవినీ ఎరగని వర్షం. ఈ మధ్యకాలంలో ఇలాంటి వర్షాన్ని మేము చూడలేదని ప్రజలు చెబుతున్నారు. దాదాపు సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమైన వర్షం... ఆ తర్వాత తీవ్ర రూపం దాల్చింది. కేవలం రెండు గంటల్లో నగర వ్యాప్తంగా సగటున 11 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. దీంతో ఉద్యోగాలు, ఇతరత్రా పనులపై బయటకు వెళ్లినవారికి మొన్నటి రాత్రి కాళ రాత్రి అనే చెప్పాలి. రోడ్డుపై ప్రయాణించిన వారికి పట్టపగలే చుక్కలు కనిపించాయి. గత రెండు మూడేళ్లలో ఈ రేంజ్ వర్షం పడలేదని వాతావరణ శాఖ తెలిపింది. హైదరాబాద్ లో క్లౌడ్ బరస్ట్ కావడంతో ఒక్కసారి వర్షం పడింది. ఇక రాజధానిలో నాలాల కెపాసిటీ 2 సెంటిమీటర్ల వర్షం వరకు తట్టుకునేలా ఉన్నాయి. ఇప్పటికీ వాటిని ఎక్స్ పాండ్ చేయలేదు. ఒక మొన్న గురువారం ఒక్కసారిగా అది కూడా కేవలం రెండు గంటల వ్యవధిలో 10 సెం.మీ వర్షపాతం నమోదు కావడంతో రోడ్లన్ని నదులను తలపించాయి. ముఖ్యంగా ఆమీర్ పేట మెట్రో కింద బస్సులు మునిగిపోయేంత నీళ్లు చేరాయి. ఒక్క ఆమీర్ పేట మాత్రమే కాదు.. యూసుఫ్ గూడ, జూబ్లీహిల్స్, మలక్ పేట, కందికల్ గేట్, రాజన్నబావి, హైటెక్ సిటీ, ఛత్రినాక, అంబర్ పేట, గాంధీ నగర్, సికింద్రాబాద్ సహా పలు ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలు మునిగిపోయాయి. ఇక బయటకు వాహనాలపై వెళ్లిన టూ వీలర్స్ వాళ్లకు చుక్కలు కనిపించాయనే చెప్పాలి. చాలా మంది బండ్ల సైలెన్సర్ లోకి నీళ్లు చేరడంతో బండి ముందుకు పోలేని పరిస్థితులు నెలకున్నాయి. దీంతో కొంత మంది బండ్లను అక్కడే ఒదలేసి ఆటోలను, క్యాబ్ లను ఆశ్రయించి బతుకుజీవుడా అంటూ ఇంటికి చేరారు. సాధారణ రోజుల్లో ఇంటికి చేరుకోవడానికి పట్టే సమయం కన్నా.. మూడు నాలుగు గంటలు సమయం ఎక్కువే పట్టింది. నిన్న కూడా హైదరాబాద్ లో సరూర్ నగర్ లోని విరాట్ నగర్ లో దాదాపు 8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. అటు సంతోష్ నగర్ లోని ఖలేందర్ నగర్ లో 6.3 సె.మీ వర్షపాతం నమోదు అయింది. ఎల్బీ నగర్, చాంద్రాయణ గుట్ట, కందికల్ గేట్, ఉప్పుగూడ, బేగం బజార్ ప్రాంతాల్లో 3 సెంటీమీటర్ల నుంచి 4.5 సెం.మీ వర్షపాతం నమోదు అయింది. ఇక రాబోయే 4 రోజుల్లో ముఖ్యంగా దక్షిణ తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడబోతున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. ముఖ్యంగా హైదరాబాద్ లో భారీ వర్షాలు కురునున్నాయి. వర్షాలతో తలెత్తుతున్న ఇబ్బందులపై ప్రభుత్వం దృష్టి సారించింది. వరద సమస్యకు శాశ్వత పరిష్కారంపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. అటు కృష్ణ నగర్ వరద ప్రభావిత ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు మంత్రులు. యూసుఫ్ గూడా సర్కిల్ లోనీ కృష్ణా నగర్ లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట్ స్వామి. భారీ వర్షం వచ్చినప్పుడు తమ ఇళ్లలోకి నీళ్లు వస్తున్నాయని మంత్రుల దృష్టికి తీసుకొచ్చిన స్థానికులు. ఓ బాధితుడు మంత్రి వివేక్ కాళ్ళు పట్టుకుని తమను ఆదుకోవాలని ప్రాధేయపడ్డాడు. నాలాలు పునః నిర్మాణం ,అభివృద్ధి పనులు, డ్రైనేజీ లో సిల్ట్ తొలగింపు పనులు పూర్తి చేయడానికి అనుమతులు వచ్చాయని స్థానికులకు తెలిపారు మంత్రులు.



పనులు జరిగేటప్పుడు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా స్థానికులు సహకరించాలనీ కోరారు మంత్రులు.భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాశ్వత పరిష్కారం చేస్తున్నామని చెప్పారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాల వలన మూసీ నదికి వరద పోటెత్తుతుంది. మరోవైపు మూసీ నది పరివాహక ప్రాంతాల్లో ఉన్న హైదరాబాద్ జంట జలాశయాల్లో ఒకటైన హిమాయత్ సాగర్ లో అంతకంతకు నీటి మట్టం పెరుగుతుంది.

జలాశయాల్లో నీటిమట్టం పెరగడంతో అప్రమత్తమైన అధికారులు నిన్న నాలుగు గేట్లు ఒక ఫీట్ ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు.ఐదో గేట్ కూడా ఎత్తి నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. వరద నీరు హిమాయత్ సాగర్ ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డుపై నుండి వెళుతుండడంతో రాకపోకలు నిలిపివేశారు. రాజేంద్రనగర్ నుంచి అప్పా జంక్షన్ వెళ్లేవారు, అప్పా జంక్షన్ నుంచి రాజేంద్రనగర్ వచ్చేవారు బండ్లగూడ, కిస్మత్‌పూర్ బుద్వేల్ నుంచి వెళ్లాలని పోలీసులు సూచించారు. వరద నీరు ప్రవహిస్తున్న ప్రాంతంలో హిమాయత్ సాగర్ పరివాహక ప్రాంతాల వద్ద కూడా సెల్ఫీలు దిగడానికి ప్రజలు రావొద్దని పోలీసులు సూచిస్తున్నారు.దీంతో మూసీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేశారు. చాలా యేళ్ల తర్వాత హిమాయత్ సాగర్ ఫుల్ ట్యాంక్ లెవల్ కు చేరుకుంది. అటు మూసీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలను ప్రభుత్వం అప్రమత్తం చేసింది. అటు హిమాయత్ సాగర్, మూసీ, ట్యాంక్ బండ్ పరివాహక ప్రాంతాల్లో ప్రభుత్వం రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో మళ్లీ భారీ వర్షాలు పడితే.. లోతట్టు ప్రాంతాల ప్రజలు బిక్కు బిక్కు అనాల్సిందే.

## ఓట్ల చోరీ ఆరోపణలపై అఫిడవిట్ ఏది?

మొదటిపేజీ తరువాయి..

ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'రాహుల్ గాంధీ మీడియా ముందుకు వచ్చి నిరాధారమైన ఆరోపణలు చేస్తారు. కానీ రాజ్యాంగబద్ధమైన సంస్థ సాక్ష్యాలు, లిఖితపూర్వక ప్రకటన అడిగితే నిరాకరిస్తారు. అలాగే ఎన్నికల సంఘం నిజాయితీపై ఎలాంటి సందేహం లేదని, సంవత్సరాలుగా నిష్పక్షపాత సంస్థగా పేరు తెచ్చుకుందని సుప్రీం కోర్టు గమనించింది(గతంలోని సుప్రీం కోర్టు తీర్పులను ప్రకారం). రాహుల్ గాంధీ మీకు ఎన్నికల సంఘం, సుప్రీం కోర్టు వ్యాఖ్యలపై నమ్మకం లేకపోతే ఒక పని చేయండి. ముందుగా మీరు లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేయండి. ప్రియాంక గాంధీ, సోనియా గాంధీ కూడా రాజీనామా చేయండి. ఎందుకంటే మీరు ఎన్నికల సంఘంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారు' అని భాటియా అన్నారు.రాహుల్ గాంధీ ఓటు ఛోరీ వాదనను అబద్ధమని భాటియా అభివర్ణించారు. అశాంతికర శక్తి రాహుల్ ఇప్పుడు విధ్వంసకుడుగా మారాడని అన్నారు. ఆయన రాజ్యాంగాన్ని, భారత ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈసీ అధికారులను బెదిరించడం ద్వారా రాజ్యాంగ సంస్థలపై యుద్ధం మొదలుపెట్టారని భాటియా విమర్శించారు. ఇక కాంగ్రెస్ పాలిత కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రులు కూడా రాజీనామా చేయాలని గౌరవ్ భాటియా అన్నారు. ఎందుకంటే వారి పార్టీ ప్రధాన నాయకులకు ఎన్నికల సంఘంపై నమ్మకం లేదని అన్నారు. మీకు అనుకూలంగా ఉంటే ఆమోదిస్తారు, అసౌకర్యంగా ఉంటే తిరస్కరించి ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేస్తారని ఆరోపించారు. అలాంటివి పనిచేయవని అని అన్నారు.బిహార్ ఎన్నికల్లో ఓటమి భయంతోనే రాహుల్ గాంధీ ఓట్ల చోరీ ఆరోపణలు చేస్తున్నారని కేంద్ర మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ అన్నారు. సాంబా జిల్లాలో సిందూర్ మహా రక్తదాన్ అనే కార్యక్రమాన్ని జాదవ్ ప్రారంభించారు. అనంతరం మీడయాతో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'భారత్ ప్రజాస్వామ్య పాలనలో ఉందని, ఎన్నికల సంఘం దానికి ముఖ్యమైన స్తంభం. ఎవరైనా తమకు న్యాయం జరగడం లేదని భావిస్తే, వారు సుప్రీం కోర్టును ఆశ్రయించవచ్చు. ఎన్నికలు సంఘం అఫిడవిట్ సమర్పించమని అడిగితే పార్లమెంట్‌లో ప్రయాణం చేశానని చెబుతున్నారు. ఆయన స్వయంగా తనను తానే ఇబ్బందుల్లోకి నెట్టుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్ర నుంచి కాంగ్రెస్ ఎక్కువ సీట్లు గెలిచినప్పుడు ఈసీ ప్రశంసించారు. కానీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాక ఆరోపణలు మొదలుపెట్టారు' అని జాధవ్ విమర్శించారు.

## హైకోర్టు ఆదేశాలకనుగుణంగా స్థానిక ఎన్నికలు

### కావాలనే రిజర్వేషన్లపై బీజేపీ రాద్ధాంతం
### మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శలు


హైదరాబాద్,ఆగస్టు9(సాక్ష్యం): బీసీల రిజర్వేషన్లపై బీజేపీ పార్టీ కావాలనే రాద్ధాంతం చేస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. తెలంగాణ హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగానే స్థానిక ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ముస్లిం రిజర్వేషన్ల అంశాన్ని తమ ప్రభుత్వం ఎక్కడా పేర్కొనలేదని స్పష్టంచేశారు. రాష్ట్ర అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ల బిల్లు పెట్టినప్పుడు బీజేపీ నేతలు మద్దతు ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు కావాలనే బీజేపీ నేతలు రాద్ధాంతం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు.. రాష్ట్ర, దేశ ప్రజలకు రాఖీ పౌర్ణమి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. శనివారం మినిస్టర్ క్వార్టర్స్‌లో వారి సోదరులకు మంత్రి సీతక్క రాఖీ కట్టారు. ఈ సందర్భంగా సీతక్కకు మంత్రి పొన్నం చీరను బహూకరించారు. సీతక్క నుంచి పొన్నం ప్రభాకర్ ఆశీర్వాదం తీసుకున్నారు. సీతక్కకు పొన్నం ప్రభాకర్ సోదరులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, రాఖీ పర్వదినం సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రులు సీతక్క, కొండా సురేఖ రాఖీ కట్టారు. మినిస్టర్ క్వార్టర్స్‌లో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కి మంత్రి సీతక్క రాఖీ కట్టారు. సోదరి సీతక్క అంటూ ఆత్మీయంగా పలకరించి ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు బంజారాహిల్స్ మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి శ్రీధర్ బాబుకి మంథని నియోజకవర్గ మహిళలు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

## ఆర్టీసీ నిర్వహణ నిమిత్తమే చార్జీల పెంపు

**పండుగ తర్వాత చార్జీలు యథాతథం**
**ఆర్టీసీ యాజమాన్యం ప్రకటన విడుదల**




హైదరాబాద్,ఆగస్టు9(సాక్ష్యం): రాఖీ పండుగకు చార్జీలు పెంచడంపై ప్రయాణికుల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్టీసీ యాజమాన్యం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆర్టీసీ నిర్వహన కారణంగా కొంత చార్జీలు పెంచినట్టు తెలిపింది. పండుగ తరువాత రేట్లు యథాయథంగా ఉంటాయని వెల్లడించింది. ఈ నెల 11 వరకు స్పెషల్ బస్సుల్లో చార్జీలు పెంచినట్లు వెల్లడించింది. ఆ తర్వాత చార్జీలు సాధారణంగానే ఉంటాయని పేర్కొంది. రద్దీకి అనుగుణంగా బస్సులు నడుపుతున్నామని, ప్రయాణికులు లేకున్నా బస్సులను వెంటనే తిరిగి తీసుకురావాల్సి వస్తుందని, ఈ నేపథ్యంలో నిర్వహణ ఖర్చుల నిమిత్తం స్పెషల్ బస్సుల్లో మాత్రమే చార్జీలు పెంచామని వెల్లడించింది. 'సోదర, సోదరీమణుల మధ్య ప్రేమ, అనుబంధాలకు ప్రతికైనా రాఖీ పౌర్ణమి పర్వదిన సందర్భంగా ప్రయాణికులకు రవాణాపరమైన అసౌకర్యం కలుగకుండా టీజీఎస్ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. ప్రతి ఏడాది మాదిరిగానే ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచింది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం రాఖీ పండుగకు నడిచే స్పెషల్ బస్సుల్లో టికెట్ ధరలను సంస్థ సవరించింది. ప్రత్యేక బస్సుల్లో మాత్రమే రూ.1.50 వరకు టికెట్ ధరలను సవరించింది. స్పెషల్ బస్సులు మినహా రెగ్యూలర్ బస్సుల్లో సాధారణ చార్జీలే అమల్లో ఉంటాయి. ఈ నెల 11వ తేదీ వరకు నడిచే స్పెషల్ బస్సుల్లో మాత్రమే ఈ సవరణ చార్జీలు వర్తిస్తాయి. ప్రయాణికులకు సమాచార నిమిత్తం స్పెషల్ సర్వీసులకు బస్సు ముందు భాగంలో డిస్ ప్లే బోర్డులను సంస్థ ఏర్పాటు చేసింది. ప్రధాన పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు స్పెషల్ సర్వీసులను ఆర్టీసీ యాజమాన్యం నడుపుతోంది. తిరుగు ప్రయాణంలో స్పెషల్ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఏమాత్రం లేనప్పటికీ.. రద్దీ ఉన్న రూట్లలో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఖాళీ బస్సులను త్వరతగతిన సంస్థ వెనక్కి తెప్పిస్తుంది. ఆ స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరను సవరించుకోవాలని 2003లో జీవో నంబర్ 16 ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. ఈ జీవో ప్రకారం స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరలను రాఖీ పండుగ సందర్భంగా సంస్థ సవరించింది. రాఖీ పౌర్ణమికి ప్రైవేట్ వాహనాల్లో ప్రమాదకర ప్రయాణం చేయొద్దని ప్రజలకు టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం సూచిస్తోంది. ఆర్టీసీ సిబ్బంది ఎంతో అనుభవజ్ఞులని, సొంతూళ్లకు వెళ్లే వారు తమ బస్సుల్లో సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరుతూ.. అందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తోంది.' అని తెలిపింది. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్టాండ్లలో రాఖీ పండుగ ప్రయాణికుల రద్దీ నెలకొంది. సికింద్రాబాద్ జేబీఎస్, ఎంజీబీఎస్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, ఉప్పల్ బస్టాండ్లలో బస్సుల కోసం ప్రయాణికులు ఎదురుచూస్తున్నారు.



## సౌర విద్యుత్ ఉత్పాదకత దిశగా ప్రభుత్వం అడుగులు

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- రాష్ట్రంలో సౌర విద్యుత్ ఉత్పాదకత దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని

మెదక్ జిల్లా ప్రతినిధి ( సాక్ష్యం న్యూస్ ) 9 ఆగస్టు

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి (ఎనర్జీ) నవీన్ మిట్టల్, రెడ్ కో సి.ఎం.డి., ఎస్.పి.డి.సి.ఎల్. సి.ఎం.డి, సింగరేణి కాలరీస్ సి.ఎం.డి లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సోలార్ సిస్టం ఇన్స్టాలేషన్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సౌర విద్యుత్ ఉత్పాదకత దిశగా ప్రభుత్వం చర్యలు



తీసుకుంటుందని తెలిపారు. ఇందు కొరకు రాష్ట్రంలోని ప్రభుత్వ భవనాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములు, ఆర్. ఓ. ఎఫ్. ఆర్. భూముల వివరాలతో నిర్ణీత నమూనా ప్రకారం నివేదిక రూపొందించి వారం రోజులలోగా సమర్పించాలని తెలిపారు. జిల్లాలలో గల ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల భవనాల రూఫ్ టాప్ పై సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ వహించి అన్ని జిల్లాల కలెక్టర్లు వారంలోగా సంబంధిత వివరాలను ఎనర్జీ డిపార్ట్మెంట్ కు పంపించాలని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాలలోని 6 లక్షల 17వేల ఎకరాలలో సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఈ క్రమంలో 3 సంవత్సరాల లోపు ప్రక్రియ పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో మెదక్ జిల్లా కలెక్టరేట్ నుండి అదనపు కలెక్టర్ నగేష్ తో కలిసి కలెక్టర్ రాహుల్ రాజ్ పాల్గొన్నారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లాలో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, కాళీ ప్రభుత్వ స్థలాల వివరాలను నిర్ణీత నమూనాలో అందించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దాలి

### ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

మెదక్ జిల్లా ప్రతినిధి ( సాక్ష్యం న్యూస్) 9 ఆగస్టు

టేక్మాల్ మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల నమ్మకాన్ని పెంపొందించాలని , కేజీబీవీ విద్యార్థుల ఉత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం టేక్మాల్ మండలంలో కలెక్టర్ సుడిగాలి



పర్యటన నిర్వహించారు. ముందుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్యులు, సిబ్బంది గురించి ఆరా తీసిన కలెక్టర్ అటెండెన్స్ రిజిస్టర్ తనిఖీ చేశారు. ప్రతి రోజు ఎంత మంది పేషంట్లు వస్తున్నారు, సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవాలు జరిగేలా కృషి చేయాలని వైద్యులకు సూచించారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించేలా అంకిత భావంతో పని చేయాలని హితవు పలికారు.

అనంతరం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని పరిశీలించి తరగతి గదులు, స్టోర్ రూమ్, డార్మెట్రీ, వంటగదిని తనిఖీ చేశారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థినులు, ఉపాధ్యాయులతో కలెక్టర్ మాట్లాడారు. స్టోర్ రూమ్ లోని కూరగాయలు, నిత్యావసర వస్తువులను పరిశీలించారు. పాఠశాల ప్రాంగణం, పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థినుల అభ్యసన సామర్థ్యాలను మరింత మెరుగుపరచాలని అన్నారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## కేజీబీవీ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దాలి

### ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

మెదక్ జిల్లా ప్రతినిధి ( సాక్ష్యం న్యూస్) 9 ఆగస్టు

టేక్మాల్ మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల నమ్మకాన్ని పెంపొందించాలని , కేజీబీవీ విద్యార్థుల ఉత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు.

శనివారం టేక్మాల్ మండలంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన నిర్వహించారు. ముందుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్యులు, సిబ్బంది గురించి ఆరా తీసిన కలెక్టర్ అటెండెన్స్ రిజిస్టర్ తనిఖీ చేశారు. ప్రతి రోజు ఎంత మంది పేషంట్లు వస్తున్నారు, సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవాలు జరిగేలా కృషి చేయాలని వైద్యులకు సూచించారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించేలా అంకిత భావంతో పని చేయాలని హితవు పలికారు.

అనంతరం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని పరిశీలించి తరగతి గదులు, స్టోర్ రూమ్, డార్మెట్రీ, వంటగదిని తనిఖీ చేశారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థినులు, ఉపాధ్యాయులతో కలెక్టర్ మాట్లాడారు. స్టోర్ రూమ్ లోని కూరగాయలు, నిత్యావసర వస్తువులను పరిశీలించారు. పాఠశాల ప్రాంగణం, పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు.

విద్యార్థినుల అభ్యసన సామర్థ్యాలను మరింత మెరుగుపరచాలని అన్నారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు



## ఎరువుల కృత్రిమ కొరతను సృష్టించొద్దు, కలెక్టర్

- డిమాండ్కు అనుగుణంగా నిలువలు ఉన్నాయి,
- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ జిల్లా ప్రతినిధి ( సాక్ష్యం న్యూస్ ) 9 ఆగస్టు

ఎరువులు కుత్రిమ కొరత సృష్టించద్దని డిమాండ్కు అనుగుణంగా నిలువలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ . రాహుల్ రాజ్ స్పష్టం చేశారు. శుక్రవారం మెదక్ జిల్లా హవేలీ ఘన్పూర్ మండల కేంద్రంలో తెలంగాణ ఆగ్రో రైతు సేవా కేంద్రం ను కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు డిమాండ్కు అనుగుణంగా ఉన్న నిలువలను పరిశీలించారు, స్టాక్ వివరాలను, ఆన్లైన్ తదితర వివరాలను డీలర్లు అడిగి తెలుసుకున్నారు, ప్రస్తుత సీజన్కు అనుగుణంగా జిల్లాలో తగినన్ని ఎరువులు విత్తనాలు ఉన్నాయని కొంతమంది కృత్రిమ కొరత సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు,

రైతులతో స్వయంగా మాట్లాడుతూ వారికి కావలసిన సమాచారాన్ని అందించారు రైతులు జిల్లాలో ముందస్తుగా ఎరువులు విత్తనాలు యూరియా డిఏపి తదితర ఫర్టిలైజర్స్ లో వ్యవసాయ శాఖ సిద్ధంగా ఉంచుకోవడం జరిగిందని తెలిపారు,

కల్తీ విత్తనాలు అమ్మిన, అధిక ధరలకు విక్రయించిన, ప్రభుత్వం సూచించిన ప్రకారం సంబంధిత వ్యక్తులపై శాఖపరమైన చర్యలు తీసుకుని లైసెన్సులు రద్దు చేయడం



జరుగుతుందని అన్నారు, టాస్క్ ఫోర్స్ సిబ్బంది క్రమం తప్పకుండా సంబంధిత అధికారులతో కలిసి ఎరువుల దుకాణాలను తనిఖీ చేయాలని సూచించారు,

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## ఆదివాసుల సంస్కృతి సాంప్రదాయాలను కాపాడాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

నర్సంపేట ఆగస్టు9(సాక్ష్యం న్యూస్ ) : ఆదివాసుల సంస్కృతి సాంప్రదాయాలను కాపాడి రాబోయే భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని నర్సంపేట పట్టణంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా

నిర్వహించారు. డప్పు వాయిద్యాలు గిరిజన సాంప్రదాయాలు, నృత్యాలు చేస్తూ అమరవీరుల స్థూపం నుండి పాకాల రోడ్డు లోని కొమరం భీం విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్యఅతిథిగా పాల్గొని కొమరం భీం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ప్రపంచానికి నాగరికతను నేర్పింది ఆదివాసీలేనన్నారు. ప్రకృతిని



దైవంగా భావించే సాంస్కృతి ఆదివాసి గిరిజనులదని అన్నారు. గిరిజన సాంస్కృతి సాంప్రదాయాలు భావితరాలకు అందించేందుకు చేస్తున్న కార్యక్రమాల డాక్యుమెంటేషన్ పక్కగా నిర్వహించాలన్నారు. జిల్లాలోని 13 మారుమూల గిరిజన గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఫీవర్ సర్వే నిర్వహించడంతో పాటు గ్రామాల్లో ఉన్న సమస్యలను అధికారులు సందర్శించి పరిష్కార నిమిత్తం తన దృష్టికి తీసుకురావాలన్నారు. గిరిజనుల హక్కులను రక్షిస్తూ వారి అభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకొకావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి సౌజన్య, గిరిజన సంఘాల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్ర రాజధానిలో ఘనంగా రాఖీ వేడుకలు నిర్వహించిన మంత్రి సీతక్క

### "సోదరి సీతక్క" కు కృతజ్ఞతలు తెలియజేసిన ప్రముఖులు

హైదరాబాద్, ఆగస్టు 9 (సాక్ష్యం న్యూస్ ) : తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క రాఖీ పండుగను రాష్ట్ర రాజధానిలో ఘనంగా జరిపారు. సోదర సోదరీమణుల అనుబంధాన్ని ప్రతిబింబించే ఈ పండుగ సందర్భంగా, సీతక్క



స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్కుమార్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, హైదరాబాదులో అందుబాటులో ఉన్న మంత్రులు, ప్రజా ప్రతినిధులు, కార్పొరేషన్ చైర్మన్లు, నేతల నివాసాలను సందర్శించారు. ప్రతి ఒక్కరి చేతికి రాఖీ కట్టి, స్వీట్లు తినిపించి పండుగ ఆనందాన్ని పంచుకున్నారు మంత్రి సీతక్క. నాయకులు తమ సొంత సోదరిగా భావించి సీతక్కను ఆప్యాయంగా ఆహ్వానించారు. రాఖీ కట్టించుకుంటూ "సోదరి సీతక్క" అంటూ ఆత్మీయంగా పలకరించి, ఆశీర్వాదాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. సీతక్క రాకతో సీఎం, మంత్రుల నివాసాలు సోదర భావంతో నిండిపోగా, పండుగ వాతావరణం మరింత ఉత్సాహంగా మారింది. ఈ సందర్భంగా సీతక్క "రాఖీ పండుగ మన మధ్య ఉన్న అనుబంధాలను మరింత బలపరుస్తుంది. ఇలాంటి సోదర భావం, పరస్పర గౌరవం ఎల్లప్పుడూ కొనసాగాలని కోరుకుంటున్నాను" అని తెలిపారు.

ఉదయం తన నివాసమైన ప్రజాభవన్కు విచ్చేసిన ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్ కి మంత్రి సీతక్క రాఖీ కట్టి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తన నివాసం కి విచ్చేసిన నాయకులు, భద్రతా సిబ్బంది, వ్యక్తిగత సిబ్బందికి సీతక్క రాఖీలు కట్టి ఆశీర్వదించారు. ప్రజా పాలనలో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో వెలుగొందాలని ఆమె ఆకాంక్షించారు.

## అంతరిస్తున్న జాతులపై విస్తృత పరిశోధనలు జరగాలి.. ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఐ డైసీ

సికింద్రాబాద్,ఆగస్టు 9(సాక్ష్యం)... ఉస్మానియా యూనివర్సిటీ ఎస్సీ, ఎస్టీ సెల్, ఆదివాసి స్టూడెంట్ యూనియన్ (ఏఎస్ యు ) ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ఆవరణంలో ఆదివాసీ జాతీయ పతాకాని ఓయూ సి డి సి డీన్ ప్రొఫెసర్ రేగ రాజేందర్ ఎగరవేశారు. అనంతరం పూలే అంబేద్కర్ సెంటర్ ఫర్ ఇంక్లూజు అండ్ ఎంపవర్మెంట్ స్టడీస్ సెమినార్ హాల్లో జరిగిన సదస్సులో మహనీయుల చిత్రపటానికి పూలమాలలేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఓయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఐ డైసీ మాట్లాడుతూ... దేశానికి స్వాతంత్రం వచ్చి 78 ఏళ్లు గడుస్తున్నా నేటికీ సమాజంలో అ స వ్ వ్ వా న త్ ల ం కొనసాగుతున్నాయన్నారు.అనేక జాతులు అంతరించిపోయే దుస్థితిలో ఉన్నాయంటే సమాజంలో కొన్ని వర్గాల ప్రజలకే సంక్షేమం, అభివృద్ధి చెందుతున్నారు. విశ్వవిద్యాలయాలలో ఆదివాసీలు, వెనుకబడిన జాతులపై విస్తృతంగా అధ్యయనం చేసి సమాజంలో ఆయా జాతుల యొక్క ఉనికిని గుర్తింపును తీసుకురావాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని గుర్తు చేశారు. అనంతరం ఓయూ సి డి సి డీన్ ప్రొఫెసర్ రేగ రాజేందర్ మాట్లాడుతూ... ఐక్యరాజ్యసమితి 1994లో ఈ దేశ మూలవాసులైన ఆదివాసులకు ప్రత్యేకమైన రోజుగా ఆగస్టు 9 ని గుర్తించి ప్రపంచ దేశాలలో ఆదివాసులు హక్కుల దినంగా జరుపుకునే రోజుగా ప్రకటించిన నేటికీ ఆదివాసి జాతులలో విద్య, వైద్యం, ఆరోగ్యం అందక ఆదివాసీ ప్రజలు



అడవులకే పరిమితమవుతున్నారని అన్నారు. విశ్వవిద్యాలయాలలో ఆదివాసి పరిశోధన విద్యార్థులుగా ఆదివాసి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని కొన్నారు . ఆదివాసీ సమాజంపై విస్తృతంగా పరిశోధనలు డాక్యుమెంటేషన్ ఏర్పాటు చేసి ఆదివాసి సంస్కృతి, వేల్పులు, జాతర్లపై ప్రజలకు అవగాహన కల్పించి జాతిని జాగృతం చేయవలసిన బాధ్యత ఆదివాసి విద్యార్థులపై ఉందని అన్నారు. అనంతరం ఆదివాసీ పరిశోధన విద్యార్థి ఆదివాసి స్టూడెంట్ యూనియన్ ,(ఏ ఎస్ యు) రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు సాగబోయిన పాపారావు మాట్లాడుతూ... ఉన్నత విద్య కోసం చారిత్రాత్మక ఉస్మానియా యూనివర్సిటీ లో చదువుకునేందుకు ఆదివాసీ విద్యార్థులకు 78 ఏళ్లు పట్టిందంటే ఏజెన్సీ, మారుమూల అడవి ప్రాంతంలో విద్యావ్యవస్థ ఏ విధంగా ఉందో ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకొని భావ్య సమాజ ఒక్కసారి ఆలోచన చేయాలన్నారు. విద్యార్థులు ఐక్యంగా యూనివర్సిటీ అధికారుల సహకారంతో ఉన్నత విద్యని సద్వినియోగం చేసుకొని సమ సమాజం మా ఊళ్లో మా రాజ్యం కోసం విద్యార్థులు కృషి చేయాలని ఆదివాసీ విద్యార్థిలోకానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ జి ఉపేందర్, మైనారిటీ సెల్ డైరెక్టర్ డాక్టర్ హమీద, సెంట్రల్ బ్యాంక్ మేనేజర్ ఊకే రాము, ప్రభుత్వ లీగల్ సెల్ అధికారిని సుష్మ, ఆదివాసీ పరిశోధక విద్యార్థులు అరేం అరుణ్ కుమార్, కల్తీ వెంకన్న, బొచ్చు నరేష్, కుంజ కోటి, పీజీ విద్యార్థులు, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజ్గిరి ఆగస్టు 9 (సాక్ష్యం న్యూస్) మల్కాజిగిరి నియోజకవర్గం పరిధిలోని ఆనంద్ బాగ్ చౌరస్తాలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన బ్రహ్మోత్సవాలలో ముఖ్య అతిథిగా ప్రత్యేక పూజలో పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్న వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ భక్తి, సత్సంప్రదాయాల పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



ఈ కార్యక్రమంలో గౌతమ్ నగర్ కార్పొరేటర్ మేకల సునీత, రాము యాదవ్, మల్కాజ్గిరి మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు హేమంత్ పటేల్, చిన్న యాదవ్, నవీన్ యాదవ్, సురేష్, రాజశేఖర్, శ్రీధర్ వాసు ఇతర నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కృత్రిమ మేధకూ మతిమరుపు



**మనుషుల్లో ఆలోచించటం, కార్యకారణాలను గుర్తించటం, జ్ఞాపకశక్తి, ఊహించటం, పదాలు నేర్చుకోవటం వంటి విషయ గ్రహణ సామర్థ్యాలు క్షీణించటం చూస్తూనే ఉంటాం. తప్పులనూ చేస్తుంటాం.**


మనుషుల్లో ఆలోచించటం, కార్యకారణాలను గుర్తించటం, జ్ఞాపకశక్తి, ఊహించటం, పదాలు నేర్చుకోవటం వంటి విషయ గ్రహణ సామర్థ్యాలు క్షీణించటం చూస్తూనే ఉంటాం. తప్పులనూ చేస్తుంటాం. ఇది మనకే పరిమితమనుకుంటే తప్పులో కాలేసినట్టే. మహా మేధగా భావిస్తున్న కృత్రిమ మేధ (ఏఐ) సైతం విషయగ్రహణ క్షీణతకు గురవుతుంది! ఆశ్చర్యంగా అనిపించినా ఇదే నిజమేనని తాజా అధ్యయనం పేర్కొంటోంది. ముఖ్యంగా జబ్బుల నిర్ధరణలో పొరపడే అవకాశముండటం సందేహాలను రేకెత్తిస్తోంది. 'కృత్రిమ మేధ వెల్లువతో ఆఫీసు ఉద్యోగాలు మాయమవుతాయి.'

**'అంత సీనేమీ లేదు, దీనికీ కొన్ని పరిమితులు లేకపోలేదు.'**

- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మీద ఇలాంటి వాదోపవాదాలు చాలాకాలంగా నడుస్తూనే ఉన్నాయి. ఈ భయాలను, ఆందోళనలను తగ్గించే.. అలాగే మరింత పెంచే కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. వయసు మీద పడుతున్నకొద్దీ మనుషుల్లో మాదిరిగానే ప్రముఖ ఏఐ మోడళ్లు, చాట్‌బాట్స్‌లోనూ విషయగ్రహణ సామర్థ్యం క్షీణిస్తున్న లక్షణాలు కనిపిస్తున్నట్టు బ్రిటిష్ మెడికల్ జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనంలో వెల్లడైంది మరి. ఇదేమీ అల్లాటప్పాగా తేల్చిన విషయం కాదు. జబ్బుల నిర్ధరణలో ఇప్పుడు వాడుకుంటున్న లార్జ్ లాంగ్వేజ్ మోడళ్లు, చాట్‌బాట్స్‌ను మాంట్రియల్ కాగ్నిటివ్ అసెస్‌మెంట్స్ (మోకా) పరీక్షతో పరిశీలించి మరీ గుర్తించిన సంగతి. ఇందులో చాట్‌జీపీటీ 4, చాట్‌జీపీటీ 4ఓ, క్లాడ్ 3.5, జెమినీ 1, జెమినీ 1.5 వంటి ప్రముఖ చాట్‌బాట్స్ పని తీరును విశ్లేషించటం గమనార్హం.

### ఒకింత ఆందోళన

ఇప్పటికే వైద్యరంగంలో ఏఐ టూల్స్‌ను విరివిగా వాడుకుంటున్నారు. ఇవి రోగుల రికార్డులను క్రోడీకరించటం, వారికి అనుగుణమైన చికిత్స ప్రణాళికలను రూపొందించటం.. సీటీ స్కాన్లు, ఎక్స్‌రేలు, ఎంఆర్ఐల వంటి పరీక్షలను విశ్లేషించటం వంటివి చేస్తున్నాయి. ప్రయోగ పరీక్షల్లో, మందుల రూపకల్పనలో కచ్చితత్వాన్ని పెంచటానికి, ఖర్చును తగ్గించటానికీ ఇవి ఉపయోగపడుతున్నాయి. క్యాన్సర్ వంటి తీవ్ర జబ్బుల చికిత్సల్లోనూ దన్నుగా నిలుస్తున్నాయి. ఏఐ సాయంతో పరీక్షలను విశ్లేషించటం ద్వారా తొలిదశలోనే జబ్బులను పట్టుకోవచ్చు, నిర్ధరించొచ్చు. అంతేకాదు, జబ్బు ముదురుతున్న తీరును అర్థం చేసుకోవటానికి, అవసరమైతే చికిత్సలను మార్చటానికీ ఏఐ టూల్స్ ఉపయోగపడతాయి. ఈ నేపథ్యంలో తాజా అధ్యయనం కొంత ఆందోళన రేకెత్తిస్తోంది.



### ఏంటీ మోకా పరీక్ష?

వృద్ధుల్లో డిమెన్షియా తొలిదశ లక్షణాలను మోకా పరీక్షతో అంచనా వేస్తుంటారు. దీన్ని పరిశోధకులు డిజిటల్ నమూనాలోకి మార్చటమే కాకుండా, దీంతో కృత్రిమ మేధనూ పరీక్షించారు. జాగరూకత, జ్ఞాపకశక్తి, కార్య నిర్వహణ సామర్థ్యాల వంటి వాటిని నిశితంగా విశ్లేషించారు. ఒక్క చాట్‌జీపీటీ 4ఓ తప్ప మిగతా అన్ని లార్జ్ లాంగ్వేజ్ మోడళ్లలోనూ ఒక మాదిరిగా విషయగ్రహణ సామర్థ్యం క్షీణించినట్టు, వీటిల్లో డిమెన్షియా తొలిదశ లక్షణాలు కనిపించినట్టు తేలటం గమనార్హం. మనుషుల్లో మాదిరిగానే వీటిల్లోనూ వయసు మీద పడటమే ఇందుకు కారణమవుతుండటం విచిత్రం. వయసు మీరిన రోగుల మాదిరిగా పాత చాట్‌బాట్స్ కూడా మోకా పరీక్షలో వెనకపడుతున్నట్టు తేలింది! ప్రముఖ చాట్‌బాట్స్‌లో విషయ గ్రహణ క్షీణత స్పష్టంగా కనిపిస్తుండటం, ఇది జబ్బుల నిర్ధరణలో విశ్వసనీయత మీద ప్రభావం చూపే అవకాశముండటమే ఇప్పుడు ఆలోచింప జేస్తోంది. ఇది రోగుల నమ్మకాన్నీ దెబ్బతీసే ప్రమాదముంది. కృత్రిమ మేధ త్వరలో డాక్టర్ల స్థానాన్ని ఆక్రమిస్తుందనే భావనలనూ ఇది సవాల్ చేస్తోంది.

### పరిమితులు సుస్పష్టం

ఏఐ విషయ గ్రహణ పరిమితులను ఈ అధ్యయనం స్పష్టంగా చూపుతోంది. ఇప్పటికే దీన్ని వైద్య సాధనాలుగా ఉపయోగించుకుంటున్న నేపథ్యంలో దీని విశ్వసనీయత ప్రశ్నార్థకంగా మారే అవకాశమూ కనిపిస్తోంది. నిజానికి ఏఐ మోడళ్ల సామర్థ్యం మీద అనుమానాలు రేకెత్తటం ఇదే మొదటిసారి కాదు. ప్రపంచవ్యాప్తంగా ఆసుపత్రుల్లో రోగుల వివరాలను నమోదు చేయటానికి వాడుతున్న ఓపెన్‌ఏఐకి చెందిన ట్రాన్స్‌క్రిప్షన్ టూల్ 'భ్రమలు, భ్రాంతులకు' లోనవుతున్నట్టు గత సంవత్సరం అక్టోబరులో చేపట్టిన అధ్యయనంలో బయటపడింది. రోగులు చెప్పని సంగతులనూ ఇది పేర్కొనటం సందేహాలకు తావిచ్చింది. యూనివర్సిటీ ఆఫ్ సౌత్ కరోలినా పరిశోధకులూ అప్పట్లోనే ఏఐ విషయగ్రహణ సామర్థ్యాలను పరీక్షించారు. ఐక్యూ పరీక్షలు, దృశ్య సమస్యల ద్వారా ఏఐ మోడళ్లను విశ్లేషించారు. ఓపెన్ సోర్స్, క్లోజ్డ్ సోర్స్ ఏఐ మోడళ్లు రెండూ ఆలోచన, తార్కిక, కార్య నిర్వహణ సామర్థ్యాల విషయంలో ఇబ్బందులు పడినట్టు గుర్తించారు.

### అటూ ఇటూ.. రెండు కోణాలూ..

అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన వైద్యం వంటి రంగాల్లో ఏఐని వాడుకుంటున్నప్పుడు తప్పులు అతి తక్కువగా జరిగేలా చూసుకోవటం చాలా ముఖ్యం. ఇది తప్పులు చేస్తే రోగులకు ఏఐ మీద నమ్మకం సడలుతుంది. ఇప్పటికే దీని ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. వైద్యరంగంలో ఏఐని బాధ్యతాయుతంగా వాడే విషయంలో చాలామంది రోగులకు, వారి కుటుంబ సభ్యులకు నమ్మకం లేనట్టు ఇటీవల జామా పత్రికలో ప్రచురితమైన అధ్యయనం పేర్కొంటుండటమే దీనికి నిదర్శనం. ఆరోగ్యానికి సంబంధించిన తమ సమాచారం భద్రంగా ఉంటుందో లేదోననే అనుమానం బలంగా వ్యక్తమైంది. అలాగని అంతా ప్రతికూలమే అనుకోవటానికి లేదు. ఏఐ పట్ల సానుకూల కోణమూ లేకపోలేదు. మనుషుల స్థాయిలో ఏఐకి విషయగ్రహణ సామర్థ్యాలను కట్టబెట్టటానికి సంస్థలు నిశితంగా దృష్టి సారిస్తున్నాయి. ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ (ఏజీఐ)తో ఏఐ మోడళ్లను ఇంకాస్త పరిపుష్టం చేస్తున్నాయి. తార్కిక ధోరణులతో అంచెలంచెలుగా ఆలోచించాలంటూ ఏఐ మోడళ్లకు ప్రాంప్ట్‌ను అందించగా అవి గణనీయంగా మంచి నైపుణ్యాన్ని, పురోగతిని ప్రదర్శించినట్టు యూఎస్‌సీ పరిశోధకులు గుర్తించారు కూడా. హింట్స్‌తో మోడళ్లకు మార్గనిర్దేశం చేసినప్పుడు వాటి నైపుణ్యం నూటికి నూరు శాతం మెరుగవటం విశేషం. మనసుంటే మార్గముంటుందని ఇవి సూచిస్తున్నాయి. ఏఐ మోడళ్లకు 'వయోభారం' పడకుండా, ఎప్పటికప్పుడు వినూత్నంగా రూపొందిస్తే నమ్మకం, విశ్వసనీయత సడలకుండా కాపాడుకోవటం అసాధ్యమేమీ కాదు.

# ప్రతిబింబాలతో మాయ!

వాన వెలిసిన తర్వాత వాతావరణం ఆహ్లాదకరంగా మారుతుంది. ఈ సమయం.. ఫొటోగ్రఫీకి అనుకూలంగా ఉంటుంది. ఇక రోడ్లపై నిలిచిన వాననీటిలో.. భవనాలు, చెట్ల ప్రతిబింబాలు ప్రత్యేకంగా కనిపిస్తుంటాయి. వాటిని కెమెరాల్లో బంధించడమే.. 'రిఫ్లెక్షన్ ఫొటోగ్రఫీ'. నీళ్లు, గాజు, అద్దాలు, పాలిష్ చేసిన ఉపరితలాలను ఉపయోగిస్తూ.. అద్భుతమైన చిత్రాలు తీసే సృజనాత్మక కళ. మొబైల్ ఫోన్‌తో.. ప్రొఫెషనల్ గేర్ అవసరం లేకుండానే.. అద్భుతమైన రిఫ్లెక్షన్ ఫొటోలను తీయవచ్చు. మీ స్మార్ట్‌ఫోన్‌ని ఉపయోగించి రిఫ్లెక్షన్ ఫొటోగ్రఫీలో నైపుణ్యం సాధించడానికి కావాల్సిన చిట్కాలు, పద్ధతులను ఈ ఎపిసోడ్‌లో తెలుసుకుందాం.

మొబైల్ కెమెరా'నే ఎందుకు?

పోర్టబుల్ : ఎక్కడికైనా సులభంగా తీసుకెళ్లవచ్చు. ఆకస్మికంగా ఫొటో తీయాలనుకుంటే.. వెంటనే జేబులోంచి తీసి 'క్లిక్' అనిపించొచ్చు.

ఫాస్ట్- ఫ్లెక్సిబుల్ : మొబైల్ కెమెరాలతో లైటింగ్, యాంగిల్స్‌ను త్వరత్వరగా అడ్జస్ట్ చేసుకోవచ్చు.

క్రియేటివ్ యాంగిల్స్ : స్మార్ట్‌ఫోన్లను వాడటం చాలా సులువు. రిఫ్లెక్షన్ ఫొటోగ్రఫీలో ఎక్కువగా 'లో యాంగిల్'.. అంటే కింద కూర్చుని ఫొటోలు తీయాల్సి ఉంటుంది. అలాంటి సమయంలో స్మార్ట్‌ఫోన్ కంఫర్ట్‌గా ఉంటుంది. దీని సాయంతో క్లోజ్-అప్ షాట్‌లను సులభంగా తీయవచ్చు.

ప్రొ టిప్ : మరింత డ్రమాటిక్ రిఫ్లెక్షన్ ఫొటోల కోసం మంచి అల్ట్రా-వైడ్‌లెన్స్ ఉన్న మొబైల్ ఫోన్‌ని ఉపయోగించండి.

1. ఉత్తమమైన రిఫ్లెక్టివ్ సర్ఫేస్‌లు అద్భుతమైన ప్రతిబింబాలను ఫొటో తీయడానికి..

నీరు (సరస్సులు, నీటి కుంటలు, కొలనులు) : గుట్టలు, కొండలకు సహజసిద్ధమైన రిఫ్లెక్షన్స్ అందిస్తాయి.

గ్లాస్ కిటికీలు, ఆకాశ హర్మ్యాలు : నగరాలు, భవనాల ప్రతిబింబాలను అద్భుతంగా చూపిస్తాయి.

అద్దాలు : పోర్ట్రెయిట్‌లు, సృజనాత్మక కంపోజిషన్స్ కోసం ఉపయోగపడతాయి.





మెరిసే భవనాలు, టైల్స్ : ఇండోర్ సెట్టింగ్‌లలో ఇల్యూజన్స్ కోసం పనికొస్తాయి.

కారు ఉపరితలాలు, మెటల్ వస్తువులు : వీటిలో నగర దృశ్యాలు, వీధుల ప్రతిబింబింబాలను మరింత అందంగా ఫొటోలు తీయొచ్చు.

ప్రొ టిప్ : వర్షం తర్వాత రోడ్లపై నిలిచే నీరు.. అందమైన ప్రతిబింబాలను సృష్టిస్తాయి. కాబట్టి.. వర్షం వెలిశాక తడి వీధుల్లో విహరించండి. అద్భుతమైన ఫొటోలను తీయండి.

2 కెమెరా సెట్టింగ్‌లు

ఫోకస్ : మీకు కావాల్సిన రిఫ్లెక్షన్ ఆబ్జెక్ట్ స్పష్టంగా ఉండేలా చూసుకోండి.

ఎక్స్‌పోజర్ : ఫొటోలు ఓవర్ ఎక్స్‌పోజ్ కాకుండా ఉండేందుకు ఎక్స్‌పోజర్‌ను అడ్జస్ట్ చేయండి.

హెచ్‌డీఆర్ మోడ్ : అధిక కాంట్రాస్ట్ ఉండే ప్రాంతాలలో.. లైట్స్, షాడోస్‌ని బ్యాలెన్స్ చేసేందుకు హెచ్‌డీఆర్ మోడ్‌ను ఉపయోగించండి.

గ్రిడ్ లైన్లు : రిఫ్లెక్షన్లను సమరూపంగా అమర్చడంలో ఇవి సహాయపడతాయి.

అల్ట్రా వైడ్ మోడ్ : ఈ మోడ్.. దృశ్యాన్ని మరింత విస్తరిస్తుంది. ప్రతిబింబాలను మరింత నాటకీయంగా మారుస్తుంది.

3. లైటింగ్ టెక్నిక్స్..

గోల్డెన్ అవర్ : సూర్యోదయం, సూర్యాస్తమయంలో ఉండే మృదువైన లైటింగ్.. ప్రతిబింబాల అందాన్ని పెంచుతుంది.

బ్లూ అవర్ : సూర్యాస్తమయం తర్వాత మెరుస్తున్న నగర లైట్లతో.. అర్బన్ రిఫ్లెక్షన్స్‌ను అద్భుతంగా బంధించొచ్చు.

మేఘాలు : ఆకాశంలో దట్టంగా కమ్ముకునే మేఘాలు.. ప్రకృతిని కొత్తగా చూపిస్తాయి. రిఫ్లెక్షన్లు ఓవర్ ఎక్స్‌పోజర్ కాకుండా చూస్తాయి.

నైట్ రిఫ్లెక్షన్స్ : నగరాల్లో నదులు, సరస్సుల (మూసీ, హుస్సేన్‌సాగర్)లో కనిపించే భవనాలు, సిటీ లైట్లు, నియాన్ రిఫ్లెక్షన్లను క్యాప్చర్ చేయండి.

ప్రొ టిప్ : క్రియేటివ్ నైట్ రిఫ్లెక్షన్స్ కోసం కృత్రిమ లైట్లను (వీధిదీపాలు, నియాన్ సంకేతాలు) ఉపయోగించండి.

మొబైల్ ఫోన్‌తో అద్భుతమైన రిఫ్లెక్షన్ ఫొటోగ్రఫీని ఆస్వాదించండి. మరింత క్రియేటివ్‌గా ఆలోచిస్తూ.. విభిన్న ఉపరితలాలు, లైటింగ్, యాంగిల్స్‌తో సరికొత్త ప్రయోగాలు చేయండి. ప్రత్యేకంగా కనిపించే, కంటికి ఆకట్టుకునే కంపోజిషన్స్‌ని సృష్టించండి.

# ఖర్చుల నివారణకు కాకేబో

డబ్బు ఖర్చు చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. డిజిటల్ చెల్లింపులు పెరిగిపోవడంతో ఒకప్పటి కంటే ఈ నియమం అవసరం ఇప్పుడే ఎక్కువ. ఈ దిశగా మన రోజువారీ ఆర్థిక అలవాట్లను క్రమబద్ధం చేసుకోవడానికి 'కాకేబో' గొప్పగా ఉపయోగపడుతుంది.

**ఖర్చులో జాగ్రత్త** కాకేబోలో మన ఖర్చుల వివరాలు చేత్తో రాసుకుంటాం. కాబట్టి, ఖర్చు విషయంలో మనకు భావోద్వేగ సంబంధం ఉంటుంది. డబ్బును జాగ్రత్త చేసుకోవడానికి దారిచూపుతుంది.

**అవసరమే ప్రధానం:** కాకేబో ఆర్థిక పరిశీలనను ప్రోత్సహిస్తుంది. ఏదైనా కొనాలనుకునే ముందు మీ ఆర్థిక లక్ష్యాలకు ఆ వస్తువు అవసరమో లేదో చూసుకోమని హెచ్చరిస్తుంది. ఈ రకమైన అవగాహన కాలక్రమంలో మనల్ని అవసరాల మేరకే ఖర్చు చేసేలా తయారుచేస్తుంది.

**ముందు పొదుపు:** ఖర్చు చేయడానికి ముందు పొదుపు ఆవశ్యకత గురించి కాకేబో నొక్కిచెబుతుంది. ఖర్చులు అన్నీ పోగా మిగిలింది పొదుపు చేయడానికి బదులుగా, ముందే పొదుపు చేయడం మనకు ఆర్థిక భద్రత ఇస్తుంది.

ఎన్నో పరిమితులతో కూడిన ఇతర బడ్జెటింగ్ పద్ధతులతో పోలిస్తే కాకేబో సరళంగా ఉంటుంది. పెద్దపెద్ద ఖాతాలు రాసుకునే బాధ ఇందులో ఉండదు. ఖర్చు చేయడంలో జాగ్రత్తగా ఉంటాం కాబట్టి, ఆర్థిక క్రమశిక్షణ అలవడుతుంది. దీర్ఘకాలిక ఆర్థిక సుస్థిరతకు హామీ లభిస్తుంది.





## పులివెందుల జడ్పీ ఉప ఎన్నికలో పోలీసుల తీరుపై నిరసన

### ఈసీ కార్యాలయం ఎదుట వైసీపీ నేతల ధర్నా

అమరావతి,ఆగస్ట్9(సాక్ష్యం): పులివెందుల నియోజకవర్గంలో జరుగుతున్న జిల్లా పరిషత్ ఉప ఎన్నికల్లో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ వైసీపీ నాయకులు విజయవాడలో ఆందోళనకు దిగారు. పోలీసుల తీరుకు నిరసనగా రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైసీపీ నేతలు మాట్లాడుతూ, పులివెందులలో తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై ప్రత్యర్థులు దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఫిర్యాదులు చేసినా స్వీకరించకుండా, బాధితులనే భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. పోలీసులు పూర్తిగా అధికార పార్టీకి కొమ్ముకాస్తూ, శాంతిభద్రతలను గాలికొదిలేశారని వారు ధ్వజమెత్తారు. ఉప ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడంలో పోలీసులు విఫలమయ్యారని వైసీపీ నేతలు విమర్శించారు. తమ నాయకులపై జరుగుతున్న దాడులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా చూడాలని వారు రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. పోలీసుల పక్షపాత వైఖరిపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని వారు కోరారు. ఈ ధర్నాతో ఎన్నికల సంఘం కార్యాలయం వద్ద కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మరోవైపు పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలో గెలిచేందుకు టీడీపీ నేతలు అనేక కుట్రలకు పాల్పడుతున్నారని వైసీపీ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి విమర్శించారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారని ఆరోపించారు. టీడీపీ అరాచకాలకు పోలీసులు వంత పాడుతున్నారని దుయ్యబట్టారు. అధికార అండతో అధికారులను టీడీపీ విచ్చలవిడిగా వాడుకుంటోందని మండిపడ్డారు.

పులివెందులలో ఏం జరుగుతోందో ప్రజలందరికీ తెలుసని రాచమల్లు అన్నారు. వైఎస్ అనే పేరుకు పులివెందులలో ఓటమే లేదని చెప్పారు. సాక్షి సిబ్బందిపై టీడీపీ శ్రేణులు దాడులకు పాల్పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాక్షి మీడియా సిబ్బంది అంతా వైసీపీ కుటుంబ సభ్యులేనని చెప్పారు. టీడీపీ ఎన్ని కుట్రలకు పాల్పడినా జడ్పీటీసీ ఉప ఎన్నికలో వైసీపీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఓటమి భయంతోనే టీడీపీ కుట్రలకు తెరలేపిందని ఎద్దేవా చేశారు.

## ఏపీలో మరో జాబ్ నోటిఫికేషన్ విడుదల

### ఏపీపీ పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

అమరావతి,ఆగస్ట్9(సాక్ష్యం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తాజాగా మరో జాబ్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నోటిఫికేషన్ కింద మొత్తం 42 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) పోస్టుల భర్తీకి ఏపీ పోలీసు నియామక మండలి నోటిఫికేషన్ జారీ చేసింది. అర్హులైన అభ్యర్థులు ఆగస్టు 11 నుంచి ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చు. సెప్టెంబరు 7వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపింది. ఇక రాత పరీక్ష అక్టోబరు 5వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించనున్నారు. మొత్తం 2 పేపర్లకు ఈ పరీక్ష జరుగుతుంది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పేపర్ 1 పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో జరుగుతుంది. మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకూ పేపర్ 2 పరీక్ష డిస్క్రిప్టివ్ విధానంలో ఉంటుంది. ఈ మేరకు పోలీసు నియామక మండలి ఛైర్మన్ రాజీవ్ కుమార్ మీనా ఓ ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలు అధికారిక వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2025-26 విద్యా సంవత్సరానికి ఎంటెక్‌లో ప్రవేశాల కోసం నిర్వహించనున్న పీజీఈసెట్ కౌన్సెలింగ్ వాయిదా పడింది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి ప్రకటన జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం బోధన రుసుములను చెల్లించకపోవడంతో పలు కళాశాలలు, విశ్వవిద్యాలయాలు సర్టిఫికెట్ల జారీని నిలిపివేశాయి. ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని తెగేసి చెబుతున్నాయి. ప్రభుత్వ యూనివర్సిటీలు కూడా సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. ఇక ప్రైవేటు కాలేజీల సంగతి సరేసరి. దీంతో చేసేదిలేక ఉన్నత విద్యామండలి కౌన్సెలింగ్ వాయిదా వేసింది. మరోవైపు పీజీఈసెట్ కౌన్సెలింగ్‌కు అవసరమైన సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేసేందుకు సమయం ఇవ్వాలంటూ అభ్యర్థులు కూడా వరుస విజ్ఞప్తులు కోరడంతో కౌన్సెలింగ్ వాయిదా వేస్తున్నట్లు ఉన్నత విద్యామండలి ప్రకటన జారీ చేసింది.

## నాపై దాడికి కుట్ర చేస్తున్నారు

### టీడీపీకి తొత్తులుగా మారిన పోలీసులు
### నాకు ఏమైనా జరిగితే లోకేష్, బీటెక్ రవిలదే బాధ్యత
### వైసీపీ నేత సతీష్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

అమరావతి,ఆగస్ట్9(సాక్ష్యం): తనపై దాడి కుట్ర జరుగుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, రాష్ట్ర కార్యదర్శి ఎస్వీ సతీష్ కుమార్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ , పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి ఈ కుట్రకు బాధ్యులని ఆరోపించిన ఆయన, వీరిద్దరిపై సుమోటోగా కేసు నమోదు చేసి సీబీఐతో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తన మీద దాడి జరగబోతున్న విషయం టీడీపీ నేతల ద్వారా తనకు ముందే సమాచారం వచ్చిందని సతీష్ కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పులివెందులలో వైసీపీ నేత మీడియాతో మాట్లాడుతూ, "ఇక్కడ పోలీసులు పచ్చరంగు చొక్కాలు వేసుకుని తిరుగుతున్నారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు ఒక పార్టీకి అనుకూలంగా పని చేస్తున్నారు. డీజీపీకి ప్రత్యక్షంగా విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ మీడియా సమావేశం ద్వారా నేను ఏపీ డీజీపీని కోరుతున్నాను. నాకు తెలిసిన సమాచారం ప్రకారం నా మీద దాడి జరగబోతోంది. ఈ విషయం టీడీపీ నేతల ద్వారానే తెలిసింది. నన్ను హత్య చేయాలని కుట్ర జరుగుతోంది. అదే సమయంలో నాకు రాష్ట్ర పోలీసులపై ఎటువంటి నమ్మకం లేదు. నేను నిరాయుధుణ్ని. నన్ను కాపాడే బాధ్యత పోలీసులదే. మీరు నన్ను కాపాడలేకపోతే కనీసం దాడి జరగకుండా చూడాలి. కానీ నామీద ఏమైనా దాడి జరిగినట్లయితే అది రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి నారా లోకేష్, బీటెక్ రవి ప్రోత్సాహంతో జరిగింది అని పరిగణించాలి. నాపై ఏదైనా దాడి జరిగితే వెంటనే వీరిద్దరిపై సుమోటోగా కేసు నమోదు చేసి, సీబీఐతో విచారణ జరిపించాలి" అన్నారు. పులివెందులలో ఉన్న పోలీసులపై కూడా సతీష్ కుమార్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. ఇక్కడి పోలీసులు పోలీసోళ్లు కాదు. పచ్చ చొక్కాలు వేసుకుని తిరుగున్నారు. డీఎస్పీ, రూరల్ సీఐ, డీఐజీలు పోలీస్ సిబ్బందికి పెత్తనం ఇచ్చారు. నిజాయితీగా పని చేసే అధికారులు పక్కకు జరిగారు. కనుక ఇలాంటి పరిస్థితుల్లో తమకు న్యాయం జరగదని వైసీపీ నేత స్పష్టం చేశారు. పోలీసులు టీడీపీ నేతలకు తొత్తులుగా మారి వ్యవహరిస్తున్నారని, వైసీపీ నేతలను వేధించాలని కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

## మంగళగిరి మహిళలే నా అక్కచెల్లెళ్లు: లోకేశ్

గుంటూరు,ఆగస్ట్9(సాక్ష్యం): సోదరి లేని తనకు మంగళగిరి మహిళలే అక్కాచెల్లెళ్లు అని మంత్రి లోకేష్ అన్నారు. శనివారం రాఖీ పండుగను పురస్కరించుకొని ఉండవల్లిలోని మంత్రి నివాసంలో మంత్రి లోకేష్‌కు మంగళగిరి మహిళలు పెద్ద ఎత్తున వచ్చి రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ... రాఖీకట్టి తనకు అందించిన ఆశీస్సులు కొండంత బలాన్నిచ్చాయన్నారు. మంగళగిరి ఆడబిడ్డలందరికీ నేను ఎల్లప్పుడూ రుణపడి ఉంటాను. మంగళగిరిలో త్వరలోనే మరో విడత ఇళ్ల పట్టాలు అందించేందుకు ఏర్పాట్లు- చేస్తున్నాం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో 200 అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించాం. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుత్, గ్యాస్ పైప్‌లైన్ల ఏర్పాటు-, 100 పడకల ఆసుపత్రి, స్వర్ణకారుల కోసం జెమ్స్ అండ్ జ్యువెలరీ పార్కు వంటివి పురోగతిలో ఉన్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్లన్నీ అభివృద్ధి చేస్తున్నాం. మహా ప్రస్థానం పేరుతో శ్మశాన వాటికల నిర్మాణం, పార్కుల అభివృద్ధికి చర్యలు చేపట్టాం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా మంగళగిరి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం ' అని అన్నారు.

# జీవో 3ను పునరుద్ధరిస్తాం

- గత ప్రభుత్వ వైఫల్యం వల్లే జీవో 3 రద్దు
- గిరిజనుల ఉద్యోగ రిజర్వేషన్లు తెస్తాం
- ఏజెన్సీలో అభివృద్ధికి వేల కోట్ల నిధులు
- 5 మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల ఏర్పాటు
- పాడేరులో సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు





అమరావతి,ఆగస్ట్9(సాక్ష్యం): గిరిజనుల అభివృద్ధి రాష్ట్ర సమగ్ర వికాసానికి కీలకమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని లగిశపల్లిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి భారీ ప్యాకేజీ ప్రకటించారు. ఏజెన్సీ సమగ్రాభివృద్ధికి, గిరిజనుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. పాడేరులో జరిగిన సభలో ప్రసంగించిన ఆయన, గిరిజనుల చిరకాల ఆకాంక్ష అయిన ఉపాధ్యాయ ఉద్యోగాల్లో 100 శాతం రిజర్వేషన్లు కల్పించే జీవో నంబర్ 3ను పునరుద్ధరించే బాధ్యత తనదేనని ఉద్ఘాటించారు. ఏజెన్సీ ప్రాంతాలను దేవుడు సృష్టించిన అద్భుతంగా అభివర్ణించిన చంద్రబాబు, ఇక్కడి స్వచ్ఛమైన కొండలు, సహజసిద్ధమైన ప్రజల మనస్తత్వం తనను ఆకర్షించాయని తెలిపారు. "మళ్లీ జన్మ ఉంటే ఈ ఏజెన్సీలోనే పుట్టాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. గిరిజనుల సహజ నైపుణ్యం, సామర్థ్యాలను ప్రశంసిస్తూ, వారి అభివృద్ధి ద్వారానే రాష్ట్రం సంపూర్ణ వికాసం సాధ్యమని ఆయన పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి మొదటి నుంచి ప్రాధాన్యత ఇచ్చిన నాయకుడిగా ఎన్టీఆర్‌ను గుర్తు చేస్తూ, ఆ దిశగా తమ ప్రభుత్వం కృషి కొనసాగిస్తుందని చంద్రబాబు తెలిపారు. ఏజెన్సీలోని 1,483 గిరిజన గూడేలకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు రూ. 2,850 కోట్లు మంజూరు చేస్తున్నామని చంద్రబాబు ప్రకటించారు. జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికీ పరిశుభ్రమైన తాగునీరు అందిస్తామని, దీని కోసం రూ. 220 కోట్లతో పనులు చేపడుతున్నామని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలను మెరుగుపరిచేందుకు రూ. 482 కోట్ల వ్యయంతో ఐదు మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. వీటితో పాటు పాడేరు, రంపచోడవరం, శ్రీశైలం ఐటీడీఏల పరిధిలోనూ ఆసుపత్రులు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. జీవో నంబర్ 3 రద్దు కావడానికి గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని చంద్రబాబు ఆరోపించారు. తమ హయాంలో గిరిజన యువతకు న్యాయం చేసేందుకు రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్ ఆధారంగా జీవో తెచ్చామని, కానీ గత ప్రభుత్వం కోర్టులో సరిగ్గా వాదనలు వినిపించలేకపోయిందని విమర్శించారు. న్యాయపరమైన అంశాలను పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా ఈ జీవోను పునరుద్ధరించి గిరిజనులకు న్యాయం చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఏజెన్సీ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు అరకు కాఫీకి ప్రపంచవ్యాప్తంగా బ్రాండింగ్ కల్పిస్తామని చంద్రబాబు తెలిపారు. కాఫీ, మిరియాలు, పసుపు వంటి ఆర్గానిక్ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి ధర లభించేలా చూస్తామన్నారు. వెదురు ఉత్పత్తుల ద్వారా 5 వేల మంది గిరిజన మహిళలకు ఏడాదికి లక్ష రూపాయల ఆదాయం వచ్చేలా ప్రత్యేక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. టూరిజం హబ్స్‌గా ఏజెన్సీ ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని, యువతకు ఇక్కడే ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. సూపర్ సిక్స్ పథకాలైన పెన్షన్ల పెంపు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం వంటివి ఇప్పటికే అమలు చేస్తున్నామని గుర్తుచేశారు. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం తనకు రెండు కళ్ల వంటివని, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు అన్ని చర్యలు తీసుకుంటానని చంద్రబాబు స్పష్టం చేశారు. "అరకు కాఫీ అంటే ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఒక బ్రాండ్. నేను ప్రమోట్ చేసిన ఈ బ్రాండ్‌ను పారిస్ వంటి నగరాల్లో సైతం ప్రదర్శించాం. ప్రస్తుతం పాడేరు ఏజెన్సీ పరిధిలోని 11 మండలాల్లో 2.58 లక్షల ఎకరాల్లో కాఫీ సాగవుతుండగా, దానిపై 2.46 లక్షల మంది ఆధారపడి జీవిస్తున్నారు. ఇప్పుడు మరో లక్ష ఎకరాల్లో సాగును విస్తరించి గిరిజన రైతన్నలకు మరింత చేయూతనిస్తాం" అని భరోసా ఇచ్చారు. ఒకప్పుడు ఏజెన్సీ ప్రాంతాలంటే గంజాయికి అడ్డా అనే చెడ్డపేరు ఉండేదని, గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంతాలు కలుషితమయ్యాయని, కానీ తమ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో ఎక్కడా గంజాయి మాట వినపడకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు. ఆదివాసీల సంపూర్ణ అభివృద్ధే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని చంద్రబాబు ఉద్ఘాటించారు. గిరిజనుల ఆరోగ్య సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, ఇందులో భాగంగా రూ.482 కోట్ల వ్యయంతో ఏజెన్సీ ప్రాంతాల్లో ఐదు మల్టీస్పెషాలిటీ ఆసుపత్రులను నిర్మిస్తున్నామని తెలిపారు. డోలీ మోతలు లేని సమాజం కోసం 122 ఫీడర్ అంబులెన్సులు ఏర్పాటు చేశామని, గర్భిణీలకు ప్రత్యేక పోషకాహార ప్యాకేజీలు అందిస్తున్నామని వివరించారు. ప్రధానమంత్రి గ్రామీణ ఆవాస్ యోజన కింద విశాఖ జిల్లా పరిధిలోని గిరిజనులకు 54 వేల ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశామని, అరకు, లంబసింగి, మారేడుమిల్లి ప్రాంతాలను టూరిజం క్లస్టర్లుగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి వెల్లడించారు. స్థానికంగా యువతకు ఉపాధి కల్పించేందుకు 1000 హోం స్టేల ఏర్పాటుకు ఆర్థికంగా అండగా నిలుస్తామని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణంతో రవాణా కష్టాలు తీరుస్తామని, ఇప్పటికే రూ.8,570 కోట్ల విలువైన జాతీయ రహదారుల పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ఆదివాసీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కట్టుబడి ఉన్నామని, 'తల్లికి వందనం' పథకం ద్వారా 4.86 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.642 కోట్లు జమ చేశామని గుర్తుచేశారు. రద్దయిన జీవో నంబర్ 3 స్థానంలో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా స్థానిక గిరిజనులకే ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ నెలాఖరులోగా మెగా డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించారు. అంతకుముందు, వంజంగిలో మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకున్న చంద్రబాబు, ఆలయ అభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కాఫీ తోటలను పరిశీలించి, గిరిజన సంప్రదాయ నృత్యాలను తిలకించారు.

## అంతర్జాతీయ స్థాయికి అరకు కాఫీ..

- రబ్బరు, కాఫీ సాగు విస్తరణకు అడుగుఉలు
- బ్రాండింగ్ బాధ్యతలు స్వీకరించిన టాటా
- గిరిజన అభివృద్ధి లక్ష్యంగా ముందడుగు
- ఏజెన్సీలో ఓయో హోమ్‌స్టేల ఏర్పాటు
- ఐటీడీఏలతో బోర్డుల ఒప్పందం



అమరావతి,ఆగస్ట్9(సాక్ష్యం): ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రాంతాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన అరకు కాఫీకి మరింత బ్రాండ్ ఇమేజ్ తీసుకురావడమే కాకుండా, ఆదివాసీల ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించే దిశగా పలు ప్రతిష్ఠాత్మక సంస్థలతో అవగాహన ఒప్పందాలు (ఎంఓయూలు) కుదుర్చుకుంది. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాడేరులో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో మొత్తం 21 ఒప్పందాలు జరిగాయి. వీటిలో అత్యంత కీలకమైనది, ప్రముఖ కార్పొరేట్ దిగ్గజం టాటా కన్స్యూమర్స్ సంస్థతో గిరిజన సహకార సంస్థ (జీసీసీ) చేసుకున్న ఒప్పందం. ఈ ఒప్పందం ద్వారా ఆర్గానిక్ అరకు కాఫీని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బ్రాండింగ్ చేసి, మార్కెటింగ్ చేసే బాధ్యతను టాటా స్వీకరించనుంది. ఇది అరకు కాఫీ ఖ్యాతిని కొత్త శిఖరాలకు చేర్చగలదని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు, కాఫీ సాగును ప్రోత్సహించేందుకు ఐటీసీ సంస్థ పాడేరు ఐటీడీఏతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇప్పటికే 4,010 హెక్టార్లలో కాఫీ సాగు చేస్తున్న ఐటీసీ, అదనంగా మరో 1,600 హెక్టార్లలో సాగును విస్తరించనుంది. గిరిజన ప్రాంతాల్లో పర్యాటకాన్ని ప్రోత్సహించి, స్థానికులకు ఉపాధి కల్పించేందుకు ప్రముఖ హాస్పిటాలిటీ సంస్థలు ఓయో హోమ్స్, హోమీ హట్స్ ముందుకొచ్చాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో హోమ్‌స్టేల అభివృద్ధి, నిర్వహణ కోసం ఈ సంస్థలు ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్నాయి. దీని ద్వారా పర్యాటకులకు మెరుగైన వసతి సౌకర్యాలు లభించడంతో పాటు గిరిజనులకు ఆర్థికంగా లబ్ధి చేకూరనుంది. ఏపీ గిరిజనోత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్‌కు పరిచయం చేసే లక్ష్యంతో అమెరికాకు చెందిన హాతీ సర్వీసెస్ ఎల్ఎల్‌సీ సంస్థతో జీసీసీ ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం ద్వారా అమెరికాలో జీసీసీ రిటైల్ కార్యకలాపాలు ప్రారంభించనుంది. దేశవ్యాప్తంగా గిరిజన ఉత్పత్తుల విక్రయానికి ట్రైఫెడ్‌తో కలిసి జీసీసీ రిటైల్ షోరూమ్‌లను ఏర్పాటు చేయనుంది. ఇవే కాకుండా రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో రబ్బరు సాగును ప్రోత్సహించేందుకు కేంద్ర రబ్బరు బోర్డు, చింతపల్లిలో కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు సబ్ కో సంస్థ, పసుపు ప్రాసెసింగ్ కోసం ఎక్విప్ సంస్థలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందాలన్నీ గిరిజనులకు జీవనోపాధి అవకాశాలు మెరుగుపరచడం, వారి ఉత్పత్తులకు సరైన ధర కల్పించడం, పర్యాటక రంగం ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం లక్ష్యంగా జరిగాయి.

## వైఎస్ సునీతారెడ్డి ఆవేదన అర్థంచేసుకోవాలి

విజయనగరం,ఆగస్టు9(సాక్ష్యం): తన తండ్రి మాజీమంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య జరిగి ఆరేళ్ల అయినా తమ కుటుంబానికి న్యాయం జరగలేదంటున్న వైఎస్ సునీత రెడ్డి ఆవేదనను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అర్థం చేసుకోవాలి లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. తన తండ్రిని హత్య చేసిన వారు.. దానికి సహకరించిన వారు.. రాజకీయాల నీడలో పబ్లిక్‌గా తిరుగుతుంటే ఎవ్వరు ఏమి చెయ్యలేని పరిస్థితి నెలకొందని ఆమె ఆందోళన చెందుతున్నారన్నారు. హైకోర్టులో 6 కేసులు, సుప్రీంకోర్టులో 6 కేసులు ఉన్నాయని,ఆమె చెబుతున్నారని ఒక ఆడపిల్ల ఆధారాలతో ఎవరు హత్య చేశారో, దానికి ఎవరు సహకరించారో,ఎవరు తమ కుటుంబాన్ని ఎలా తప్పుత్రోవ పట్టించారో వివరాలతో ప్రాణాలకు తెగించి బయట పెడుతున్నా,పోలీసు వ్యవస్థ, న్యాయ వ్యవస్థ,కేంద్ర దర్యాప్తు సంస్థలు త్వరగతిన న్యాయం చేయకపోవడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు త్వరగా తగిన న్యాయం సునీత రెడ్డికి జరిగేలా చర్యలు తీసుకోవాలని భీశెట్టి కోరారు. రాజకీయాల్లో వివేకా హత్య దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోందని,దర్యాప్తు సంస్థలు మొద్దు నిద్రలో ఉన్నట్టు- కనిపిస్తోందని భీశెట్టి ఆరోపించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు కూడా కుట్రలు ఛేదించడంలో విఫలం కావడం వెనుక రాజకీయ కారణాలు ఉన్నట్టు- ప్రజలు అభిప్రాయపడుతున్నారని ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకి మంచిది కాదన్నారు.

## గుంటూరు శంకర్ విలాస్ ఫ్లైఓవర్ కూల్చివేత

అమరావతి,ఆగస్ట్9(సాక్ష్యం): గుంటూరు నగరంలోని 70 ఏళ్ల పురాతన శంకర్ విలాస్ ఫ్లైఓవర్ కూల్చివేత పనులు ప్రారంభమయ్యాయి. 1958లో నిర్మించిన ఈ ఫ్లైఓవర్, గుంటూరు వెస్ట్, గుంటూరు ఈస్ట్ శాసనసభ నియోజకవర్గాలను అనుసంధానించే కీలకమైన రైల్వే ఓవర్ బ్రిడ్జ్ . నగర విస్తరణ , పెరిగిన ట్రాఫిక్ ఒత్తిడి కారణంగా, ఈ పాత రెండు-లేన్ల బ్రిడ్జ్‌ను కూల్చివేసి, రూ. 98 కోట్లతో నాలుగు-లేన్ల కొత్త %=ాదీ% నిర్మించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సన్నద్ధమయ్యాయి. ఈ ప్రాజెక్ట్ గత 20 ఏళ్లుగా స్థానికుల డిమాండ్‌గా ఉంది. గుంటూరు ఎంపీ , కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఈ నిధులను రాబట్టడంలో కీలక పాత్ర పోషించారు. 1958 ఆగస్టు 8న అప్పటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి ఈ ఫ్లైఓవర్‌కు శంకుస్థాపన చేశారు. ఇది గత 65 ఏళ్లకు పైగా సేవలు అందించింది. ఈ వంతెన డిజైన్ లైఫ్‌టైమ్ 50 ఏళ్లు మాత్రమే. రోజుకు 90,000 వాహనాలు ఈ బ్రిడ్జ్‌పై ప్రయాణిస్తాయని అంచనా. బ్రిడ్జ్ వయసు, పెరిగిన ట్రాఫిక్ ఒత్తిడి కారణంగా నిర్మాణం బలహీనపడింది, ట్రాఫిక్ జామ్‌లు సర్వసాధారణమయ్యాయి. కేంద్ర ప్రభుత్వం రూ. 98 కోట్ల నిధులు మంజూరు చేసింది. మొదట ఆరు-లేన్ల %=ాదీ% నిర్మించాలని ప్లాన్



చేశారు కానీ ఆస్తుల నష్టాన్ని తగ్గించేందుకు నాలుగు-లేన్ల %=ాదీ%గా డిజైన్ ఖరారు చేశారు. ఫ్లైఓవర్ ఎత్తు 8 మీటర్ల నుండి 11.5 మీటర్లకు పెంచారు. పొడవు 1.5 కి.మీ నుండి 930 మీటర్లకు కుదించారు. డిజైన్‌లు ఏప్రిల్ 2025లో ఖరారయ్యాయి. ప్రాజెక్టు పూర్తికి 12-16 నెలలు పట్టవచ్చని భావిస్తున్నారు. మొదట నిర్మాణం పూర్తి చేసి, తర్వాత రైల్వే అండర్ బ్రిడ్జ్ నిర్మిస్తారు.

కేంద్ర ప్రభుత్వం రూ. 98 కోట్లను సెంట్రల్ రోడ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ కింద మంజూరు చేసింది, ఇది ఆంధ్రప్రదేశ్‌లో 13 రోడ్ ప్రాజెక్టుల కోసం మొత్తం రూ. 400 కోట్లలో భాగం. ఫ్లైఓవర్ విస్తరణ కోసం 134 ఆస్తుల్లో కొంత భాగం సేకరించారు. ఆస్తి యజమానులకు నష్టపరిహారంగా నాలుగు రెట్లు విలువైన ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ బాండ్లు ఇస్తున్నారు. చాలా మంది యజమానులు సహకరించగా, కొందరు న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఫ్లైఓవర్ కూల్చివేత కారణంగా గుంటూరు నగరంలో సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ట్రాఫిక్ పోలీసులు సూచించారు. గతంలో మూడు వంతెనల అండర్‌పాస్ విస్తరణ సమయంలో మూడు నెలల పాటు ట్రాఫిక్ సమస్యలు ఎదురయ్యాయి. వేగంగా బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు. 70 ఏళ్లుగా గుంటూరు నగరంలో ఒక ఐకానిక్ నిర్మాణంగా ఉన్న శంకర్ విలాస్ ఫ్లైఓవర్ కూల్చివేతతో, స్థానికులు తమ జ్ఞాపకాలను నెమరువేసుకుంటున్నారు. ఈ బ్రిడ్జ్ నగర చరిత్రలో ఒక ముఖ్యమైన భాగంగా నిలిచింది.

## సోదర భావానికి ప్రతీక రాఖీ పండుగ: కలెక్టర్

- ఏళ్లకాలం తోడునీడగా నిలిచేది సోదర, సోదరీమణుల బంధం రాఖి
- ప్రేమ, ఆప్యాయతలు పంచుకునే ప్రేమబంధం
- శ్రావణ మాస పౌర్ణమి రోజు జరుపుకునే ఈ పండుగ రాఖి
- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా ప్రతినిధి ( సాక్ష్యం న్యూస్) 9 ఆగస్టు** సోదర భావానికి ప్రతీక గా రాఖీ పండగ నిలుస్తుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. శనివారం టేక్మాల్ మండలం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. అక్కడ బాలికలు కలెక్టర్ కు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికలకు దీవెనలు అందించారు. మన దేశ సంస్కృతికి సాంప్రదాయాలకు ప్రతీకగా రాఖీ పండుగ నిలుస్తుందని అన్నారు. ఇది సాధారణంగా సోదరీమణులు తమ సోదరులైన అధికారులకు రాఖీ కట్టి, వారి రక్షణ కోసం ప్రార్థించే ఒక కార్యక్రమం అని వివరించారు. ఇది సమాజంలో సోదరభావం ఐక్యతను పెంపొందించడానికి ఒక అవకాశంగా ఉపయోగపడుతుందిని చెప్పారు.

## కురుమ సంఘానికి విచ్చిన్నం చేయాలనీ చుస్తే సహించేది లేదు



**నారాయణఖేడ్ ఆగష్టు 09( సాక్ష్యం న్యూస్ )** కురుమ సంఘ%శీ% మండల తాలూకా కమిటీలు అంటూ సంఘాన్ని విచ్చిన్నం చేయాలనీ చుస్తే ఊరుకునేది లేదని కురుమ సంఘం నాయకులు అన్నారు. నారాయణఖేడ్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మొన్న మండల కమిటీలు, నిన్న తాలూకా కమిటీలు వేయడాని సంఘం సభ్యులు తీవ్రంగా మండిపడ్డారు. కురుమ సంఘం అధ్యక్షులుగా ప్రభాకర్ కురుమ ఉండగా మాజీ జిల్లా అధ్యక్షులు బూరుగడ్డ నగేష్,ప్రస్తుత జిల్లా అధ్యక్షులు మల్లయ్య నారాయణఖేడ్ తాలూకా కమిటీ అని ఎవరికి తెలియని వ్యక్తికి ప్రకటించడం కరక్ట్ కాదు నిన్న ప్రకటించిన మండల కమిటీ, తాలూకా కమిటీని ఉపసంహారించుకోవాలని లేని యెడల ఆందోళన కార్యక్రమలు చేస్తామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షులు నారాయణఖేడ్ సంఘానికి విచ్చిన్నం చేసే కుట్రలు మానుకోవాలని అన్నారు. భావదియా నారాయణఖేడ్ కురుమ సంఘం.

## రాఖీ పండుగ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులకు రాఖీ కడుతున్న మహిళా నాయకురాలు



**సాక్ష్యం న్యూస్ సదాశివపేట** సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో రాఖీ పండుగ సందర్భంగా సిపిఐ పార్టీ కార్యాలయంలో రాఖీ పండుగను ఘనంగా నిర్వహించడం జరిగింది జిల్లా కార్యవర్గ సభ్యులకు ఎం తాజుద్దీన్ షఫీ లకు రాఖీ కడుతున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకురాలు బూజమ్మ రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం తాజుద్దీన్ మాట్లాడుతూ అన్నాచెల్లెళ్ల ప్రేమ అనురాగాలకు పెట్టింది పేరు రాఖీ పండగ ఈ పండుగ అందరికి మంచి జరగాలని అందర%శీ% సుఖశాంతులతో ఉండాలని అందరూ సమాజంలో అన్నదమ్ముల వలె కలసి మెలసి మెలగాలని ప్రజాస్వామ్యాన్ని కాపాడలని కొరారు ఇంకా ఈ కార్యక్రమంలో ఎండి ముస్తఫా పూలమ్మ బిపాషా .గౌస్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## దేశ అభ్యున్నతికి కంకణ బద్దులు కావాలి

శాంతినికేతన్ ప్రిన్సిపాల్ మాలిపటేల్ అరవింద

**సాక్ష్యం న్యూస్ సదాశివపేట** సంగారెడ్డి జిల్లాసదాశివపేట పట్టణం నందు శాంతినికేతన్ విద్యాలయంలో విద్యార్థులు పాఠశాల సిబ్బందికి మరియు విద్యార్థులు ఒకరికి ఒకరు రాఖీలు కట్టుకొని నీవు నాకు రక్ష నేను నీకు రక్ష మనిద్దరం కలిసి ఈ దేశానికి రక్షా అని రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు పాఠశాల ప్రిన్సిపల్ మాలిపటేల్ అరవిందశ్రీ మాట్లాడుతూ రక్షాబంధన్ అనేది ఈ రోజు ప్రతి ఒక్కరం కంకణ బద్ధులమై మంచి విద్యను అభ్యసించి ఉత్తమ పౌరులుగా ఎదిగి దేశ అభ్యున్నతికి కృషి చేసుకోవాలని అన్నారు. పాఠశాలకు మీ జన్మ స్థలానికి దేశానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చి అన్నదమ్ముల వలె అక్క చెల్లెల వలె కలిసి జీవించి జాతీయ సమైక్యతకు పాటుపడాలని అన్నారు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ లో భాగంగా పాఠశాల విద్యార్థులు ఎంతో చక్కగా స్వయంగా విద్యార్థులు రాఖీలు తయారు చేసి కట్టుకోవడం చాలా సంతోషకరంగా కనిపించింది అని అన్నారు.

### సదాశివపేట శిశు మందిర్

## విద్యార్థుల రాఖీ పౌర్ణమి వేడుకలు

**సాక్ష్యం న్యూస్ సదాశివపేట** సంగారెడ్డి జిల్లాసదాశివపేట పట్టణంలోని శిశుమందిర్ విద్యార్థులు రాఖీ పౌర్ణమి సందర్బంగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారి నివాసనికి వచ్చి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారి తనయుడు చింత సాయినాథ్ గారికి రాఖీ కట్టారు. విద్యార్థులను ఆప్యాయంగా పలకరించిన సాయినాథ్ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం లో శిశు మందిర్ స్కూల్ విద్యార్థులు ఉపాధ్యాయులు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## రాఖి పౌర్ణమి, రక్షాబంధన్ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, ప్రేమానుబంధాలకు ప్రతీక ఎమ్మెల్యే



**బోయిన్పల్లి ఆగస్టు 9 (సాక్ష్యం న్యూస్)** బోయిన్పల్లి లోని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా మహిళలు ఎమ్మెల్యే కు రాఖీ కట్టి, అక్కాచెల్లెళ్ల బంధాన్ని ప్రతిబింబించే ఈ సాంప్రదాయాన్ని ఎంతో సౌభ్రాతృభావంతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అమ్మాయిలు, మహిళలు సమాజ అభివృద్ధికి మూలస్తంభాలు. మహిళల రక్షణ, సంక్షేమం నా మొదటి కర్తవ్యం. ఈ రాఖీ నాకు ఆ బాధ్యతను మరింత గుర్తు చేస్తుంది" అని పేర్కొన్నారు. అదే విధంగా రాఖీ పౌర్ణమి ప్రేమాను బంధాలకు, సహోదరత్వానికి ప్రతీక అని తెలిపారు. దేశవ్యాప్తంగా జరుపుకునే రక్షా బంధన్ పండుగ, ఆడబిడ్డలు తమ అన్నలకు జీవితాంతం అండగా ఉండాలని ఆశిస్తూ కట్టే రక్షాబంధనం భారతీయ జీవన ఔన్నత్యానికి నిదర్శనమని అన్నారు. ప్రజల్లో సహోదరభావాన్ని పెంపొందించే ఈ పండుగను నియోజకవర్గ ప్రజలంతా ఆనందోత్సాహాల్లో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గౌతమ్ నగర్ కార్పొరేటర్ మేకల సునీతరాము యాదవ్, బీఆర్ఎస్ పార్టీ మహిళా నాయకులు శ్రీదేవి, సూలోచన, సరిత, శారద దేవి,తో పాటు పార్టీ కార్యకర్తలు, మహిళలు అభిమానులు పాల్గొన్నారు.

## కేజీబీవీ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దాలి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

**మెదక్ జిల్లా ప్రతినిధి ( సాక్ష్యం న్యూస్) 9 ఆగస్టు** టేక్మాల్ మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల నమ్మకాన్ని పెంపొందించాలని , కేజీబీవీ విద్యార్థుల ఉత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం టేక్మాల్ మండలంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన నిర్వహించారు. ముందుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్యులు, సిబ్బంది గురించి ఆరా తీసిన కలెక్టర్ అటెండెన్స్ రిజిస్టర్ తనిఖీ చేశారు. ప్రతి రోజు ఎంత మంది పేషంట్లు వస్తున్నారు, సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవాలు జరిగేలా కృషి చేయాలని వైద్యులకు సూచించారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించేలా అంకిత భావంతో పని చేయాలని హితవు పలికారు. అనంతరం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని పరిశీలించి తరగతి గదులు, స్టోర్ రూమ్, డార్మెట్రీ, వంటగదిని తనిఖీ చేశారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థినులు, ఉపాధ్యాయులతో కలెక్టర్ మాట్లాడారు. స్టోర్ రూమ్ లోని కూరగాయలు, నిత్యావసర వస్తువులను పరిశీలించారు. పాఠశాల ప్రాంగణం, పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థినుల అభ్యసన సామర్థ్యాలను మరింత మెరుగుపరచాలని అన్నారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాల్ పట్టణంలో రోడ్డు సమస్యలు పరిష్కరించాలి

- కోట్లు కేటాయించిన అభివృద్ధికి నోచని నారాయణఖేడ్ పట్టణం - రోడ్లతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నారాయణఖేడ్ ప్రజానీకం
- మున్సిపల్ పట్టణంలో సిపిఎం ఆధ్వర్యంలో పలు కాలనీలు సర్వే చేసి సువర్ణ థియేటర్ రోడ్డుపై నిరసన



**నారాయణఖేడ్ ఆగష్టు 09( సాక్ష్యం న్యూస్ )** ఈ సందర్భంగా సిపిఎం నారాయణఖే డివిజన్ కార్యదర్శి ఎన్ రమేష్ మాట్లాడుతూ మున్సిపల్ పట్టణంలో వివిధ కాలనీలో చిన్నపాటి వర్షానికి రోడ్డుపై వర్షపునీలు మురికి నీళ్లు వెళ్లడానికి దారి లేక రోడ్ల మీదనే నిలవడంతో వాహనాలు వెళ్తున్న క్రమంలో రోడ్డుపై ప్రజలు ఇతర పనుల కోసం పట్టణాల్లో నడుచుకుంటూ తిరుగుతున్న క్రమంలో మురికి నీళ్లు బురద జిత్తడం జరుగుతుంది దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు పాలు కాలలీలో గతంలో మోరీలు చిన్నగా కట్టడంతో కాలనీలు పెరిగిపోవడంతో వర్షం పడ్డ క్రమంలో నీళ్లు మోరి పైనుండి పారుతూ ఇండ్లలోకి మురికి నీళ్లు వెళ్లడంతో ఇబ్బందులు పడుతున్నారు 20 కోట్లు సాంక్షన్ అయిన మోరీలు రోడ్లు ఎందుకు వేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు అలాగే రాజీవ్ చౌకు మెయిన్ రోడ్డు కూడా మరమ్మతులు చేయించకుండా కంకర వేస్తున్నారు తప్ప పర్మినెంట్ సొల్యూషన్ పనులు చేయడం లేదు అలాగే సేవాలాల్ చౌక్ నుండి గాంధీ విగ్రహం వరకు బైపాస్ రోడ్డుకు నిధులు మంజూరైనై అని చెప్పి పనులు ప్రారంభించి కంకర వరకే పరిమితమైన రోడ్డు బైపాస్ అభివృద్ధి చెందుతుంది కానీ రోడ్డు సమస్య ఇప్పటివరకు పరిష్కారం చేయడంలో పాలకులు ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు ఇప్పటికైనా రోడ్లు మోరీలు బాగు చేయాలని లేనియెడల ప్రజల్ని ఐక్యం చేసి పోరాటాలు చేస్తామని అన్నారు. సిపిఎం నాయకులు కోటారి నర్సింలు గణపతి మైపాల్ విజయ్ రఘు ఉన్నారు.

### కార్పొరేటర్ శాంతి శేఖర్ దంపతులకు రాఖీ కట్టిన బ్రహ్మకుమారి సిస్టర్ సౌజన్య





**సికింద్రాబాద్, ఆగస్టు 9 (సాక్ష్యం)** ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వర్య విశ్వవిద్యాలయం తార్నాక బ్రాంచ్ ఇన్చార్జి సిస్టర్ సౌజన్య శనివారం రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ దంపతులకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ సుహాసిని తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా టిఆర్ఎస్ నాయకులు కట్ట బుచ్చన్న గౌడ్ కు కార్పొరేటర్ రాఖీ కట్టి రాఖీ శుభాకాంక్షలు తెలిపారు.

### కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డికి రాఖీ శుభాకాంక్షలు తెలిపిన పలువురు మహిళలు



**సికింద్రాబాద్, ఆగస్టు 9 (సాక్ష్యం)** మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి కి మల్లాపూర్ వార్డు కార్యాలయంలో పలువురు మహిళా నాయకులు, స్థానిక మహిళలు రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

### ఉప్పల్ మినీ శిల్పారామంలో

## ఆకట్టుకున్న వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు





**సికింద్రాబాద్, ఆగస్టు 9 (సాక్ష్యం)..** ఉప్పల్ మినీ శిల్పారామం లో రాఖి పౌర్ణిమ సందర్బంగా శనివారం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా జ్యోతిర్మయి , తెలంగాణ నాట్యమేళం కళాకారులూ చక్కని ప్రదర్శన ఇచ్చి సందర్శకులను మెప్పించారు. విగ్నేశ్వర వందనం, వందనం వందనం భారతావని, హర హర శంకర, స్వర నర్తనం, గురుబ్రహ్మ, కృష్ణయ్య గోపాల బాల, రామయ్య రామభద్రాయ. పుష్పాంజలి, అదిగో అల్లదిగో, రామ రామ, శివ పార్వతుల ఆనంద తాండవం అంశాలను జ్యోతిర్మయి గాయత్రీ, లాస్య, శివ, హాసిని, చందన, విలాసిని, చతుర్య, శ్రీకృతి, విద్య మొదలైన వారు ప్రదర్శించారు. విజయశ్రీ, రమేష్ చందర్, శ్రీధర్ రావు, గంజి కరుణాకర్ తదితరులు విచ్చేసి కళాకారులను అభినందించారు.


### తారా కళాశాల దాని అనుబంధ

## కళాశాలలో దోస్త్ అడ్మిషన్లకు చివరి అవకాశం




**సాక్ష్యం న్యూస్ సదాశివపేట** సంగారెడ్డి జిల్లాతారా ప్రభుత్వ కళాశాల సంగారెడ్డి మరియు దాని అనుబంధములోని జోగిపేట్, నారాయణ కేడ్ ,జహీరాబాద్, సదాశివపేట, పటాన్ చెరువు మరియు సంగారెడ్డి మహిళా కళాశాలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చివరి దశ దోస్తు అడ్మిషన్లలో అలర్ట్ అయినటువంటి అభ్యర్థులకు ఆయా కళాశాలలో అడ్మిషన్లు పొందడానికి ఈనెల 12బి 8బి 2025 నాటికి తేదీని పొడిగించడం జరిగిందని, స్పెషల్ ఫేస్ ద్వారా అలాటైనా అయిన విద్యార్థులు ఆయా కళాశాలలో టి.సి. ఒరిజినల్ తో పాటు ఇతర జిరాక్స్ కాపీలు, ఒక ఫోటోతో అడ్మిషన్ పొందవచ్చునని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రమేష్ తెలిపినారు. ప్రభుత్వ కళాశాలలో దోస్తు ద్వారా అడ్మిషన్లు పొందుటకు ఇదే చివరి అవకాశం అని, దోస్త్ స్పెషల్ ఫేస్ లో ఆయా కళాశాలలకు అలాటైనా విద్యార్థులు ఈ నెల 12వ తేదీ లోపు ఆయా కళాశాలలో అడ్మిషన్లు పొందాలని తెలిపినారు. ప్రభుత్వ కళాశాలలో దోస్తు ద్వారా అడ్మిషన్ను పొందుటకు ఇదే చివరి అవకాశమని, దోస్త్ చివరి ఫేసులో ఆయా కళాశాలలకు అలాటైన విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలిపినారు. ఏవైనా సందేహాలు ఉంటే 9441 0690 20 నంబర్ను సంప్రదించాలని కోరినారు.

### ఎమ్మెల్సీ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో సీఎంఆర్ రిలీఫ్ ఫండ్స్ విడుదల



**మిర్యాలగూడ రూరల్ ఆగస్ట్ 9(సాక్ష్యం న్యూస్)** మిర్యాలగూడ విద్యానగర్ కాలనీలో గౌరవ ఎమ్మెల్సీ శ్రీ కేతావత్ శంకర్ నాయక్ స్వగృహం యందు ప్రజా పాలనలో భాగంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిర్యాలగూడ నియోజకవర్గం వ్యాప్తంగా మండలాల 9 మందికి 7 లక్షల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను. లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలకు సంబంధించిన అధ్యక్షులు కాకునూరి బసవయ్య గౌడ్, మాలి కాంతరెడ్డి, జిల్లా కాంగ్రెస్ కిసాన్ జిల్లా అధ్యక్షులు ముదిరెడ్డి నర్సిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తలకొప్పుల సైదులు,కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహబూబ్ అలీ, బక్కరెడ్డి, చలపతిరావు, కోటేశ్వరరావు శ్రీనివాస్, లక్ష్మణ్ గౌడ్, జవహర్, నెహ్రు,నాగరాజ్, హరీష్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పండగ పూట బస్సు చార్జీలు పెంపు



**మిర్యాలగూడ రూరల్ ఆగస్ట్ 9(సాక్ష్యం న్యూస్ )** నల్గొండ జిల్ల మిర్యాలగూడ తెలంగాణ రాష్ట్ర రోడ్ ట్రాన్స్పోర్ట్ సంస్థ (టీ ఎస్ ర్ టీ సి) రాఖీ పండుగ కారణంగా దూరప్రాంతాలకు వెళ్లే జనాలు రాద్దిగా ఉండటం వల్ల ఒక్కసారిగా టికెట్ ధర 30 శాతం నుండి 40శాతం రేట్లు పెంచారు రాఖీ పండుగ సందర్భంగా బస్సు ఛార్జీలు పెంచి రాఖీ పండుగ బహుమతి ఇచ్చిన టి ఎస్ ర్ ట్ సి రాష్ట్రవ్యాప్తంగా 30%-%40 శాతం బస్సు ఛార్జీలను పెంపు నల్గొండ టు మిర్యాలగూడ మామూలు సమయంలో బస్సు ఛార్జీ కి. రాఖీ పండుగ సందర్భంగా ఛార్జి కి చాలవరకు తేడావుందీ రోజు తిరిగే ఆర్డినరి బస్సులకు స్పెషల్ బోర్డు ఎక్స్ప్రెస్ టికెట్ ఇస్తున్నారని ప్రయాణికులు వా పోతున్నారు పండగ టైములో ఆర్డినరీ బస్సుల సంఖ్య పెంచాల్సి పోయి ఆర్డినరీ బస్సులను ఎక్స్ప్రెస్ బస్సులుగా చేయట%శీ% పై ప్రయాణికుల జేబుకు చిల్లు పడింది సౌకర్యాలు కలిపించాల్సి పోయి బస్సు చార్జీలు పెంచినందుకు కొందరు ప్రజలు అసంతృప్తి వెక్తం చేస్తునారు.



## విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడవద్దు

బిజెపి అసెంబ్లీ కన్వీనర్ కనగాల నారాయణ



కోదాడ ఆగస్టు 9 (సాక్ష్యం) వ్యక్తిగత కక్షలు తీర్చుకోవడం కోసం కళాశాలపై నిరాధార ఆరోపణలు చేస్తూ కళాశాలలో చదివే విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడవద్దని బిజెపి అసెంబ్లీ కన్వీనర్ కనగాల నారాయణ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ గత ఒకటి రెండు సంవత్సరాలుగా స్థానిక కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యంపై కొద్దిమంది అవినీతి ఆరోపణలను తరచుగా చేస్తున్నారు, కానీ దానిని రుజువు చేయుటకు అవకాశాలు వచ్చినా వాటిని వినియోగించుకోకుండా మరలా మరలా ఆరోపణలు చేయడం వలన కోదాడ పరిసర ప్రాంతాలలోని బాలికల విద్యా వికాసానికి, అభివృద్ధికి అవరోధంగా ఈ ఆరోపణలు నిలుస్తాయని భావిస్తున్నాము. కళాశాల చైర్మన్ నీలా సత్యనారాయణ గత రెండు రోజులుగా కుటుంబ సమేతంగా ఈ ఆరోపణలకు సమాధానం చెప్పుటకు , అపోహలను నివృత్తి చేయుటకు తన సమయాన్ని కేటాయిస్తూ ఒక ప్రదేశంలో నిరీక్షించడం అనేది సమస్య కు పరిష్కార మార్గాన్ని సూచిస్తున్నది. ఆరోపణలు చేస్తున్నవారు వారు అట్టి అవకాశాన్ని వినియోగించుకోకపోవడాన్నీ ఎలా అర్థం చేసుకోవాలో తెలియడం లేదన్నారు. ఏ దురుద్దేశం లేకపోతే ఆ సమయంలో మధ్యవర్తులను తీసుకొని వెళ్లి ఆరోపణల లోని నిజాయితీని నిరూపించు కున్నట్లయితే బాగుండేదన్నారు. దయచేసి ఇప్పటినుంచైనా ఆ కళాశాలపై అసంబద్ధమైనటువంటి ఆరోపణలను బహిరంగంగా చేసి తద్వారా ఈ ప్రాంతంలోని బడుగు బలహీన వర్గాల బాలికల ఉన్నత విద్యకు భంగం కలగకుండా ఉండేందుకుగాను వారు ప్రయత్నిస్తారని, ప్రయత్నించాలని కోరుకుంటున్నాను అన్నారు.

## పుట్టినరోజును అనాధాశ్రమంలో జరుపుకోవడం అభినందనీయం

ఎంఎస్ విద్యాసంస్థల చైర్మన్ పందిరి నాగిరెడ్డి



కోదాడ ఆగస్టు 9 (సాక్ష్యం) మండలంలోని ముకుందా పురం వాస్తవ్యులు చిరందాస్ ఉపేంద్రచారి మంజుల దంపతుల కుమార్తె నిర్మల జన్మ దిన సందర్భంగా శనివారం నాడు ఇందిరా అనాధ వృద్ధాశ్రమంలో అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేయడం అభినందనీయం అని కోదాడ ఎమ్మెస్ విద్యాసంస్థల చైర్మన్ పందిరి నాగిరెడ్డి, సీఈఓ ఎస్ఎస్ రావులు అన్నారు. వృద్ధులకు స్వీట్లు పండ్లు పంపిణీ చేశారు. నిర్మలకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు నర్రా సత్యనారాయణ రెడ్డి,నర్రా ఇంద్ర శేఖర్ రెడ్డి, సరికొండ నాగరాజు, ఉపేందర్, పనస నాగేశ్వరరావు, రవి లక్ష్మయ్య, ఆశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలను తోబుట్టువులుగా భావించాలి

చెట్లకు రాఖీలు కట్టిన మున్సిపల్ కమిషనర్ రమాదేవి



కోదాడ ఆగస్టు 9 (సాక్ష్యం)మొక్కలను తోబుట్టువులుగా భావించి ప్రతి ఒక్కరూ చెట్లను నాటి వాటిని సంరక్షించుకోవాలని కోదాడ మున్సిపల్ కమిషనర్ రమాదేవి అన్నారు. రాఖీ పండుగ సందర్భంగా శనివారం విజయీభవ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ పార్క్ ఆవరణలో వృక్ష బంధన్ కార్యక్రమంలో భాగంగా మొక్కలకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతిలోని చరాచర జీవులు సుభిక్షంగా ఉండాలంటే మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. విజయీ భవ ట్రస్ట్ చేస్తున్న సామాజిక సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షులు చారుగాండ్ల ప్రవీణ రాజశేఖర్, ఓరుగంటి ప్రభాకర్, వెంపటి వెంకటరమణ, పత్తి నరేందర్, వెంపటి ప్రసాద్, గుడుగుంట్ల సాయి తదితరులు పాల్గొన్నారు.

## 65వ యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



మిర్యాలగూడ రూరల్ ఆగస్ట్ 9(సాక్ష్యం న్యూస్) నల్గొండ జిల్లా మిర్యాలగూడ లో ఈరోజు 65వ యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా,మిర్యాలగూడ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ అజారుద్దీన్ గారి ఆధ్వర్యంలో రాజీవ్ భవన్ నుండి రౌండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథులుగా పీసీసీ డెలికేట్ చిరుమర్తి కృష్ణయ్య గారు,పట్టణ అధ్యక్షుడు నూకల వేణు గోపాల్ రెడ్డి గారు, డీసీసీ జనరల్ సెక్రటరీ చిలుకూరి బాలు గారు,యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రూపవత్ హరిప్రసాద్ గారు పాల్గొన్నారు. యువజన కాంగ్రెస్ జెండా ను అధ్యక్షుడు షేక్ అజారుద్దీన్ ఎగురవేసి అనంతరం కేక్ కట్ చేసి యువజన నాయకులు మరియు యువజన కాంగ్రెస్ కార్యకర్తలకు ఆవిర్భావ దినోత్సవం శుభాకాంక్షలు తెలపడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ కార్యదర్శి నాగునాయక్,పట్టణ అధ్యక్షులు ఫ ర్వేజ్, అనిఫ్, వినయ్ం, సురేష్, అమర్, వంశీ, భాస్కర్,సందీప్,ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నాచెల్లెళ్ల అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతిక రక్షాబంధన్: బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్



మిర్యాలగూడ రూరల్ ఆగస్ట్ 9(సాక్ష్యం న్యూస్) ప్రతి ఒక్కరూ సమాజంలో బాలికలు మహిళల పట్ల సోదర భావంతో ఉండాలన్నారు బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షులు బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ మాట్లాడుతూ స్థానిక పట్టణంలోని షాబునగర్ తన నివాసంలో తన అక్క చెల్లెమ్మలతోటి రక్షాబంధన్ సందర్భంగా రాఖీ కట్టించుకోవడం జరిగిందన్నారు ఈ సందర్భంగా బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ మాట్లాడుతూ రక్షాబంధన్ సందర్భంగా ప్రతి ఒక్కరూ సమాజంలో బాలికలు మహిళల పట్ల సోదర భావంతో ఉండాలన్నారు సోదరా సోదరీమణులు ఒకరికొకరు అండగా ఆప్యాయతలు నిండుగా చేసుకునే పండుగ రాఖీ పౌర్ణమి అని అన్నారు తన సోదరుడు గొప్పగా ఉండాలని తమకు అండగా ఉండాలని ఆకాంక్షిస్తూ తన సోదరి కట్టే రక్ష ఈ రాఖీ సమాజంలో ప్రతి ఒక్కరు కట్టే రక్ష ఈ రాఖీ సమాజంలో ప్రతి ఒక్కరు బాలికలు మహిళలు పట్ల సోదర భావంతో కలిసి మెలిసి ఉండాలి అన్నారు ఈ కార్యక్రమంలో మల్లె బోయిన లక్ష్మి దోనేటి మణి,నక్క నాగ లక్ష్మి

### నులిపురుగుల నిర్మూలన

## దినోత్సవాన్ని జయప్రదం చేయండి



వైద్యాధికారి డాక్టర్ పుష్పలత

కోదాడ ఆగస్టు 9 (సాక్ష్యం) ఈ నెల 11న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అనంతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ పుష్పలత అన్నారు. అనంతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో గల ఒక సంవత్సరం నుండి 19 సంవత్సరాల వయస్సు గల 3568 మంది పిల్లలకు ఈ మాత్రలు వేయనన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య , మరియు ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు కలిసి సమన్వయంతో పని చేయాలన్నారు.

## కామాటీ సైదమ్మ మృతి పట్ల సంతాపం



కోదాడ ఆగస్టు 9 (సాక్ష్యం) కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని 18 వార్డ్ లో కామాటి గా పనిచేస్తున్న ముప్పాళ్ళ సైదమ్మ అనారోగ్యంతో మృతి చెందిన్నారు.. బాలాజీ నగర్ లోని స్వగృహంలో సైదమ్మ మృతదేహాన్ని మున్సిపల్ కమిషనర్ రమాదేవి, శానిటరీ ఇన్స్పెక్టర్ సురేష్ కుమార్, 18 వార్డ్ మాజీ కౌన్సిలర్ కర్రి శివ సుబ్బారావు శనివారం సందర్శించి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

## ఘనంగా రక్షాబంధన్

– ఇద్దరి తమ్ముళ్లకు రాఖీ కడుతున్న అక్క



కోదాడ ఆగస్టు 9 (సాక్ష్యం) అన్న చెల్లెల అక్క తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక గా నిలిచే రాఖీ పండుగను అనంతగిరి మండల వ్యాప్తంగా శనివారం ఘనంగా జరుపుకున్నారు. సుదూర ప్రాంతాల నుండి తమ తోబుట్టువుకు రాఖీలు కట్టేందుకు ఆడపడుచులు రావడంతో పల్లెలు పండుగ వాతావరణం సంతరించు కున్నాయి. అదేవిధంగా ఉదయం నుంచి మండలంలోని పలు ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశ సంప్రదాయానికి ఐక్యమత్యానికి అన్నాచెల్లెళ్ల అనుబంధానికి రాఖీ ప్రత్యేకంగా నిలుస్తుందని నాయకులు అన్నారు.

## నేలపట్ల గ్రామంలో ఘనంగా భద్రావతి

అమ్మవారికి బోనాలు సమర్పించిన మహిళలు



చౌటుప్పల్ ఆగస్టు 09 (సాక్ష్యం) చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామంలో శ్రీశ్రీశ్రీ భద్రావతి అమ్మవారికి పద్మశాలి కులస్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. అనంతరం మహిళా బోనాలు ఎత్తుకొని డప్పుల వాయిద్యాలతో గ్రామ పురవీధులలో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఎంపీటీసీ తడక పారిజాత మోహన్, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనం సమర్పించారు.

### రైతుభీమకి దారఖాస్తు

## మిర్యాలగూడ వ్యవసాయ విస్తరణ అధికారి

మిర్యాలగూడ రూరల్ ఆగస్ట్ 9(సాక్ష్యం న్యూస్) నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణనం లోని రైతు వేదిక దగ్గర రైతు బీమా కు దరఖాస్తూ చేసుకోగలరు దరఖాస్తు స్వికర్ణ చివరి తేది 13-08-2025 మిర్యాలగూడ రైతువేదిక వద్ద వచ్చి సోమవారం దరఖాస్తు చేసుకోవచ్చు, రైతు స్వయంగా వచ్చి దారాఖాస్తు ఇవ్వాలి రైతు తీసుకరావలిసిన కాగితలు మీ యొక్క ఆధార్ కార్డు, పట్టాదారు పాసుబుక్ ,మరియు నామినీ ఆధార్ కార్డు, అప్లికేషన్ ఫారం తీసుకొని మండల వ్యవసాయ ఆఫీస్ దగ్గరికి వచ్చి నమోదు చేసుకోగలరు వ్యవసాయ విస్తరణ అధికారి సెల్ నెంబర్ 8977765670 ఇట్టి అవకాశన్ని రైతులందరు ఉపయోగించుకోగలరని వ్యవసాయ విస్తరణ అధికారి తెలిపారు.

### పలు వివాహ వేడుకల్లో పాల్గొని నూతన

## వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే





మిర్యాలగూడ రూరల్ ఆగస్ట్ 9(సాక్ష్యం న్యూస్) నల్గొండ జిల్లా దామరచర్ల మండల కేంద్రం నందు పలు వివాహ వేడుకల్లో పాల్గొనీ నూతన వధూవరుల ను ఆశీర్వదించి నియోజకవర్గ ప్రజల ఆడబిడలకు రాఖీ శుభాకాంక్షలు తెలియజేసిన మిర్యాలగూడ నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు నల్లమోతు భాస్కర్ రావు మరియు తిప్పన విజయ సింహారెడ్డి గారు మరియు దామరచర్ల మండల బీ.ఆర్.ఎస్ పార్టీనాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీశ్రీశ్రీ మద్దెలమ్మ అమ్మవారి బోనాల మహోత్సవం





చౌటుప్పల్ ఆగస్టు 09 (సాక్ష్యం) చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ మద్దెలమ్మ అమ్మవారి దేవాలయంలో 9వ వార్షిక బోనాల మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలి కులస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు బోనాలు ఎత్తుకొని డప్పు చప్పులతో స్థానిక శివ భక్త మార్కండేయ దేవస్థానం నుండి చౌటుప్పల్ పురవీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి బొడ్రాయి చుట్టూ ప్రదక్షణ చేసి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులకు కావలసిన సౌకర్యాలను దేవస్థానం వ్యవస్థాపక అధ్యక్షులు గోశిక స్వామి, దేవస్థానం అధ్యక్షులు గుర్రం నరసింహ సమకూర్చారు. ఈ సందర్భంగా దేవస్థానంలో లలితా సహస్రనామ పారాయణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం. జోగిని సుధాకర్ స్వామి (భవిష్యవాణి) చెప్పడం జరిగింది. తదానంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన కార్యదర్శి గోశిక అంజయ్య, కోశాధికారి పిల్లలమర్రి యాదగిరి, ఉపాధ్యక్షులు వనం రాజు, చిక్క నరహరి, సహాయ కార్యదర్శి. కందగట్ల ఆనంద్, రవికుమార్, సభ్యులు. గోషిక భాస్కర్, కర్నాటి శ్రీనివాసులు, కడవేరు శంకర్, రుద్ర యాదగిరి, మహిళా సభ్యులు. కోడి వనిత , వనం జయశ్రీ , గడ్డం పద్మశ్రీ దేవి, బడుగు పావని, గౌరవ సలహాదారులు. బడుగు శ్రీరాములు, గోశిక అంజయ్య, గోశిక రవి, అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో తీజ్ పండుగ

ఎమ్మెల్యే పద్మావతి సహాయ సహకారాల పట్ల హర్షం

గ్రామ శాఖ అధ్యక్షుడు వీరు నాయక్







కోదాడ ఆగస్టు 9 (సాక్ష్యం) కోదాడ మండల పరిధిలోని మంగళ్ తండా గ్రామంలో శనివారం భక్తిశ్రద్ధలతో తీజ్ పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు వీరు గ్రామస్తులతో కలిసి గ్రామంలోని ఆయా కూటలలో ఏర్పాటుచేసిన తీజ్ పండుగ ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. భక్తి శ్రద్ధలతో గ్రామంలోని మహిళలు గత తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్నారని తెలిపారు. గిరిజనలు సాంప్రదాయం ప్రకారం నిర్వహించే పండుగ అని తెలిపారు. మొలకలను తీసుకొని ఇంటి వద్దకు తీసుకువెళ్లి దేవత విగ్రహాల వద్ద ఉంచడం వలన వ్యవసాయం ఆర్థిక అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. దీంతో ఆయ కోడళ్ళలో మొలకలను ఏర్పాటు చేసుకొని మహిళలు నృత్యాలు చేయడం గ్రామంలో పండుగ వాతావరణం నెలకొన్నది. ఎమ్మెల్యే పద్మావతి సహాయ సహకారాల పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శీను పంతుల్య, వాసు, శ్రీను, నాగ్య, రూప్ల, ధర్మ వెంకన్న, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఈదుల వాగు బ్రిడ్జి నిర్మాణాన్ని తక్షణమే పూర్తిచేయాలి

– సిపిఎం యాదాద్రి జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్





చౌటుప్పల్ ఆగస్టు 09 (సాక్ష్యం ) చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామంలో సిపిఎం యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేలపట్ల – వర్కట్ పల్లి గ్రామాల మధ్యలో ఉన్న ఈదుల వాగు ను శనివారం పార్టీ శ్రేణులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈదుల వాగు బ్రిడ్జి నిర్మాణం లేకపోవడంతో ప్రజలు అనేక ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు రోజుల క్రితం కురిసిన అకాల వర్షం లో వాగు దాటే క్రమంలో కారు కొట్టుకుపోయిన సంగతిని గుర్తు చేశారు. ముఖ్యంగా పాఠశాలకు వెళ్లే విద్యార్థులే కాక, రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలకు బ్రిడ్జి లేకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే ఈదుల వాగుపై బ్రిడ్జి ని నిర్మిస్తే రైతులకు, విద్యార్థులకు,ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు పడకుండా ఉండడమే కాకుండా, ప్రమాదాలు అరికట్టవచ్చని పేర్కొన్నారు. ఇప్పటికైనా స్థానిక శాసనసభ్యులు తక్షణమే స్పందించి ఈదుల వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. లేనియెడల ఆ గ్రామాల ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బూర్గు కృష్ణారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు గంగాదేవి సైదులు, రాగిరి కిష్టయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్యులు తడక మోహన్, మండల కమిటీ సభ్యులు యనమల సంజీవ, దబాటి బక్కయ్య, మాజీ ఎంపీటీసీ బత్తుల శంకర్, సీనియర్ నాయకులు బుట్టి కృష్ణ,గుర్రం కృష్ణ, బత్తుల వేణు, ఇట్టగోని మల్లేశం, భాను, యనమల్ల నవీన్, తదితర నాయకులు పాల్గొన్నారు.




# ఆంధ్ర ప్రీమియర్ లీగ్ కు అత్యంత ప్రాధాన్యత!

ప్రతిష్టాత్మక ఆంధ్ర ప్రీమియర్ లీగ్ శుక్రవారం నుంచి ప్రారంభమైంది. ఇది నాలుగో సీజన్ కావడం విశేషం. భాతర క్రికెటర్లు నితీశ్ కుమార్ రెడ్డి, హనుమ విహారి, కేఎస్ భరత్, ఐపీఎల్ స్టార్ షేక్ రషీద్ వంటి ఆటగాళ్లు పాల్గొంటుండటంతో ఈసారి లీగ్ పై అందరి ఫోకస్ నెలకొంది. డిఫెండింగ్ చాంపియన్ గా వైజాగ్ వారియర్స్ డిఫెండింగ్ చాంపియన్ గా బరిలోకి దిగుతోంది. గతేడాది జరిగిన ఫైనల్లో ఉత్తరాంధ్ర లయన్స్ పై 87 పరుగులతో విజయం సాధించి, వారియర్స్ కప్పును ఎగురేసుకుపోయింది. ఈసారి లీగ్ లో చాలా మార్పులు జరిగాయి. మొత్తం ఏడు జట్లు ఈ టోర్నీలో తమ లక్కును పరీక్షించుకుంటున్నాయి. అవి, రాయల్స్ ఆఫ్ రాయలసీమ, తుంగభద్ర వారియర్స్, విజయవాడ సన్ షైనర్స్, కాకినాడ కింగ్స్, భీమవరం బుల్స్, అమరావతి రాయల్స్, సింహాంద్రి వైజాగ్ లయన్స్. ఈ టోర్నీలో మొత్తం 25 మ్యాచులు జరుగనున్నాయి. ఒక్కో జట్టు మరో టీమ్ తో ఏడేసి మ్యాచ్ లు ఆడనుంది. ఆగస్టు 8 నుంచి 25 వరకు మొత్తం 17 రోజుల పాటు ఈ టోర్నీ జరుగుతుంది. 21 నుంచి ప్లే ఆఫ్స్ జరుగుతుండగా, 25న మెగా ఫైనల్ జరుగుతుంది. మ్యాచ్ లన్నీ విశాఖపట్నంలోని డా. వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ- వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో నిర్వహిస్తారు. టోర్నీ తొలి పోరు కాకినాడ కింగ్స్, అమరావతి రాయల్స్ మధ్య ప్రారంభమైంది. భీమవరం బుల్స్ జట్టుకు నితీశ్ నాయకత్వం వహిస్తున్నాడు. అయితే మోకాలి గాయం కారణంగా తను ఈ టోర్నీలో ఆడేది అనుమానంగా మారింది. తొలి మ్యాచ్ సా.7.30 నుంచి ప్రారంభం కానుండగా, మిగతా సాయింత్రం మ్యాచ్ లన్నీ సా.6.30కే మొదలవుతాయి. మధ్యాహ్నం మ్యాచ్ లు మాత్రం మ.1 .30 గంటలకు ప్రారంభమవుతాయి. ఆంధ్ర ప్రీమియర్ లీగ్ నాలుగో ఎడిషన్ అటు టీవీల్లోనూ, ఇటు డిజిటల్ గానూ చూసే చాన్స్ ఉంది. టీవీల్లో సోనీ స్పోర్ట్స్ 5 ఎస్డీ, హెచ్డీ, సోనీ స్పోర్ట్స్ 4 చానెళ్లలో ప్రత్యక్ష ప్రసారం కానుంది. ఇక డిజిటల్ గా ఫ్యాన్ కోడ్ యాప్ తోపాటు వెబ్ సైట్ లోనూ ఈ టోర్నీని చూడవచ్చు. తమ తమ వీలుని బట్టి, క్రికెట్ ప్రేమికులు ఈ టోర్నీని వీక్షించ వచ్చని నిర్వాహకులు తెలిపారు. ఏదేమైనా తెలుగు ప్లేయర్లతో నిర్వహించే ఈ టోర్నీ ద్వారా మరింత మంది లోకల్ ప్లేయర్లు వెలుగులోకి రావాలని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక ఇప్పటిదాక మూడు ఎడిషన్లను ఆదరించినట్లుగానే ఈ ఎడిషన్ ను ఆదరించాలని నిర్వాహకులు కోరుకుంటున్నారు. టీ 20 ఫార్మాట్ లో జరిగే ఈ టోర్నీ ద్వారా ధనాధన్ ఆటతీరు ప్రదర్శించే యువ ప్లేయర్లు వెలుగులోకి వస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# గిల్ కొన్నిసార్లు అగ్రెసివ్ అయ్యాడు

- ఇంగ్లాండ్ సిరీస్‌లో గీత దాటాడు
- టీమ్ఇండియా మాజీ క్రికెటర్ దినేశ్ కార్తిక్

రోహిత్ శర్మ టెస్టుల నుంచి రిటైరైన తర్వాత టీమ్ఇండియా మేనేజ్‌మెంట్ 25ఏళ్ల యంగ్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్‌కు కెప్టెన్సీ పగ్గాలు అందించింది. అతడి నాయకత్వంలో ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లిన భారత్ అద్భుతమైన ఆటతీరుతో ఆకట్టుకుంది. ఐదు మ్యాచ్‌ల చెస్టు సిరీస్‌ను 2-2తో సమం చేసుకొని పర్యటనను ఘనంగా ముగించుకుంది. ఈ పర్యటనలో గిల్ బ్యాటింగ్‌తోపాటు కెప్టెన్సీలోనూ ఆకట్టుకున్నాడు. సంప్రదాయ టెస్టు ఫార్మాట్‌లో జట్టును అగ్రెసివ్ గా ముందుకు నడిపించాడు. పలుమార్లు తనను రెచ్చగొట్టిన ప్రత్యర్థులకు అదే రీతిలో జవాబిస్తూ, తాను ఏం తక్కువ కాదని గట్టి రిప్లై ఇచ్చాడు. అలాగే కీలక ఆటగాళ్లు గాయాల పాలైనా, అందుబాటులో ఉన్న ప్లేయర్లతో జట్టను సమర్థంగా నడింపిచి కెప్టెన్సీలోనూ మాజీల ప్రశంసలు అందుకున్నాడు. ఈ సిరీస్‌లో కామెంటేటర్‌గా వ్యవహరించిన టీమ్ఇండియా మాజీ క్రికెటర్ దినేశ్ కార్తిక్ కూడా శుభ్‌మన్ కెప్టెన్సీని మెచ్చుకున్నాడు. కానీ, కొన్నిసార్లు గిల్ తన దూకుడుతో గీత దాటాడని అన్నాడు. "గిల్ కొన్నిసార్లు అగ్రెసివ్ అయ్యాడు. అప్పుడప్పుడు అతడు హద్దు మీరాడు కూడా. అయితే ఈ విధానాన్ని గిల్ కొంతవరకు మార్చుకుంటాడేమో. కానీ, పూర్తిగా మారడు. ముఖ్యంగా కెప్టెన్‌గా గిల్ ఇంగ్లీష్ మీడియాను హ్యాడింల్ చేసిన విధానం అద్భుతం. చాలా బాగా మాట్లాడాడు" అని కార్తిక్ అన్నాడు. అలాగే ఈ సిరీస్‌కు వచ్చేనాటికి గిల్ టెస్టు యావరేజ్ 30ల్లోనే ఉంది. దీంతో జట్టులో అతడి స్థానంపైనా విమర్శలు వచ్చాయి. కానీ ఇంగ్లాండ్ పర్యటనలో శుభ్‌మన్ గిల్ టాప్ స్కోరర్‌గా నిలిచాడు. 10 ఇన్నింగ్స్‌ల్లో 75.40 యావరేజ్‌తో 754 పరుగులు చేసి ఔరా అనిపించాడు.

అయితే ఈ పర్యటనకు అతడు బాగా ప్రిపేరయ్యే వచ్చాడని కార్తిక్ అన్నాడు. "ఈ సిరీస్ ప్రారంభం కాకముందు, ప్రెస్‌మీట్‌లో గిల్ చెప్పిన మాట గుర్తుందా? ఈ సిరీస్‌లో ఇరుజట్లలో తానే టాప్ స్కోరర్‌గా ఉండాలని ఆశించాడు. అంటే ఎంత కాన్ఫిడెంట్ ఉండాలి అలా చెప్పడానికి. అందుకే ఈ సిరీస్‌కు అకడు ముందే బాగా ప్రిపేరై వచ్చాడు. తన బ్యాటింగ్ స్కిల్స్ మెరుగుపర్చుకున్నాడు. తనకు ఎదురుగా వచ్చే బంతికి ఎలా కౌంటర్ ఇవ్వాలో నేర్చుకున్నాడు" అని కార్తిక్ వ్యాఖ్యానించాడు. ఈ పర్యటనలో ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగిన టెస్టులో గిల్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ అత్యుత్తమంగా బ్యాటింగ్ చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఏకంగా డబుల్ సెంచరీ (269 పరుగులు) భారీ ఇన్నింగ్స్‌తో జట్టుకు మంచి



స్కోర్ అందించాడు. అలాగే రెండో ఇన్నింగ్స్ లోనూ సెంచరీ (161 పరుగులు) చేసి రాణించాడు. ఈ మ్యాచ్‌లో గిల్ ఇన్నింగ్స్‌కు డీకే ఫిదా అయ్యాడట. పరుగులు చేయాలన్న ఆకలి, దృఢ సంకల్పం గిల్‌లో ఉన్నట్లు దినేశ్‌కు కనిపించాయట. కాగా, ఈ టెస్టులో భారత్ 336 పరుగుల భారీ తేడాతో నెగ్గింది. 2025-27 వరల్డ్‌టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో భారత్ ప్రస్తుతం 28 పాయింట్లు, 46.67 పాయింట్ పర్సెంటేజీతో మూడో స్థానంలో ఉంది. ప్రస్తుత సైకిల్‌లో భారత్ ఇప్పటివరకు 5 మ్యాచ్‌లు ఆడగా అందులో 2 విజయాలు, 2 ఓటములు ఉన్నాయి. మరో టెస్టు డ్రా చేసుకుంది. 100 శాతం పర్సెంటేజీతో ఆస్ట్రేలియా టాప్‌లో ఉండగా, శ్రీలంక 66.66 పాయింట్ పర్సెంటేజీతో రెండో ప్లేస్‌లో కొనసాగుతోంది.

# సాయి సుదర్శన్‌పై అభిమన్యు తండ్రి తీవ్ర విమర్శలు

గత నాలుగేళ్లుగా భారత టెస్టు జట్టులో ఉన్నప్పటికీ ఒక్క మ్యాచ్‌లో కూడా ఆడే అవకాశం లభించకపోవడంపై బెంగాల్ క్రికెటర్ అభిమన్యు ఈశ్వరన్ తండ్రి రంగనాథన్ ఈశ్వరన్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ముగిసిన ఇంగ్లండ్ టెస్ట్ సిరీస్‌లో జట్టులో చోటు దొరికినప్పటికీ తుది జట్టులో అవకాశం దక్కలేదు. అయితే సాయి సుదర్శన్‌కు అవకాశం కల్పించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేయడం క్రికెట్ వర్గాల్లో సంచలనం సృష్టిస్తోంది. రంగనాథన్ ఈశ్వరన్ ఒక యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో టీమ్ సెలక్షన్ విధానాన్ని ప్రశ్నిస్తూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రంగనాథన్ ఈశ్వరన్ తన ఇంటర్వ్యూలో సాయి సుదర్శన్ ప్రదర్శనను గణాంకాలతో సహా విమర్శించారు. ఆయన మాట్లాడుతూ.. "మూడో స్థానంలో నా కొడుకుకు ఆడించి ఉండవచ్చు. సాయి సుదర్శన్‌పై నాకు వ్యక్తిగతంగా ఎలాంటి కోపం లేదు. కానీ అతను సాధించిన పరుగులు ఎన్ని? 0, 31, 0, 61... ఈ స్కోర్లకు బదులుగా, నా కొడుకు అభిమన్యుకు అవకాశం ఇచ్చి ఉండవచ్చు" అని అభిమన్యు తండ్రి వ్యాఖ్యానించారు. అంతేకాకుండా తన కొడుకు అభిమన్యుకు ఉన్న అనుభవాన్ని ప్రస్తావించారు. "నా కొడుకు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వంటి ఫాస్ట్ బౌలింగ్‌కు అనుకూలించే పిచ్‌లపై 30% మ్యాచ్‌లు ఆడిన అనుభవం ఉంది. ఎక్కువసేపు క్రీజులో నిలిచి ఇన్నింగ్స్‌ను నిర్మించగల ఆటగాడు అభిమన్యు అని అతని దేశవాళీ రికార్డులే చెబుతాయి" అని ఆయన ఘాటుగా వివరించారు. సాయి సుదర్శన్‌తో పాటు జట్టులో ఆడిన కరుణ్ నాయర్ ఎంపికను కూడా రంగనాథన్ ఈశ్వరన్ ప్రశ్నించారు. "కరుణ్ నాయర్ దేశవాళీ క్రికెట్‌లో ఎప్పుడూ 4 లేదా 5వ స్థానంలో ఆడేవాడు. అలాంటి ఆటగాడిని అకస్మాత్తుగా మూడో స్థానంలో ఎలా ఆడించారు? 4, 5వ స్థానాల్లో ఆడే ఆటగాళ్లందరూ టాప్ ఆర్డర్ బ్యాటర్లుగా మారిపోతున్నారు. కానీ నా కొడుకు ఒక స్పెషలిస్ట్ టాపార్డర్ బ్యాట్స్‌మెన్. అతను ఓపెనర్‌గా మాత్రమే ఆడగలడు" అని టీమ్ మేనేజ్‌మెంట్ నిర్ణయాన్ని తప్పుపట్టారు. అయితే, భారత జట్టు కోచ్ గౌతమ్ గంభీర్ తన కొడుకుకు ఆశలు కల్పించినట్లు రంగనాథన్ ఈశ్వరన్ తెలిపారు. "గౌతమ్ గంభీర్ నా కొడుకుతో మాట్లాడుతూ, 'నువ్వు సరైన మార్గంలోనే ఉన్నావు. నీకు తప్పకుండా అవకాశం వస్తుంది. ఒకటి, రెండు మ్యాచ్‌లతోనే నేను నిన్ను జట్టు నుండి తొలగించే వ్యక్తిని కాదు. నీకు ఎక్కువ అవకాశాలు ఇస్తాను' అని హామీ ఇచ్చాడు" అని తెలిపారు. అభిమన్యు ఈశ్వరన్ దేశవాళీ క్రికెట్‌లో 103 మ్యాచ్‌లలో 48.70 సగటుతో 27 సెంచరీలు సహా మొత్తం 7841 పరుగులు సాధించాడు. తన కొడుకు 23 సంవత్సరాల కఠోర శ్రమకు తప్పకుండా ఫలితం లభిస్తుందని రంగనాథన్ ఈశ్వరన్ నమ్మకం వ్యక్తం చేశారు.

# ట్రావిస్ హెడ్ మా జట్టుకు ఓపెనర్‌గా ఉంటాడు

## ఆస్ట్రేలియా టీ20 కెప్టెన్ మిచెల్ మార్ష్

టీ20 ప్రపంచ కప్ 2026 ప్రారంభం కావడానికి సుమారు ఆరు నెలల సమయం ఉన్నప్పటికీ ఆస్ట్రేలియా జట్టు ఇప్పటి నుంచే తమ ప్రణాళికలను సిద్ధం చేసుకుంటోంది. ఈ క్రమంలో ఆస్ట్రేలియా టీ20 కెప్టెన్ మిచెల్ మార్ష్ ఒక కీలకమైన ప్రకటన చేశారు. రాబోయే టీ20 ప్రపంచ కప్‌లో ఆస్ట్రేలియా తరఫున ఓపెనర్‌గా ఎవరు బరిలోకి దిగుతారనే విషయాన్ని ఆయన స్పష్టం చేశారు. టీ20 ప్రపంచ కప్ 2024 తర్వాత డేవిడ్ వార్నర్ రిటైర్ కావడంతో అతని స్థానంలో ఓపెనింగ్ బ్యాటర్‌గా ఎవరు వస్తారని విషయంపై చాలా చర్చ జరిగింది. డేవిడ్ వార్నర్ స్థానంలో మాథ్యూ షార్ట్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, జేక్ ఫ్రేజర్



వంటి ఆటగాళ్లను ప్రయత్నించినా, ఎవరూ కూడా డేవిడ్ వార్నర్ స్థాయిలో ప్రభావం చూపలేకపోయారు. ఈ నేపథ్యంలో మిచెల్ మార్ష్ మీడియాతో మాట్లాడుతూ.. రాబోయే ప్రపంచ కప్‌లో ట్రావిస్ హెడ్ మా జట్టుకు ఓపెనర్‌గా ఉంటాడని స్పష్టం చేశారు. "మేమిద్దరం కలిసి చాలా మ్యాచ్‌లు ఆడాం, మా మధ్య మంచి అవగాహన ఉంది. కాబట్టి, మా ఓపెనింగ్ కాంబినేషన్ అతనితోనే మొదలవుతుంది" అని ఆయన తెలిపారు. మిచెల్ మార్ష్ ఇటీవల వెస్టిండీస్ జట్టుపై కేవలం 37 బంతుల్లోనే సెంచరీ సాధించిన టిమ్ డేవిడ్ గురించి కూడా మాట్లాడారు. "టిమ్ డేవిడ్ బ్యాటింగ్ గురించి మేము చర్చించుకున్నాం. వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లలో అతను రెగ్యులర్‌గా ముందే బ్యాటింగ్‌కు వచ్చాడు.

మిచెల్ మార్ష్ ఎంత ఎక్కువ బంతులు ఎదుర్కొంటే, అంత ఎక్కువ మ్యాచ్‌లలో మనల్ని గెలిపిస్తాడని ఆశిస్తున్నాను" అని మిచెల్ మార్ష్ పేర్కొన్నారు.

ఆస్ట్రేలియా జట్టు ఆగస్టు 10 నుండి దక్షిణాఫ్రికాతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్‌కు ఎంపిక చేసిన జట్టులో పలువురు కొత్త ఆటగాళ్లకు అవకాశం లభించింది.

**టీ20 సిరీస్‌కు ఆస్ట్రేలియా జట్టు:** మిచెల్ మార్ష్(కెప్టెన్), సీన్ అబాట్, టిమ్ డేవిడ్, బెన్ ద్వార్షియస్, నాథన్ ఎల్లిస్, కామెరూన్ గ్రీన్, జోష్ హాజెల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మాట్ కుహ్నేమాన్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, మిచెల్ ఓవెన్, మాథ్యూ షార్ట్, ఆడమ్ జంపా.

# ఐపీఎల్ గడప తొక్కాలని ఏపీఎల్ ప్లేయర్లు తహతహ

తెలుగు గడ్డపై టీ20 ఫీవర్ ప్రారంభమైంది. ప్రతిష్టాత్మక ఆంధ్ర ప్రీమియర్ లీగ్ నాలుగో ఎడిషన్ శుక్రవారం నుంచి ప్రారంభమైంది. అయితే ఈ సీజన్ పై క్రికెట్ ప్రేమికులే కాకుండా ఐపీఎల్ జట్ల స్కౌట్ల బాధ్యులు కూడా దృష్టి సారించారు. గత మూడు ఎడిషన్ల నుంచి



బాగా ఆడిన కొంతమంది క్రికెటర్లు ఇప్పటికే ఐపీఎల్ కు ఎంపికయ్యారు. గతేడాది వేలంలో సత్యనారాయణ రాజును ముంబై ఇండియన్స్ కొనుగోలు చేయగా, పైలా అవినాశ్ ను పంజాబ్ కింగ్స్ దక్కించుకుంది. దీంతో ఈసారి సీజన్ లోనూ సత్తా చాటి, ఐపీఎల్ గడప తొక్కాలని ఏపీఎల్ ప్లేయర్లు తహతహ లాడుతున్నారు. ఈసారి ఐపీఎల్ స్కౌట్ల బృందాలు గమనించే వారిలో కింది ముగ్గురు పేసర్లు ఉంటారు అనడంలో ఎలాంటి సందేహం లేదు. సత్తా చాటితే ఐపీఎల్ బెర్త్ దక్కించుకునే అవకాశముంది. భీమవరం బుల్స్ కు ప్రాతినిథ్యం వహించే హరి శంకర్ రెడ్డిపై చాలా ఎక్కువ ఫోకస్ ఉంది. రైట్ ఆర్మ్ పేసరైన ఈ ప్లేయర్ గత మూడు సీజన్ల నుంచి నిలకడగా రాణిస్తున్నాడు. ఇప్పటివరకు 17 గేమ్ లు ఆడిన ఈ ప్లేయర్.. 25 వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. అతని బౌలింగ్ స్ట్రైక్ రేట్ కేవలం 14.9 కావడం విశేషం. ఆరంభంలోనే వికెట్లు తీయగల సామర్థ్యం హరి సొంతం. యార్కర్లు, లెగ్ కట్టర్లు, బ్యాక్ ఆఫ్ హేండ్ బంతులతో బ్యాటర్లను ఇబ్బంది పెట్టగలడు. గతంలో 2021లో సీఎస్కే బృందంలో తను ఉన్నా, అంతగా అవకాశం రాలేదు. అయితే ఈసారి సత్తా చాటి మరోసారి ఐపీఎల్ గడప తొక్కాలని భావిస్తున్నాడు. సింహాద్రి వైజాగ్ లయన్స్ జట్టు తరఫున ప్రాతినిథ్యం వహించే యెద్దల రెడ్డి ఆకట్టుకుంటున్నాడు. గతేడాది సీజన్ లో తను సూపర్ గా రాణించాడు. ఐదు గేమ్ ల్లోనే 9 వికెట్లు తీశాడు తన స్ట్రైక్ రేట్ 10.2 కావడం విశేషం. ఆట వివిధ దశల్లో భాగస్వామ్యాలు ఏర్పడకుండా, వికెట్లను తీయడం అతని ప్రతిభకు నిదర్శనం. 26 ఏళ్ల ఈ పేసర్.. ఈ సీజన్ లో సత్తా చాటి ఐపీఎల్ కాంట్రాక్టు గెలుచుకోవాలని పట్టుదలగా ఉన్నాడు. అమరావతి రాయల్స్ తరఫున ఆడుతున్న గవ్వల మల్లికార్జున గత సీజన్ లో తన స్పిన్ మంత్రంతో ఆకట్టుకున్నాడు. 21 ఏళ్ల ఈ స్పిన్నర్ గత సీజన్ లో 8 వికెట్లు తీశాడు. అది కూడా 6.5 ఎకానమీ రేటుతో కావడం విశేషం. మిడిలోవర్లలో తన బౌలింగ్ లో బ్యాటర్లను చికాకు పెడుతూ, భాగస్వామ్యాలను విడదీస్తాడు. ట్రెడిషనల్ స్పిన్నర్ అయిన మల్లికార్జున ఈ సీజన్ లో సత్తా చాటి ఐపీఎల్ గడప తొక్కాలని భావిస్తున్నాడు.

# యశస్వి జైస్వాల్ మరో వీరేంద్ర సెహ్వాగ్

## జైస్వాల్ బ్యాటింగ్ తీరు అందరి దృష్టిని ఆకర్షించింది ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైఖేల్ క్లార్క్

భారత టెస్ట్ జట్టు ఓపెనర్ యశస్వి జైస్వాల్ ఇటీవల రెండు సెంచరీలతో అద్భుతమైన ప్రదర్శన కనబరిచారు. ముఖ్యంగా ఇంగ్లండ్ జట్టుతో జరిగిన టెస్ట్ సిరీస్‌లో జైస్వాల్ బ్యాటింగ్ తీరు అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ అద్భుతమైన ఆటతీరుకు గానూ యశస్వి జైస్వాల్ మరోసారి వార్తల్లో నిలిచారు. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైఖేల్ క్లార్క్ యశస్వి జైస్వాల్‌ను ఎంతగానో ప్రశంసించారు. ఆయన మాట్లాడుతూ.. యశస్వి జైస్వాల్ బ్యాటింగ్ చూసినప్పుడు తనకు వీరేంద్ర సెహ్వాగ్ గుర్తుకు వస్తారని అన్నారు. భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగిన 5 టెస్టుల సిరీస్‌లో భాగంగా.. ఐదో టెస్ట్ మ్యాచ్‌ను మైఖేల్ క్లార్క్ సమీక్షిస్తూ యశస్వి జైస్వాల్‌ను అభినందించారు. ఈ మ్యాచ్‌లో యశస్వి జైస్వాల్ రెండో ఇన్నింగ్స్‌లో 118 పరుగులు చేశారు. ఈ ఇన్నింగ్స్‌తో టీమిండియా ఇంగ్లండ జట్టు ముందు 374 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. ఈ మ్యాచ్‌లో భారత జట్టు 6 పరుగుల తేడాతో విజయం సాధించి సిరీస్‌ను 2-2తో సమం చేసింది. ఈ విజయంపై మైఖేల్ క్లార్క్ మాట్లాడుతూ.. "మొదటి రోజు పిచ్ చూసిన తర్వాత ఈ మ్యాచ్ ఐదు రోజుల పాటు జరుగుతుందని ఎవరూ ఊహించి ఉండరు. మొదటి ఇన్నింగ్స్‌లో రెండు జట్లు కూడా మంచి స్కోరు సాధించడానికి చాలా కష్టపడ్డాయి." అని అన్నారు. మైఖేల్ క్లార్క్ ఇంకా మాట్లాడుతూ.. "మొదటి ఇన్నింగ్స్‌లో పిచ్ చాలా పచ్చగా ఉంది. కానీ రెండో



ఇన్నింగ్స్‌లో భారత్ 396 పరుగులు సాధించడం మ్యాచ్‌ను మలుపు తిప్పింది. రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ పరిస్థితులు మెరుగయ్యాయి. కానీ యశస్వి జైస్వాల్ ఆడిన తీరు అద్భుతం. రాబోయే కాలంలో అతను ఒక సూపర్ స్టార్ అవుతాడని నేను భావిస్తున్నాను. క్రికెట్‌లో ఎన్నో ఘనతలు సాధిస్తాడు. జైస్వాల్ బ్యాటింగ్ నాకు వీరేంద్ర సెహ్వాగ్‌ను గుర్తు చేస్తుంది." అని మైఖేల్ క్లార్క్ పేర్కొన్నారు. సెహ్వాగ్ బ్యాటింగ్‌ను గుర్తుచేసుకుంటూ మైఖేల్ క్లార్క్ మాట్లాడుతూ.. "వీరేంద్ర సెహ్వాగ్ క్రీజులో ఉన్నప్పుడు అతడిని ఆపడం అసాధ్యం. ఇప్పుడు యశస్వి జైస్వాల్ బ్యాటింగ్‌లో కూడా అలాంటి మెరుపులు కనిపిస్తున్నాయి. అతను ఒక అద్భుతమైన ఆటగాడు, చాలా ప్రతిభావంతుడు" అని మైఖేల్ క్లార్క్ ప్రశంసించారు.

# భారత క్రికెటర్ల రక్షా బంధన్ సెలబ్రేషన్స్

దేశ వ్యాప్తంగా నేడు (ఆగస్టు 9న) సోదర సోదరీమణుల పండుగ రక్షాబంధన్ జరుపుకుంటున్నారు. భారత క్రికెటర్లు తమ సోదరీమణులతో కలిసి రక్షాబంధన్ వేడుకలు జరుపుకున్నారు. క్రికెటర్లు తమ రక్షాబంధన్ వేడుకల ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఫ్యాన్స్ తమ అభిమాన క్రికెటర్ల రాఖీ వేడుకల ఫొటోలు, వీడియో పోస్టులు లైక్స్, కామెంట్ చేస్తున్నారు. వీరేంద్ర సెహ్వాగ్, సురేష్ రైనా, శ్రేయాస్ అయ్యర్, సూర్యకుమార్ యాదవ్, రింకు సింగ్, నితీష్ కుమార్ రెడ్డి, ఆకాశ్ దీప్, రిషబ్ పంత్, రవి బిష్ణోయ్, అర్జున్ టెండూల్కర్ సహా చాలా మంది క్రికెటర్లు ఘనంగా జరుపుకున్నారు. రక్షాబంధన్ వేడుకల్లో భాగంగా అక్కాచెల్లెళ్లు తన సోదరుడికి రాఖీ కడుతారు. తన సోదరికి అన్ని విధాలా మద్దతు ఇస్తానని, వారికి ఏ కష్టం వచ్చినా అండగా నిలుస్తానని వాగ్దానం చేస్తాడు. అలాగే, సోదరుడు తన సోదరికి తమకు తోచిన బహుమతి ఇస్తాడు. తన సోదరుడు ఎన్నో విజయాలు సాధించాలని, అతడు మరింత ఉన్నత స్థానానికి ఎదగాలని సోదరి ఆకాంక్షిస్తుంది.





## దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే, సెల్వమణి సెల్వరాజ్, వేఫేరర్ ఫిల్మ్స్, రానా దగ్గుబాటి, స్పిరిట్ మీడియా కాంత నుంచి ఫస్ట్ సింగిల్ వింటేజ్ లవ్ మెలోడీ హే పసి మనసే రిలీజ్

**దుల్కర్ సల్మాన్ పీరియాడికల్ మూవీ 'కాంత' టీజర్‌తో సంచలనం సృష్టించింది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన ఈ తమిళ-తెలుగు ద్విభాషా చిత్రంలో దుల్కర్ సరసన భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటించింది. సముద్రఖని కీలక పాత్ర పోషిస్తున్నారు. స్పిరిట్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, వేఫేరర్ ఫిల్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు.**

కాంత ఫస్ట్ సింగిల్ హే పసి మనసేను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ సాంగ్ ని వింటేజ్ వరల్డ్ రోమాన్స్ ని ప్రజెంట్ చేసేలా కంపోజ్ చేశారు మ్యూజిక్ డైరెక్టర్ ఝాను చంతర్. మెలోడీతో నిండిన ఆ కాలపు మ్యూజిక్ ఫీలింగ్‌ని మళ్లీ గుర్తు చేశారు. కృష్ణ కాంత్ రాసిన లిరిక్స్ ప్రేమలోని ప్రయాణాన్ని అందంగా ప్రజెంట్ చేస్తే, ప్రదీప్ కుమార్ – ప్రియాంకా ఎన్‌కే వోకల్స్ మనసుని హత్తుకున్నాయి.

విజువల్స్ రెట్రో మ్యూజిక్ థీమ్‌కే తగ్గట్టు, అద్భుతమైన సెట్స్, కాస్ట్యూమ్స్‌తో వింటేజ్ సినిమా వాతావరణాన్ని తెరమీదకు తెచ్చాయి. దుల్కర్ సల్మాన్ – భాగ్యశ్రీ బోర్స్ కెమిస్ట్రీ వింటేజ్ ప్రేమకథకి రియల్ ఫీల్ ని తీసుకొచ్చింది.
ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ డానీ సాంచెజ్ లోపెజ్, ఆర్ట్ డైరెక్షన్‌ను థా. రామలింగం. అదనపు స్క్రీన్‌ప్లేను తమిళ్ ప్రభ ఇచ్చారు. లెవెలిన్ ఆంథోనీ గోన్సాల్వెస్ ఎడిటర్. 'కాంత' సెప్టెంబర్ 12న థియేటర్లలో రిలీజ్ కానుంది.

## బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్, కౌశిక్ పెగల్లపాటి, సాహు గారపాటి, షైన్ స్క్రీన్స్ కిష్కిందపురి సెప్టెంబర్ 12న రిలీజ్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ అప్ కమింగ్ హారర్–మిస్టరీ థ్రిల్లర్ కిష్కిందపురిలో బోల్డ్, ఇంటెన్స్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 12న విడుదల కానుంది. కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వంలో, షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మించిన ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్ మహిళా కథానాయికగా నటించింది. హారర్, మిస్టరీ, ఎమోషనల్ ఎలిమెంట్స్ తో వస్తున్న కిష్కిందపురి ఈ సీజన్‌లో మోస్ట్ ఎవైటెడ్ మూవీలో ఒకటి. రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్‌తో పాటు అదిరిపోయే పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. బెల్లంకొండ శ్రీనివాస్ ఇంటెన్స్ లుక్ లో కనిపించిన ఈ పోస్టర్ సస్పెన్స్ మరింత పెంచింది,



ఆయన ముందు ఒక వింటేజ్ రేడియో విరిగి ఎగిరిపోతూ కనిపిస్తుంది. బ్యాక్‌గ్రౌండ్‌లో టెర్రిఫిక్ మాన్షన్ తో పాటు మంటల్లో కాలి పోతున్న వాన్ కనిపించడం థ్రిల్లింగ్ గా వుంది
ఫస్ట్ గ్లింప్స్‌లోనే ప్రేక్షకులు సినిమా సస్పెన్స్ ప్రిమైజ్ ని ఫీల్ అయ్యారు. తాజాగా రిలీజ్ అయిన ఫస్ట్ సింగిల్ "ఉండిపోవే నాతోనే" మాత్రం పూర్తిగా వేరే మూడ్ సెట్ చేసింది. కథలో టెన్షన్‌తో పాటు ఒక రొమాంటిక్ షేడ్ ని ప్రజెంట్ చేసింది.
డైరెక్టర్ కౌశిక్ పెగల్లపాటి, కిష్కిందపురి డార్క్, మిస్టీరియస్ వరల్డ్‌ను చూపిస్తూ, దానికి కాంట్రాస్ట్‌గా ఎమోషనల్ మూమెంట్స్ ని చక్కగా మిక్స్ చేశారు. కథ ముందుకు సాగే కొద్దీ థ్రిల్స్‌తో పాటు ఎమోషన్స్ కలిసిన లేయర్డ్ ఎక్స్‌పీరియెన్స్ ఇవ్వబోతోంది.
సినిమా కోసం టాలెంటెడ్ టెక్నికల్ టీం పని చేస్తోంది. సామ్ సి.ఎస్ మ్యూజిక్. చిన్మయ్ సలస్కర్ డీవోపీ, ప్రొడక్షన్ డిజైన్ మనిషా ఎ. దత్, ఆర్ట్ డైరెక్టర్ డి.శివ కమేష్, ఎడిటింగ్ నిరంజన్ దేవరమనే. క్రియేటివ్ హెడ్‌గా జి. కనిష్క, కో–రైటర్‌గా దరహాస్ పళకొళ్ళు, స్క్రిప్ట్ అసోసియేట్‌గా కె. బాల గణేష్ పని చేస్తున్నారు. సెప్టెంబర్ 12కి రిలీజ్ డేట్ ఫిక్స్ కావడంతో మేకర్స్ మరింత దూకుడుగా ప్రమోషన్స్ చేయబోతున్నారు.



## ఫిల్మ్ ఫెడరేషన్ సభ్యులమని చెప్పుకుంటున్న కొంతమంది వ్యక్తులు మీడియాలోకి వెళ్లి, నేను వారిని కలిసి, 30% వేతన పెంపు వంటి వారి డిమాండ్లను అంగీకరించానని తప్పుడు ప్రకటనలు చేశారు

ఈ సందర్భంలో నిజం ఏంటో స్పష్టంగా చెప్పదలచుకున్నాను. నేను ఫెడరేషన్‌కి చెందిన ఎవరినీ కలవలేదు. ఇది పరిశ్రమ మొత్తానికి సంబంధించిన విషయం. ఏ వ్యక్తిగతంగా అయినా, నేను సహా, ఏకపక్షంగా ఇలాంటి సమస్యలకు హామీ ఇవ్వడం లేదా పరిష్కారం చూపడం సాధ్యం కాదు.

తెలుగు చిత్ర పరిశ్రమలో ఫిల్మ్ ఛాంబర్‌నే అగ్ర సంస్థ. అన్ని వర్గాలతో చర్చలు జరిపి న్యాయసమ్మతమైన పరిష్కారానికి రావడం ఫిల్మ్ ఛాంబర్ సమిష్టి బాధ్యత. అంతవరకు, అన్ని పక్షాల్లో గందరగోళం సృష్టించే ఉద్దేశ్యంతో చేసిన ఇలాంటి నిరాధారమైన మరియు ప్రేరేపిత ప్రకటనలను నేను ఖండిస్తున్నాను. దయచేసి గమనించండి.

- మెగాస్టార్ చిరంజీవి

## సక్సెస్ ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం " K-ర్యాంప్" సినిమా నుంచి 'ఓనమ్' లిరికల్ సాంగ్ రిలీజ్, దీపావళి పండుగ సందర్భంగా అక్టోబర్ 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తున్న మూవీ

సక్సెస్ ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా " K-ర్యాంప్". ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్ల మీద సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. యుక్తి తరేజా హీరోయిన్‌గా నటిస్తోంది. " K-ర్యాంప్" సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ దీపావళి పండుగ సందర్భంగా అక్టోబర్ 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది.



ఈ రోజు " K-ర్యాంప్" సినిమా నుంచి 'ఓనమ్' లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. ఈ పాటకు సురేంద్ర కృష్ణ లిరిక్స్ రాయగా, ఎనర్జిటిక్ ట్యూన్ తో కంపోజ్ చేసి సాహితీ చాగంటితో కలిసి పాడారు మ్యూజిక్ డైరెక్టర్ చేతన్ భరద్వాజ్. 'ఓనమ్' లిరికల్ సాంగ్ ఎలా ఉందో చూస్తే – ' ఇన్‌స్టా ఆపేశానే, ట్విట్టర్ మానేశానే, నీకే ట్యాగ్ అయ్యానే మలయాళీ పిల్లా, ఫోనే మార్చేశానే, ఛాటింగ్ ఆపేశానే, నీకే సింక్ అయ్యానే వదలను ఇల్లా..వైబే వచ్చేసిందే నిన్నే చూడగానే, లెఫ్టే ఉన్న గుండె రైటు రైటందే...' అంటూ మాస్ మెలోడీతో ఆకట్టుకునేలా సాగుతుందీ పాట. కేరళ పండుగ ఓనమ్ సందడి అంతా ఈ పాటలో కనిపించింది. 'ఓనమ్' పాటలో హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ యుక్తి తరేజా మాస్ స్టెప్స్ స్పెషల్ అట్రాక్షన్ గా మారాయి.

## వద్దే నవీన్ హీరోగా, నిర్మాతగా రూపొందుతున్న 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' ఫస్ట్ లుక్ విడుదల.. శరవేగంగా చిత్రీకరణ

"వద్దే నవీన్" హీరోగా, నిర్మాతగా రూపొందుతున్న "ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు" ఫస్ట్ లుక్ విడుదల. వద్దే జిష్ణు సమర్పణలో "వద్దే క్రియేషన్స్" బ్యానర్ మీద వద్దే నవీన్ హీరోగా నిర్మాతగా చేస్తున్న చిత్రం "ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు", కమల్ తేజ నార్ల ఈ మూవీకి దర్శకత్వం వహిస్తున్నారు డైరెక్టర్ తో పాటు కథ స్క్రీన్ ప్లే ను వద్దే నవీన్ ఈ చిత్రానికి అందించడం విశేషం. ఇక ఈ మూవీలో వద్దే నవీన్ కి జోడీగా రాశి సింగ్ నటిస్తున్నారు. వద్దే నవీన్ తండ్రి శ్రీ వద్దే రమేష్ గారు తెలుగు సినిమా ఇండస్ట్రీలో ప్రముఖ నిర్మాత అని అందరికీ తెలిసిందే. ఆయన సంస్థ అయిన "విజయ మాధవి కంబైన్స్" నుంచి ఎన్టీఆర్‌తో "బొబ్బిలి పులి", మెగాస్టార్ చిరంజీవితో




"లంకేశ్వరుడు", రెబల్ స్టార్ కృష్ణరాజు తో "కటకటాల రుద్రయ్య", ఏఎన్‌ఆర్ ఇంకా కృష్ణ గారు లాంటి ఎందరో పెద్ద పెద్ద స్టార్లతో చిత్రాలు నిర్మించి "మోస్ట్ సక్సెస్ఫుల్" నిర్మాణ సంస్థగా రూపొందింది. ఇప్పుడు ఆ నిర్మాణ సంస్థ కొనసాగింపుగా "వద్దే క్రియేషన్స్" అనే బ్యానర్ ని స్థాపించి, వద్దే నవీన్ తండ్రి బాటలో పయనించాలని నిర్ణయించుకుని ఇకపై "వద్దే క్రియేషన్స్ బ్యానర్"లో సినిమాలు రూపొందించాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగానే మొదట చిత్రం గా "ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు" నిర్మిస్తున్నారు. గత కొన్నేళ్లుగా వద్దే నవీన్ సినిమాలకు దూరంగా ఉంటున్న సంగతి తెలిసిందే, ఇక ఆయన త్వరలోనే "ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు" చిత్రంతో అందరిని అలరించబోతునారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ మే 15, 2025 , నుండి మొదలై ఇప్పటివరకు దాదాపు 80 శాతం చిత్రీకరణ పూర్తయినట్లుగా సమాచారం. తాజాగ రిలీజ్ చేసిన ఈ మూవీ "ఫస్ట్ లుక్" అందర్నీ ఆకట్టుకుంది. ఈ "ఫస్ట్ లుక్" పోస్టర్ ని గమనిస్తే కామెడీ యాంగిల్ కూడా వద్దే నవీన్ ఇందులో మరింతగా చూపించబోతున్నారని అర్థమవుతుంది. వద్దే నవీన్, రాశీ సింగ్ జంటగా నటిస్తున్న ఈ చిత్రంలో రఘు బాబు, సాయి శ్రీనివాస్, బాబా మాస్టర్, శిల్పా తులస్కర్, వివేక్ రఘువంశీ, దేవీ ప్రసాద్, సూర్య కుమార్ భగవదాస్, శివ నారాయణ, ప్రమోదిని, గాయత్రి భార్గవి, జ్వాల కోటి, దేవి మహేష్, ఊహా రెడ్డి, రేఖా నిరోష, గాయత్రి చాగంటి, సాత్విక్ రాజు, అంజలి ప్రియ వంటి వారు కీలక పాత్రలను పోషించారు.
ఈ మూవీకి కార్తిక్ సుజాత సాయికుమార్ కెమెరామెన్‌గా, కళ్యాణ్ నాయక్ సంగీత దర్శకుడిగా, విజయ్ ముక్తావరపు ఎడిటర్‌గా పని చేశారు.

## నితిన్ జోడికి బ్యాడ్ లుక్ బ్యూటీ


టాలీవుడ్ కుర్ర హీరో నితిన్. జయం సినిమాతో హీరోగా పరిచయమైన నితిన్ ఆతర్వాత దిల్ సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నాడు. ఆతర్వాత వరుసగా సినిమాలు చేశాడు. కానీ నితిన్ ఖాతాలో హిట్స్ మాత్రం పడలేదు. అప్పట్లో నితిన్ వరుసగా 13 ఫ్లాప్స్ అందుకున్నాడు. రాజమౌళి దర్శకత్వంలో నితిన్ సై అనే సినిమా చేశాడు. ఈ సినిమా భారీ హిట్



అందుకుంది. ఈ సినిమా తర్వాత వరుసగా 13 ఫ్లాప్స్ అందుకున్నాడు. చాలా కాలం తర్వాత ఇష్క్ సినిమాతో హిట్ అందుకున్నాడు. ఇష్క్ తర్వాత, గుండె జారీ గల్లంతయ్యిందే సినిమాతో హిట్స్ అందుకున్నాడు. ఆతర్వాత వరుసగా సినిమాలు చేశాడు. ఆ మధ్య వెంకీ కుడుముల దర్శకత్వంలో భీష్మ సినిమా చేశాడు. ఈ సినిమా హిట్ అయ్యింది. భీష్మ సినిమా హిట్ తర్వాత యధావిధిగా వరుసగా ఫ్లాప్స్ అందుకున్నాడు. రీసెంట్ డేస్ లో నితిన్ సినిమాలన్నీ ఫ్లాప్ అవుతున్నాయి. మాచర్ల నియోజకవర్గం, రాబిన్ హుడ్ ఫ్లాప్ అయ్యాయి. రీసెంట్ గా తమ్ముడు సినిమాతో మరో ఫ్లాప్ తన ఖాతాలో వేసుకున్నాడు. మంచి అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా దారుణంగా ప్రేక్షకులను నిరాశపరిచింది. ఇక ఇప్పుడు ఎల్లమ్మ అనే సినిమా చేస్తున్నాడు. ఈ సినిమాకు జబర్దస్త్ వేణు దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే వేణు బలగం సినిమాతో మంచి విజయాన్ని అందుకున్నాడు. ఇప్పుడు మరోసారి తెలంగాణ బ్యాడ్రాప్ లో ఎల్లమ్మ అనే సినిమా చేస్తున్నాడు.

## కాంతార టీమ్‌ను వెంటాడుతున్న విషాదాలు

రిషబ్ శెట్టి దర్శకత్వంలో రూపొందుతున్న 'కాంతార చాప్టర్?1' సినిమా షూటింగ్ ప్రారంభమైనప్పటినుంచే టీమ్‌ను అనేక ప్రమాదాలు, విషాద సంఘటనలు కలవరపెడుతున్నాయి. తాజాగా, ప్రముఖ కన్నడ నటుడు టి. ప్రభాకర్ కళ్యాణి గుండెపోటుతో మరణించారు. ఉడిపిలోని హిరియడ్కలోని తన నివాసంలో ఆయన కుప్పకూలి చనిపోయారు. ఆయనకు గుండెకి సంబంధించిన చికిత్స జరిగినట్టు సమాచారం. కొద్ది రోజుల క్రితం ఆయన కళ్లు తిరిగి పడిపోవడంతో ఆసపత్రికి తీసుకెళ్లి వైద్యం అందించారు. చికిత్స తర్వాత బాగానే ఉన్నా, హఠాత్తుగా గుండెపోటు రావడంతో కన్నుమూసారు.గత కొద్ది రోజులుగా కాంతార ఛాప్టర్ 1మూవీకి సంబంధించిన ఎవరో ఒకరు ఇలా కన్నుమూస్తుండడం ఆందోళన కలిగిస్తుంది. కాంతార చాప్టర్ 1 సినిమా షూటింగ్ ప్రారంభమైనప్పటి నుంచీ వరుసగా ప్రమాదాలు, విషాద సంఘటనలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. గత నవంబర్‌లో జూనియర్ ఆర్టిస్టులను తీసుకెళ్తున్న వ్యాన్‌కి ప్రమాదం జరగడంతో చాలా మందికి గాయాలు అయ్యాయి.ఆ తర్వాత మళయాళీ జూనియర్ ఆర్టిస్ట్ కపిల్ (33) నదిలో మునిగి చనిపోవడం, హాస్యనటుడు రాకేష్ పూజారి (33) గుండెపోటుతో మరణించడం వంటి సంఘటనలు చిత్ర బృందాన్ని కలవరపరిచాయి. ఇటీవల కళాభవన్ నిజూ కూడా గుండెపోటుతో మరణించినట్టు శాండల్ వుడ్ వర్గాలు తెలిపాయి. మరోవైపు కర్ణాటక రాష్ట్రం శివమొగా జిల్లా మణి జలాశయంలో షూటింగ్ జరుగుతున్న సమయంలో బోటు తిరగబడి నటుడు–దర్శకుడు రిషబ్ శెట్టితో పాటు 30 మంది నీటిలో పడిపోయినట్టు ఇటీవల వార్తలు చ్చాయి. అయితే, హొంబాలే ఫిలింస్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఆదర్శ్ ఈ వార్తలను ఖండిస్తూ.. గాలి వాన వల్ల సెట్ కూలింది తప్ప ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు అని ఆయన తెలియజేశారు. గతంలో కూడా గాలి వాన వలన కాంతార టీమ్ వేసిన భారీ సెట్ కుప్పకూలింది. ఆ సమయంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే మూవీ రిలీజ్‌కి దగ్గర పడుతున్న సమయంలో ఇలాంటి ఘటనలు టీమ్‌ని టెన్షన్‌కి గురి చేస్తుంది. ఈ సినిమాకోసం హీరో కమ్ డైరెక్టర్ రిషబ్ శెట్టి చాలా హార్డ్ వర్క్ చేశాడు. ప్రత్యేకమైన యుద్ధ కళను కూడా నేర్చుకున్నాడు, భారీ బడ్జెట్ తో పాన్ ఇండియా రేంజ్ లో రూపొందుతున్న ఈ చిత్రాన్ని అక్టోబర్ 2 విడుదల చేయబోతున్నారు.



## సల్మాన్‌తో కలిసి నటిస్తే చంపేస్తాం : బిష్ణోయ్‌గ్యాంగ్


ప్రముఖ హిందీ హాస్య నటుడు కపిల్ శర్మ కెఫెపై దుండగులు మరోసారి కాల్పులు తెగబడిన విషయం తెలిసిందే. కెనడాలోని ఆయన నడుపుతున్న కప్స్ కెఫెపై గురువారం కొందరు తుపాకులతో కాల్పులు జరిపారు. కారులో వచ్చి.. కెఫెకు సమీపంగా వెళ్తూ దాడికి పాల్పడిన వీడియో నెట్టింట వైరలవుతోంది. నెల రోజుల వ్యవధిలోనే ఇది రెండో కాల్పుల ఘటన. ఇది తమ పనే అని గ్యాంగ్‌స్టర్ గోల్డీ ధిల్లాన్ ఆన్‌లైన్ పోస్ట్ ద్వారా వెల్లడించాడు. బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్‌తో ఉన్న సాన్నిహిత్యం కారణంగానే హాస్యనటుడిని లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన ఆడియో ఒకటి తాజాగా వెలుగులోకి వచ్చింది. లారెన్స్ బిష్ణోయ్ గ్రూప్‌నకు చెందిన హ్యారీ బాక్సర్ అనే వ్యక్తి ఈ ఆడియోను రికార్డ్ చేశాడు. 'కపిల్ శర్మకు చెందిన రెస్టారంట్‌లో ఇటీవల, ఇప్పుడు కాల్పులు జరిగాయి. నెట్‌ఫ్లిక్స్ షోకి సల్మాన్‌ఖాన్‌ను ఆహ్వానించడమే అందుకు కారణం' అని ఆడియోలో



పేర్కొన్నాడు. సల్మాన్‌ఖాన్‌తో పనిచేసే దర్శకుడు, నిర్మాత, నటులను చంపేస్తానంటూ అతడు హెచ్చరికలు చేశాడు. 'సల్మాన్‌తో కలిసి ఎవరైనా పనిచేస్తే.. అది చిన్న నటుడైనా, చిన్న దర్శకుడైనా సరే మేము ఎవరినీ వదిలిపెట్టము. చంపేస్తాం. వారిని చంపడానికి ఎంతకైనా తెగిస్తాము' అని అందులో బెదిరించాడు. జూలై నెలలో కెనడాలో కపిల్ కప్స్ కెఫెను ప్రారంభించారు. కెఫెన్ తెరిచిన కొన్నిరోజులకే సిబ్బంది లోపల ఉండగానే ఉదయం 1:50 సమయంలో పలుమార్లు కాల్పులు జరిపారు దుండగులు. కెఫె కిటికీలపై పది బుల్లెట్ రంధ్రాలు ఏర్పడ్డాయి. అయితే.. అదృష్టవశాత్తూ ఆ ఘటనలో ఎవరికీ ఎలాంటి హానీ జరగలేదు. 'ది కపిల్ శర్మ షో'తో పాపులర్ అయిన కపిల్ హీరోగాను వెండితెరపై మెరిశాడు. క్రూ, ఫిరంగీ, ట్యూబ్‌లైట్, కిస్ కిస్కో ప్యార్‌కరూన్ వంటి బాలీవుడ్ చిత్రాల్లో నటించాడీ కామెడీ కింగ్.

## చాన్సుల కోసం అందాల ఆరబోత

ఉప్పెన సినిమాతో మెగాస్టార్ మనసు దోచిన ఈ బ్యూటీ.. చిరు ఆన్ స్టేజ్ చెప్పినట్టు.. ఇండస్ట్రీలో ఎక్కడికో వెళ్లిపోతుందని అందరూ అనుకున్నారు. కానీ చివరికి ఎక్కడికీ పోకుండా సినిమా అవకాశాలే లేకుండా.. మిగిలిపోయారు. వరుస ఫ్లాప్‌లతో సతమతమవుతూ.. మేకర్స్ వైపు అవకాశం కోసం ఆశగా చూసే వరకు పరిస్థితి తెచ్చుకున్నారు. అయితే ఇలాంటి ఈ సిట్యువేషన్‌లో.. కృతి షెట్టి ఓ ఫోటో షూట్‌తో కాస్త బోల్డ్ గా కనిపించారు. తాను హద్దులు దాటేందుకు రెడీ అన్నట్టుగా మేకర్స్ కు హింట్ ఇచ్చారు. ఆ ఫోటోలతో నెట్టింట కూడా తెగ వైరల్ అవుతున్నారు. కానీ అవే ఫోటోలతో మేకర్స్ మైండ్‌లో రిజిస్టర్ అయ్యారా? లేదా అనేది ఇక్కడ పాయింట్. పాన్ ఇండియా సినిమాలు.. మార్కెట్ అంచనాలు.. ప్రేక్షకుల నాడీని పట్టుకోడాలు.. ఓ సినిమా తెరకెక్కించేందుకు.. ఆ సినిమాలో ఆర్టిస్టులను క్యాస్ట్ చేసేందుకు... ఇలాంటి అంశాలనుపట్టుకునే మేకర్స్ ఇప్పుడు ఈమె బోల్డ్ ఫోటోలను చూసి ఛాన్స్ ఇస్తారా? లేక టూ లేట్ అంటూ.. లైట్ తీసుకుంటారా? అనేది ఇక్కడ పాయింట్. అయితే మేకర్స్ పాయింట్ ఆఫ్ వ్యూను పక్కక పెడితే.. ఇప్పుడు అందాలు ఆరబోసి ఏం లాభం అనేది నెటిజన్స్ కామెంట్. ప్రస్తుతం సోషల్ మీడియా ఖాతాలలో గ్లామర్ ఫోజులతో మెంటలెక్కిస్తోంది ఈ వయ్యారి. ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోస్ చూసి షాకవుతున్నారు నెటిజన్స్. ప్రస్తుతం కృతికి తెలుగులో ఒక్క సినిమా ఛాన్స్ రావడం లేదు. కానీ తమిళం, మలయాళంలో మాత్రమే ఈ అమ్మడు అవకాశాలు అందుకుంటూ ఫుల్ బిజీగా ఉంటుంది. మరోవైపు నెట్టింట గ్లామర్ ఫోటోలతో రచ్చ చేస్తుంది.



Editor, Printed, Published and Owned by Sudheer Kumar, Printed at Ratna Graphics , # 2-3-703/7, Thirumala Nagar Colony, Opposite : Police Line , Amberpet, Hyderabad-500013, Published At H.NO. 6-3-553/G2, ClassicCourt Anexa, opp: NKM Grand, Erramanzil Colony, Somajiguda, Hyderabad-500038, T.S. E-Mail: info.southindiatimes@gmail.com. ,Contact :9000657700. RNI NO. APTEL/2012/46756